
ఆంధ్రసచిత్రవార

పత్రిక




4-5-62

25 నయాపైసలు



ప రీ క్ష ణ


కాల్గేట్ వాడి నోటినించి దుర్వాసన రాకుండా చేసుకోండి
రోజంతా దంతక్షయం రాకుండా కూడా కాపాడుకోండి!
ఎందుకంటే: ఒక్క సారి తోముకొంటేనే కాల్గేట్ డెంటల్ క్రీమ్ నోటిలో దుర్వాసన మరియు దంతక్షయమునకు కారణమైన సూక్ష్మ క్రిములను 85% వరకు తొలగించును.
కాల్గేట్ 10 మందిలో 7 గురికి నోటి దుర్గంధమును వెంటనే ఆపుతుందని మరియు భోజనము అవగానే కాల్గేట్ పద్ధతిలో పళ్ల తోముకొనుట ద్వారా ఎక్కువ మందికి ఎక్కువ దంతక్షయము అరికట్టిందని, దంత శాస్త్ర చరిత్రలో పూర్వము ఎన్నడూ తెలియనంతటా శాస్త్ర పరిశోధనం ఫలితముగా నిరూపించబడినది!
ఉరికే నోటిలో పళ్ల తోముకొని పుక్కిలించుట చాలదు. భోజనము అయిన వెంటనే క్రమం తప్పకుండా కాల్గేట్‌తో పళ్ల తోముకోండి. దాని చురుకైన నురుగు పళ్ల మధ్య కనపడకుండా ఉండే సందులలోనికి వెళ్లి నోటి దుర్వాసనకు మరియు దంతక్షయమునకు కారణమైన కుళ్లి పోతున్న ఆహారపు తునకలను తీసివేస్తుంది.
పిల్లలు కాల్గేట్‌తో పళ్లతోము కొనుటకు యిష్టపడతారు. ఎందుకంటె చాల సేపు ఉండే దాని పిప్పరమెంటు వంటి రుచి అంటే వారికి ప్రీతి!
COLGATE DENTAL CREAM
COLGATE DENTAL CREAM
కాల్గేట్‌తో క్రమం తప్పకుండా పళ్ల తోముకొంటే
✔ నోటి దుర్వాసనను పోగొట్టును
✔ దంతక్షయమును నిరోధించును
✔ పళ్లను మెరుస్తూ ఉండేలా ఉంచును
COLGATE TOOTH POWDER
మీకు పౌడరు కావాలంటే, ఈ లాభములన్నిటిని మీరు కాల్గేట్ టూత్ పౌడరు ద్వారా పొందగలరు
నోరు ఎక్కువ శుభ్రముగా, తాజాగా ఉండుటకు మరియు పళ్లు ఎక్కువ తెల్లగా ఉండుటకు
ప్రపంచములో ఏ యితర పళ్లు తోముకొనే క్రీమ్ కన్న కాల్గేట్ నే ఎక్కువ మంది వాడుతున్నారు



తప్పక చూడండి!
బాబూ మూవీస్
మంచి మనసులు
డైరెక్షన్: ఆదుర్తి సుబ్బారావు
నిర్మాత: సి. సుందరం
మ్యూజిక్: కె. వి. మహాదేవన్
రచన: ఆచార్య ఆత్రేయ
శ్రీ ఫిలింస్ రిలీజ్

NVKR

ఉత్తరాలు

హమేషా తమాషా

20—4—62 ఆంధ్రసచిత్రవారపత్రికలో "హమేషా—తమాషా" శీర్షికలో శ్రీపి. బాబూరావ్ (కాన్పూర్)గారు "మీరు చదువరానిది" అనేవిషయము వ్రాశారు. దానిని నేను చదువదలి చాను కాని....దానిమొదలే "ఈ విషయము మీరు చదువరాదు" అని ఉన్నది. అందకని నేను దానిని చదువలేదు. దానిలోని సారాంశము ఏమిటో కాస్త తెలియజేస్తారా? త్వరలో తెలియజేయండి!

కే. సూర్యకాంతారావు (బాల్కొండ)

పరవాలేదు. చదివి చూడండి.

*　　*　　*

"కేవలం హమేషా తమాషాగా వ్రాశానేగాని వారిచే విమర్శింపబడాలనే ఉద్దేశ్యంతో వ్రాయలేదే" అన్న కె. మీనావిజయ్‌గారి ఉత్తరాన్ని చూసి ఆశ్చర్య పోయాము. విమర్శింపబడాలనే ఉద్దేశ్యంతో వ్రాయక పోయినప్పటికి విమర్శించడం పఠితల 'హక్కు' అని ఈ సోదరి గ్రహించాలని నాసలహా.

కె. స్వర్ణకుమారి (హైదరాబాదు)

*　　*　　*

ముఖచిత్రం

20—4—62 సంచిక అట్టమీద బొమ్మలో (శ్రీబి.వి. సత్యమూర్తిగారు వేసిన చిత్రంలో) పెళ్లి చూపులు జరుగునపుడు చదువుల్రావు ఆ, లావాటి అమ్మాయిని చూచి నవ్వుతున్నాడు. ఆరావుకు అక్కడ యేమిపని మహాశయా?

జొలుగంటి అనంతరాజా (కాళహస్తి)

*　　*　　*

ముఖచిత్రముమీద, వధువుకు వెనుకప్రక్కన ఉన్నది చదువుల్రావేనా?

పి. ఎస్. బోస్‌రెడ్డి (నంద్యాల)

*　　*　　*

20—4—62 నాటి పత్రిక ముఖచిత్రం చూడగానే నవ్వు పుట్టుకొచ్చింది. చిత్రమయితే బాల బాగుందికాని, పెళ్లిపీటలమీద ఎవరూ చొక్కా వేసుకోవటం నేను చూడలేదు. పెళ్లి కూతురు కాలుపెట్టువైపు పీటకు కోడు ఉండగానే, పీటలేచి పెళ్ళికొడుకు ఎల్లా ఎగిరాడో తెలియ పరుస్తారా!

టి. వెం. శర్మ (సికింద్రాబాదు)

*　　*　　*

శ్రీ బి. వి. సత్యమూర్తిగారు చిత్రించిన కార్టూనులో పెండ్లిపీట అంత సన్నముగా ఉండుట ఏమీ బాగుగాలేదు.

పి. మణి (హైదరాబాదు)

*　　*　　*

సత్యమూర్తిగారు పెళ్ళికొడుక్కి ఇంత అన్యాయము చేస్తారని కలలో కూడ అనుకోలేదు. లేకపోతే ఏమిటండీ! కొత్త పెళ్ళికొడుకుకదా, కాస్త సారాణి పెడితే మీ సొమ్మేంపోయింది?!

నండూరి శాయిబాబు (గుంటూరు)

*　　*　　*

ఈవారం (27—4—62) సంచిక ముఖచిత్రం చాలా అసభ్యంగా ఉందని మేమంతా అనుకున్నాము. దేశనాయకుల బొమ్మలో, దేవుళ్ల బొమ్మలో అచ్చువేస్తే ఫ్రేము కట్టించుకోవచ్చు. ఇలాంటివి ఎందుకూ పనికిరావు.

ఎ. కె. ఎస్ శర్మ (విజయవాడ)

చదువుల్రావు

20—4—62 సంచికలో వై. వి. యల్. నరసింహారావుగారు (బందరు) "చదువుల్రావు"లో వ్రాసినదానిపై విమర్శిస్తూ ఆదివారము పరీక్షలు జరుగుట కలదా? అని అడిగారు. కాని హిందీ పరీక్షలు (దక్షిణభారత హిందీ ప్రచారసభ) ఆదివారంనాడే జరుగునని గుర్తించవలెను.

కె. జవహరు (విశాఖపట్టణం)

కథకానికథ

నేను చాలారోజులనుండి చూస్తున్నాను మీ ఆంధ్ర సచిత్రవారపత్రికలో 'కథకానికథ' ఒకవారం వేస్తే ఇంకొకవారం వెయ్యటంలేదు—కారణం.

పి. జతీన్‌కుమార్ (బర్‌హాంపూర్)

ప్రత్యేకంగా ఏదీలేదు.

సీరియల్ కథ

హరివంశములో సుదక్షిణచరిత్ర చాలా బాగుంటున్నది. ఆమె శౌర్యము, ఆమె హాస్యధోరణి, ఆమెభక్తి చక్కగా చిత్రిస్తున్నారు కవి. ఆ వ్రాయటంలో ప్రత్యేకత ముఖ్యంగా ఆకర్షిస్తున్నది.

రామలక్ష్మి (ఛత్రపూర్)

సినిమా బాలెట్

మీరు నిర్వహించే బాలట్ ఫలితాలకోసం చాలా ఆత్రంగా ఎదురుచూస్తున్నా! ఎవరెవరు గెలుస్తారో?

పి. వి. లలిత (చెంగల్‌పట్)

*　　*　　*

సినిమాలపై విమర్శలు నిశితంగా ఉండటంలేదు. అంతా బాగానే ఉంటున్నదని రాసేస్తున్నారు! ఇది మంచిపనికాదు.

ఎస్. వి. శేషాద్రి (వరంగల్)

*　　*　　*

మీరు కేవలం వార్తలేకాక, సినిమాకు సంబంధించిన వ్యాసాలుకూడా ప్రచురిస్తే చదివి ఆనందిస్తాను. వ్యాసాలంటే నా ఉద్దేశ్యం సినిమా పరిశ్రమకు సంబంధించిన వ్యాసాలు. సినిమా నటీనటులు రాసే (లేక రాయించుకునే!) స్వగతాలుకావు.

పి. రజనీకాంతరావు (సికింద్రాబాద్)

దేహస్థితి

నాను రాను డాక్టర్ బాలసుందరరావుగారి వ్యాసాలలో వైద్యశాస్త్రానికి సంబంధించని విషయాలపైన కూడా చర్చ జరుగుతోంది! డాక్టరుగారు ఇది గమనించ ప్రార్థన.

కె. వి. రంగారావు (విజయనగరం)

కథ

రంగధామ్‌గారి 'స్నేహం' ముగింపు నాకు నచ్చింది. అసలు కథాగమనమే చాలా బావుంది!

కె. వి. రెడ్డి (కర్నూలు)★

గమనిక

ఆంధ్ర సచిత్ర వారపత్రికకు పంపే రచనలు సంపాదకుడు, ఆంధ్ర సచిత్ర వారపత్రిక పేర మాత్రమే పంపాలి. వ్యక్తులపేర్లు వ్రాయవద్దని మనవి

ఆంధ్రసచిత్ర వారపత్రికలో ప్రకటనలు
మీ వ్యాపారాభివృద్ధికి తోడ్పడుతాయి

ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

విషయానుక్రమణిక

శుక్రవారం : 4-5-62

శుభ॥ సం॥ చైత్రమా॥ బ॥ అమా

సంపుటము : 54 సంచిక : 35

స్థాపితము:

1908

*

ముఖ్య సంపాదకుడు:

శివలెంక శంభుప్రసాద్

*

సంపాదకుడు :

శివలెంక రాధాకృష్ణ

*

విడిప్రతి : 25 న. పై

సంవత్సర చందా : 13-0-0 రు.

*

ఆంధ్రపత్రిక కార్యాలయము

7, తంబుచెట్టివీధి, మద్రాసు-1




"మంచిమనసులు"లో

నాగేశ్వరరావు, సావిత్రి.

లోకంపోకడ



"ఎందుకలా దిగులుపడతారు! మళ్లీ మంత్రుల్ని వేసుకునేప్పుడు మీకూ 'ఛాన్స్' దొరుకుతుంది లెండి."



కేంద్ర ఆర్థికమంత్రి శ్రీ మొరార్జీ దేశాయ్ బడ్జెట్ ప్రతిపాదనలకు
తుది రూపం ఇస్తున్నప్పటి చిత్రం.

హేమాహేమీలను కన్నపార్టీలో ప్రతిభాదారిద్ర్యం: తృతీయ ప్రణాళికలో భాగంగా గోవా ప్రణాళిక

శ్రీ కృష్ణ

రాష్ట్రపతి ప్రసంగం, వారి ఆరోగ్యానికి మల్లెనే పరమపేలవంగాఉంది. ఈప్రసంగాలు ప్రధానమంత్రే వ్రాస్తారని తెలుసుకోవటం అవసరం. అణుశక్తి, విదేశీవ్యవహారాల శాఖలు శ్రీ నెహ్రూ ఆధిపత్యం క్రింద ఉన్నాయి. కనుకనే రాష్ట్రపతి ప్రసంగంలో వీటి ప్రస్తావన కనిపిస్తుంది.

పార్లమెంటు ఉభయసభలు ఈ ప్రసంగంపై చర్చజరిపి, రాష్ట్రపతికి అభినందనలు తెల్పుతాయి. కొత్తగా ఎన్నికై వచ్చిన సభ్యులు తమ వాగ్ధాటిని ప్రదర్శించడానికి ఇది ప్రథమ అవకాశం. విదేశీ వ్యవహారాలశాఖ కేటాయింపులపై జరిగే చర్చలోనూ, అంతర్జాతీయ పరిస్థితినిగూర్చి ప్రధాన మంత్రి ప్రతిసారి ప్రారంభించే చర్చలోనూ వీరు పాల్గొంటారు.

ఉప సభాపతి ఎన్నిక వ్యవహారంలో ప్రతిపక్షాలు కయ్యానికి సిద్ధమయ్యాయి. ఈపదవికి ప్రతిపక్ష సభ్యుణ్ణి ఎన్నుకోవాలని వాదిస్తూ, ప్రతిపక్షాలన్నీ కలసి శ్రీ జైపాల్‌సింగ్‌ను అభ్యర్థిగా నిల్పాయి. అయితేనేమి కాంగ్రెసుపార్టీకి కట్టుకుపోయినంత మెజారిటీ ఉందికనుక ఇబ్బంది ఉండదు. ప్రతిపక్షాలు ఒక సంప్రదాయాన్ని సృష్టించడానికే (సభాపతి, ఉపసభాపతి పదవులకు అభ్యర్థులను నిర్ణయించటంలో ప్రతిపక్షాలతో సంప్రదించడం; ఉపసభాపతిని ప్రతిపక్షంనుంచే ఎన్నుకొనడం) ఇప్పుడీ పోటీకి సిద్ధమయ్యాయి.

కొత్త లోక్‌సభ తొలి సమావేశంలో ప్రథమంగా వినిపించిన ఉపన్యాసాలు చప్పగా ఉన్నాయి. అంతా అనుకునేట్లే ప్రధాన మంత్రిమాత్రం గొప్పగా ప్రసంగించారు. అయితే; ఆ ఉపన్యాసం కొంత క్లుప్తంగాఉంటే బాగుండేది. సేఠ్ గోవిందదాస్ తమ కీర్తి నిల్పుకున్నారు. సభాపతిగా వారు తమ అసమర్థతను రుజువు పరచుకున్నారు. ఆయనమాట్లాడిన హిందీ, హిందీ భాషోన్మాదులకే అర్థంకాలేదు! పండిత మోతీలాల్ నెహ్రూను, జివ్హాను తమ ప్రసంగంలో చొప్పించి ఆయన క్షమించరాని తప్పిదం చేశారు. పండిత మోతీలాల్ ఆకాలపు రాజకీయ నాయకులలో నిస్సందేహంగా అగ్రశ్రేణికి చెందినవారు. అది హేమాహేమీలయుగం. భారత రాజ్యాంగం అమలులోకివచ్చి పుష్కరంగడచినా, ఇప్పుడు కేంద్రమంత్రివర్గాన్ని చూస్తే ప్రతిభా దారిద్ర్యం కనిపిస్తుంది. ఈసందర్భంలో హిందూస్థాన్ టైమ్సు" పత్రిక సంపాదకులు చేసిన అమూల్యమైన వ్యాఖ్యలు ఇక్కడ ఉటంకించటం అవసరం: "మంత్రివర్గంలో ప్రతిభ కరువైనందువల్ల విప్లవాత్మకమైన మార్పులు ఆశించడానికి వీలులేకుండాఉన్నది. వెనుక శ్రీ నెహ్రూ ప్రభుత్వంలో ఉన్నవారందరూ గొప్పవారనుకునే వీలులేదు. గత అనుభవాన్ని పురస్కరించుకొని వీరు రామన్న ఐదు సంవత్సరాలలో ఎదురయ్యే

62—వ పేజీ చూడండి


సమస్య అని వినలేదే!
సమస్య అని అనలేదే!
సమస్యగా కనలేదే!
ప్రజలు
మంత్రి మండలిలో
వర్గాల వారికి స్థానమిచ్చే సమస్య
నెహ్రూగారి ఆరోగ్యం గురించి ఎంత కంగారుపడ్డాం!
అలవాటైన పనిభారం
ప్రజాస్వామ్యం ప్రాథమిక సూత్రాలు
రాచరికం ప్రాథమిక సూత్రాలు
పరస్పర ఉద్బోధ
OOMMEN



నిప్పులు కురిపిస్తున్న సూర్యుడికళ్లు హొప్పెట్టి సగం మూతపడేసరికి ఎండ తీవ్రత తగ్గింది. బిగిసిన వరాల్ని వదులుచేసుకుంటూ గడియారం అయిదు కొట్టింది. వాతావరణం ముఖంమీద నీళ్లు జల్లుకుని చల్లబడసాగింది. వేడికి జడిసి దాక్కున్న గాలి నెమ్మదిగా బయటికొచ్చి స్వేచ్ఛగా ఊపిరి వదలింది. ప్రకృతిలో కలుగుతున్న ఈ మార్పుల్ని గమనించకుండా, సీత హాయిగా నిద్రపోతోంది .... అన్వేషించి, అన్వేషించి దొరకనివస్తువు దొరికితే — చేరని గమ్యస్థానం చేరుకోగలిగితే—కలిగే ఆనందంతో నిండిన స్వప్న జగత్తులో మునిగిపోయింది.

శంకరం కాలుకాలిన పిల్లిలా అటూ యిటూ పచార్లు చేశాడు.

మధ్యాహ్నం రెండింటికి 'చిన్న కునుకు' తీస్తానంటూ పడుకున్న ఈ సీత కుంభకర్ణుడి వారసురాలా ఏమిటి ? మూడు నాలుగు సార్లు నిద్రను చెదరగొడదామని అనుకున్నా, ముఖం మీద చిందులాడే చిరునవ్వును చూచి ఆగిపోయాడు. నిజజీవితంలో దొరకని తృప్తి స్వప్నంలో దొరికితే తనెందుకు అడ్డుపడాలి ? బాధ్యత బరువుతో ఊపిరిసలుపని విశ్వబ్రహ్మ, ఒక్కనాడైనా హాయిగా విహరిద్దామని ఎక్కడికో పోయిందిగామోలు; బయట ఒకటే కోలాహలం — నిరంతర ప్రవాహంలా, గలగలమన్న మువ్వంచప్పుడు — 'శంభో మహాదేవా !' అంటూ కంటి కెదురుగా పార్వతీనాథుడు కనిపించకపోయినా, మనసులో అతని రూపాన్ని స్వచ్ఛంగా, నిర్దుష్టంగా, నిర్మలంగా ఊహించుకుని భక్తులు కదలిపోతున్నారు. ఆ సమయంలో అతన్నేదో అయస్కాంత శక్తి ఆకర్షించింది. ఇంక ఉండబట్టలేకపోయాడు. ఏడాది కోమారు వచ్చే పర్వదినం—ఆనాడు కూడా ఈ నిద్ర ? ....

'సీతా ! .... సీతా ! .... ఏమిటే అకాల నిద్ర ?' అంటూ పదిసార్లు అటూ యిటూ కదిపేసరికి ఆమె మేలుకుంది.



'వచ్చారా ! .... మీ కోసమే ఎదురు చూస్తున్నా — చూడండి ! .... ఈ బాబు ఒంటరిగా తీర్థానికి వెడతానంటున్నాడు. ఈ జనసమ్మర్దంలో తప్పి పోతే ఎక్కడని వెదకగలం ? .... ఇంకా నయం ! రథం కూడా లాగేస్తాడటండోయ్ ! కొంటె వెధవ ! .... కాస్త మందలించండి' అంది చిరు కోపంతో — ఆమెను పట్టిన నిద్ర ఇంకా తెర వెనక్కి జారుకోలేదు.

శంకరం ముఖం వాడిపోయింది.

బాబుకోసం అతను వెదకలేదు. ఎక్కడున్నాడో చూపెట్టమని సీతను అడుగనూ లేదు. అది ఉండి, లేని పుట్టుక మిథ్యా బింబాలిస్తున్న జీవం దానికి ఉంది. సీత దృష్టిలో బాబు, శ్రీరాముడికి మల్లే సర్వలక్షణ సమన్వితుడు. కృష్ణుడికి మల్లె కొంటెవాడు .... కాని అతని రూపం సీతకుమాత్రమే కనుపిస్తుంది. చిరకాలంగా మనసులో ఊరి ఊటలు వేసి, పిల్ల ప్రవాహాలలో చెలిమిచేసినద్దై, మహానదై, సముద్రమైన మూగబాధ అది. అది ఏ రూపంలో ఎప్పుడు బయటపడుతుందో, ఏయే శక్తుల్ని ముంచి వేస్తుందో ఎవరూ చెప్పలేరు.

'ఏ కింకా ఆవిచ్చి పోలేదన్నమాట !' అని నిట్టూర్చాడు శంకరం — సీత గది నాలుగువేపులా పరీక్షగా చూసింది.

'అంతా కలన్నమాట ! ....' అని అతని నిట్టూర్పును అందిపుచ్చుకుంది.

'నూటికి నూరువంతులు మిథ్య ! .... ఎందుకీ లేనిపోని ఆశలు ? మనకు ఎంత రాసిపెట్టి ఉందో అంతే !'

'చక్కటి కలసుమండి ! మీరే కలచివేశారు. బాబు అప్పుడే బడినుండి వచ్చాడు. ఎంత బాగున్నాడనుకున్నారు ? ఎర్రటి బుగ్గలు, పెద్ద కళ్ళు, బొద్దుగా, అందంగా, ఆరోగ్యంగా ఉన్నాడు. నా కంటి కింకా కనిపిస్తూనే ఉన్నాడు.'

౬౭— వ పేజీ చూడండి

జీవకణ కార్యక్రమము-2

జీవకణంలో ధాతుదహనమూ, ధాతుసృష్టి జరుగుతూనే వుంటుందనీ, ఈ ఉభయ కార్యముల ఫలితమును "మెటబాలిజం" అంటారనీ, ఇదివరకే తెలుసుకున్నాము. మెటబాలిజము సరిగా సాగిపోవడానికి అగ్నీ, ఆహారమూ పుష్కలంగా కావాలి. వివిధ అవయవములలో జీవకణముల రసాయనిక నిర్మితి ఆ అవయవము ధర్మమునుబట్టి ఉంటుంది. లివరులో పిత్తరసము తయారవుతుంది. అందు కనుగుణంగానే అందులోవున్న జీవకణ నిర్మాణం ఏర్పడుతుంది. ఆ జీవకణములనుబట్టి వుండే టిష్యూఫ్లూయిడ్‌లో అందుకు తగినట్లుగానే, అందుకు కావలసిన వస్తువులు గుమిగూడివుంటవి.


ధాతుదహానికి ఆక్సిజను కావాలి. ఈ ఆక్సిజను కణములు (Moleculess) జీవకణములను చుట్టివున్న ద్రవపదార్థములో పుష్కలంగా వున్నది. ఆక్సిజను కణములు, జీవకణముపై పొరలో వుండే రంధ్రములద్వారా జీవకణములోకి, ఏ పరిమాణములో అవసరమో, ఆ పరిమాణములో ప్రవేశిస్తవి. ఆ ఆక్సిజను కణములు, గుజ్జులోకీ, న్యూక్లియస్‌లోకీ, దాని ఆంతర్భాగములలోకీ కూడా చొచ్చుకునిపోతవి. ఆక్సిజను వున్నంతమాత్రాన ధాతుదహనం జరగదు. దాని సంపర్కంతో ధాతువులు దహింపబడడానికి కొన్ని 'ఎంజయిములు' కావాలి. ఆ ఎంజయిములు జీవకణంలో నిత్యమూ తయారవుతూ వుంటవి. జీవకణంలో ఎక్కువగా దహింపబడే వస్తువులు, హైడ్రోకార్బనులు (క్రొవ్వులు), కార్బోహైడ్రేటులు (శర్కరలు). అందుచేత వాటి దహనఫలితంగా కార్బన్—డై—ఆక్సైడ్, నీరు, శక్తి మాత్రమే ఏర్పడతవి. శక్తిని జీవకణం ఉపయోగించుకుంటుంది. నీరూ, కార్బన్—డై—ఆక్సైడ్ మళ్లీ జీవకణం పొరలోవుండే రంధ్రముల ద్వారా బయటవుండే టిష్యూఫ్లూయిడ్‌లోకి పంపబడతవి. ఇంతవరకు ధాతుదహానికి సంబంధించిన కార్యక్రమము.

ఇక నశించినధాతువులు మళ్లీ ఏర్పడకపోతే జీవకణము కృశించిపోతుందిగదా! అందుకని ఆ భాగములు పునః సృష్టి కావాలి. ఆ పునస్సృష్టి కావడానికి ఆహారపదార్థములు కొన్ని రసాయనికవికృతులు పొందాలి. ఆ వికృతుల ఫలితంగా, యూరియా, యూరిక్ ఏసిడ్, క్రియాటెనిన్, ఇంకా మరికొన్ని వస్తువులూ తయారౌతవి. ఇవన్నీ, నైట్రోజనువున్న వస్తువులే! వీటి కణములు, నీటికణంకంటే పెద్దవి. ఇవన్నీ జీవకణం పైపొరలోవుండే పెద్దరంధ్రములద్వారానో, పెద్దవైన రంధ్రముద్వారానో టిష్యూఫ్లూయిడ్‌లోకి పోతవి. అంటే జీవకణం పైపొరలోవున్నరంధ్రములకు ఏపదార్థములనులోపలికి రానివ్వాలో, ఎంతగా రానివ్వాలో, వేటిని బయటికి పంపాలో, ఎంతవేగంగా పంపాలో తెలుసునన్నమాట. మెటబాలిజం ఫలితంగా తయారయిన మలపదార్థములు—ముఖ్యంగా ధాతుసృష్టిలో ఏర్పడే యూరియావంటి మలపదార్థములు—సకాలంలో బయటికి పోకపోతే, గుమిగూడి, ఒకదానితో ఒకటి కలిసి మరీ పెద్దవై, కొన్ని నూతనవికృతులు చెంది, జీవకణం పైపొరలోవున్న రంధ్రములను మూసివేస్తవి. ఈ పదార్థములు అన్నీచేరి, మూత్రంగానూ, మలంగానూ, చెమటగానూ బయటికి వస్తవి. వీటి మూలస్థానము జీవకణము. అల్లా జరిగినప్పుడు జీవకణం కార్యక్రమము, ముందు మందగించి, తరవాత పూర్తిగా ఆగి, జీవకణం నశిస్తుంది.

అంటే, కేపిలరీనుంచి వచ్చే రక్తంయొక్క రసాయినిక స్వరూపము వేరూ, టిష్యూఫ్లూయిడ్ రసాయినిక స్వరూపమువేరూ నన్నమాట. కేపిలరీ ఒక కొన ఆర్టెరీకీ, మరొకకొన వెయినుశాఖకూ అంటివుంటుంది. ఆర్టరీద్వారా వచ్చే రక్తంలో ఆహారపదార్థములూ, ఆక్సిజనూ వుంటవి. టిష్యూఫ్లూయిడ్‌లో ఆహారపదార్థములూ, ప్రాణవాయువూ, కార్బన్ డై ఆక్సైడ్, యూరియావంటి మలపదార్థములూ వుంటవి. ఇది సాధారణస్థితిలో జీవకణము క్రిమిదోషానికి గురిఅయినప్పుడు, ఆ క్రిములూ, అవి ఉత్పత్తి చేసిన విషపదార్థములూ కూడా, టిష్యూఫ్లూయిడ్‌లో కనుపిస్తవి. టిష్యూఫ్లూయిడ్‌లోవుండే మలపదార్థములనూ, విషపదార్థములనూ, లింఫొటెక్కు అనే నాళవిశేషములు సేకరించి, అటువంటి నాళముల కలయికతో యేర్పడిన, థోరాసిక్‌డక్టు అనే ప్రధాన లింఫునాళముద్వారా, హృదయానికి పోయే పెద్ద వెయినులోకి పంపించివేస్తుంది. ఆ వివరములు, రక్తప్రవాహమునుగురించి చర్చిస్తున్నప్పుడు వివరిస్తాను. మిగతా మలపదార్థములను వెయినువైపుకుపోయే కేపిలరీకొనద్వారా పెద్ద వెయినులలోకిపోయి, చర్మంద్వారా, కిడ్నీలద్వారా స్వేద మూత్రస్వరూపంలో శరీరంనుంచి బహిర్గతమవుతవి.

ఈవిధంగా జీవితకాలంలో జీవకణంరంధ్రములనుండి అనేక వస్తుకణములు, అంతర్గతములూ, బహిర్గతములూ అవుతూనే వుంటవి. ఈ చాలనం ఆగినప్పుడుగానీ, క్రిమిదోషంవంటి పరిస్థితులలోగానీ, అపాయములలోగానీ జీవకణము వ్యాధిగ్రస్తమై చచ్చిపోతుంది. ఒక ప్రదేశంలో కొన్ని జీవకణములుమాత్రమే సాధారణంగా నశిస్తూవుంటవి. జీవకణములు నశించడమును వైద్యపరిభాషలో నెక్రోసిస్ (Necrosis) అంటారు. అల్లా నశించిన జీవకణములు క్రిముల ప్రభావానికి గురి అవుతవి. అల్లా నశించి, క్రిమిప్రభావానికి గురిఅయిన జీవకణ సముదయమును 'గేంగ్రీన్' (Gangrene) అంటారు. అధికసంఖ్యాకంగా జీవకణములు నశించి, క్రిమిదోషానికి గురిఅయి గేంగ్రీన్ ఏర్పడగానే ఆ ప్రదేశం నుంచి దుర్గంధము బయలుదేరుతుంది. క్రిమిప్రభావంవల్ల నశించిన జీవకణములు జీర్ణమై చీము ఏర్పడుతుంది. ఈ స్థితి చర్మమునకు లోపలిభాగములలో ఏర్పడ్డప్పుడు, దాని చుట్టూ ఒక పొర ఏర్పడి, అది చీముతిత్తిగా తయారవుతుంది. ఆ చీముతిత్తిని 'ఏబ్సెస్' అంటారు. ఒక్కొక్కప్పుడు చర్మంలోఉండే, కేశమూలము (Hair Folicle) క్రిమిదోషానికి గురిఅయి ఇన్‌ఫ్లేం అవుతుంది. ఆ స్థితిని 'గడ్డ' అంటాము. ఇంగ్లీషులో 'బాయిల్' అంటారు. శరీరంలో ఉండే క్రిమినిరోధక శక్తిని అనుసరించి, క్రిమిసంహారం జరిగినప్పుడు గడ్డకొనలో వుంటే జీవకణములు మాత్రం జీర్ణించి తెల్లని మొనగా ఊడిపోతవి. లేకపోతే గడ్డకూడా ఏబ్సెస్‌గానే అయిపోతుంది. ఒక్కొక్కప్పుడు, ఒకేమారుగా, ఒకే ప్రదేశంలో రెండు, మూడు కేశమూలములు 'ఇన్‌ఫ్లేం' అవుతవి. అప్పుడొక పెద్దగడ్డ ఏర్పడుతుంది. కాని, దానికి, ఇన్‌ఫ్లేం అయిన కేశమూల సంఖ్యనుబట్టి, రెండు, మూడు, నాలుగు రంధ్రములు ఏర్పడతవి. ఆస్థితిని రాచపుండు అంటారు. ఇంగ్లీషులో 'కార్బంకిల్'(Carbuncle) అంటారు. సాధారణంగా జీవకణముల నాశనం, స్థానికంగా, పరిమిత సంఖ్యలోనే జరుగుతుంది. ఇన్‌ఫ్లేం అయినప్పుడల్లా జీవకణములు నశించిపోవాలనే నియామకం లేదు. నశించి, జీర్ణించిపోయితీరాలనే నియామకమూ లేదు. ఒకే కాలంలో, ఒకప్రదేశంలో ఉండే జీవకణములన్నీ ఇన్‌ఫ్లేం కావచ్చును. అయినా నశించకుండా మళ్లీ ఆరోగ్యస్థితిని పొందవచ్చును. ఆ స్థితిని "సెల్యులైటిస్" (Celulitis) అంటారు. సెల్ అంటే జీవకణము. ఐటిస్ అంటే ఇన్‌ఫ్లమేషన్. నిజానికి, ఒక జీవకణం ఇన్‌ఫ్లేం అయినా

64-వ పేజీ చూడండి



ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డి ఈ మధ్య కర్నూలు వచ్చినప్పుడు బహిరంగసభలో ప్రసంగించారు.

ఆధ్వర్యం నెరపవలసినవారిలో ఆత్మవిశ్వాసం కొరత: కాంగ్రెసు పార్టీపదవుల హీనస్థితి

కౌండిన్య


ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షపదవిని శ్రీ బ్రహ్మయ్య చేపట్టగానే, ఇక ఆ పదవికి, రాష్ట్ర కాంగ్రెస్ సంస్థకు గౌరవప్రతిష్ఠలు ఇనుమడించగలవని అంతా ఆశించారు. ఎందువల్లనంటే శ్రీ బ్రహ్మయ్య తన జీవితంలో 40 ఏళ్ళు కాంగ్రెస్ సేవకు అంకితంచేసి క్రమశిక్షణ కూలంకషంగా ఎరిగిన వృద్ధ కాంగ్రెస్ నాయకుడుగా, పెద్దమనిషిగా ప్రసిద్ధి కెక్కిన వ్యక్తి. రాష్ట్ర కాంగ్రెస్‌లో పూర్వం బాధ్యతగల పదవు లనేకం నిర్వహించిన అనుభవశాలి. అన్నింటా అర్హుడవడంచేతనే ఆయన ఎన్నికకు సర్వత్రా హర్షించారు. అయితే ఎన్నిక సందర్భంలోనూ, తదనంతరమూ ఆయన చేసిన, చేస్తున్న ప్రసంగాలనుబట్టి చూస్తే, తనపై కాంగ్రెస్ కార్యకర్తలు పెట్టుకున్న ఆశలు పూర్తిగా సఫలీకృతం చేయగలరా అన్న సందేహం కలుగుతోంది.

ఒక పదవి చేపట్టిన వ్యక్తికి, ఆ పదవి నిజంగా గొప్పదన్న ఆత్మవిశ్వాసం కలుగనిదే, దానిని సార్థకం చేయగలగటం కష్టం. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్ష పదవి పూర్వం హేమా హేమీలైన నాయకులు నిర్వహించినట్టిదే అయినా, అది ఈనాడు మామూలు మంత్రిపదవికన్నా తక్కువదనే అభిప్రాయం ప్రబలింది. అధ్యక్షపదవి స్వీకరించడం ఏదో త్యాగం చేయడమనుకుంటే, ఆ పదవి ఎంతటి హైన్యంగా పరిగణింపబడుతున్నదో వేరే చెప్పనక్కరలేదు. ఈ భావం శ్రీ బ్రహ్మయ్యకు కూడా ఉంది. అధ్యక్ష పదవివిరమిస్తున్న శ్రీపళ్ళంరాజును గురించి మాట్లాడుతూ "మంత్రిపదవి త్యజించి,సంస్థ శ్రేయస్సుకోసం అధ్యక్షపదవి చేపట్టిన త్యాగమూర్తి" అన్న ప్రశంసా వాక్యాలే ఇందుకు నిదర్శనం. మంత్రిపదవి వచ్చేట్లు లేదుగనుక, ఏదో పదవి ఇచ్చారన్న సంతృప్తిపడిన ట్లుగా కన్పిస్తున్నది. శ్రీ సంజీవరెడ్డి పైకి మంత్రిపదవి కన్నా, అధ్యక్షపదవే గొప్పదని ఊరడించినా, మంత్రు లంటే ఏమిటి ఆట్టహాసం, పోలీసులు, సలాంలు తప్ప మరేమీ ఉండవని తేలికగా కొట్టివేసినా, అంతరాంతరాలలో ఏ పదవికి ఎంత విలువ ఉన్నదో ఆయనకు స్వానుభవంమీద తెలుసు. అఖిలభారత కాంగ్రెస్ అధ్యక్షపదవి మధ్యలో వదలి, ముఖ్య మంత్రిత్వాన్ని చేపట్టిన దందుకేగదా. మంత్రిపదవికన్నా అధ్యక్షపదవి తక్కువదన్న నమ్మకం ఉండబట్టే, శ్రీ బ్రహ్మయ్యను మంత్రిహోదా గల వ్యక్తిగా పరిగణిస్తానని ఆయన మాట ఇచ్చింది.

కేంద్రంలోగాని, రాష్ట్రాలలోగాని, కాంగ్రెస్ సంస్థ అధిపతులస్థాయి ఇంత అధ్వాన్నస్థాయికి దిగజారిందంటే,అగ్రనాయకు లందరూ ప్రభుత్వంలో చేరి సంస్థను ఛోటానాయకులపరం చేయడమే కారణం. ప్రభుత్వాధికారాన్ని నిర్వహించే విభాగంపై అధికారం ఆజ్మాయిషీ నెరపవలసిన పార్టీ నాయకత్వం, కేంద్రంలో ప్రధానమంత్రికి, రాష్ట్రాలలో ముఖ్యమంత్రులకు లోబడి, వారి చెప్పుచేతలలో పడునవలసినస్థితి ఏర్పడింది. అందుకే స్వాతంత్ర్యానంతరం కాంగ్రెసు అధ్యక్షులు కేవలం రబ్బరు స్టాంపులుగా తయారైనారన్న ప్రతీతి వచ్చింది. శ్రీ బ్రహ్మయ్యగారిని ఇదే ప్రశ్న వేయగా, "ఇవి కాంగ్రెస్ చరిత్ర తెలిసిచెప్పే ముక్కలుకావు.కాంగ్రెస్ అధ్యక్షులుగా ఎవరున్నప్పటికీ, అసలు నాయకులనే వారు వేరే ఉంటారు. దేశం మొత్తానికి శ్రీ నెహ్రూ, మన రాష్ట్రం మొత్తానికి శ్రీ సంజీవరెడ్డి ఏకైక నాయకులు. గాంధీగారు బ్రతికిఉన్నప్పుడు, ఏ కాంగ్రెస్ అధ్యక్షుడైనా ఆయన మాటకాదన్నారా? అలాగే రాష్ట్రంలో శ్రీసంజీవరెడ్డికి ఎలా ఎదురు చెప్పడం" అని ఇవే వాక్యాలుగాకపోయినా ఈ అర్థంలోనే శ్రీ బ్రహ్మయ్య జవాబు చెప్పారు.

కాంగ్రెస్ అధ్యక్షులైనవారు అటు ప్రధానమంత్రికి, ఇటు రాష్ట్ర ముఖ్యమంత్రికి లోబడి కేవలం "బసవన్న'లలా పనిచేయాలనుకున్నా, మామూలు మంత్రిపదవికన్నా, అధ్యక్షపదవి తక్కువదేనని అభిప్రాయపడ్డా, కాంగ్రెస్‌పార్టీ గౌరవం ప్రభుత్వాధికారంలో ఉండేవారినిబట్టి పెరగవలసిందేగాని, పార్టీ నాయకత్వం వల్ల కాదు. పార్టీకి సంబంధించినదే అయినా, ప్రతీదీ ప్రధానమంత్రి, లేదా ముఖ్యమంత్రి నిర్ణయంపై తేలవలసిఉంటుంది.కాంగ్రెస్ నాయకత్వం నామమాత్రమవుతుంది. అయిందికూడా. ఇప్పుడు మాహాస్తే

63-వ పేజీ చూడండి



విజయావారి "గుండమ్మకథ"లో ఎన్. టి. రామారావు, నాగేశ్వరరావు.

సినిమా వార్తలు

చలనచిత్రాల్లో కళ

చలనచిత్రాల్లో వ్యాపారమే ప్రధానం అనటం సరికాదని వాటిలో కళకూడా ఉన్నదని, మద్రాసు సంగీత నాటకసంఘ అధ్యక్షులు శ్రీ ఇ. కృష్ణయ్యర్, అంతర్జాతీయ ఫిల్మ్‌క్లబ్ యాజమాన్యాన ఏర్పడ్డ నటీనట శిక్షణశాల ప్రారంభోత్సవ సభకు అధ్యక్షత వహిస్తూ అన్నారు. ఏ పరిశ్రమకైనా, కళకైనా, సుశిక్షితు లుండటం అవసరమని అలాంటివనికి ఫిల్మ్‌క్లబ్ పూనుకోవటం హర్షదాయకమనీకూడా ఆయన అన్నారు.

మద్రాసు ఆర్థిక, విద్యామంత్రి శ్రీ ఎం. భక్తవత్సలం తరగతులు ప్రారంభిస్తూ చలనచిత్రపరిశ్రమకు కళ లేనిదే రాణింపులేదని అన్నారు.

ప్రముఖ నటుడు శ్రీ వి. నాగయ్య స్వాగత పత్రం చదివారు. శ్రీ ఎ. భీమసింగ్, శ్రీమతి సావిత్రిగణేష్‌లు కూడా ప్రసంగించిన ఈ సభ వినోద ప్రదర్శనలతో సమాప్తమైంది.

ఫిలిం ఇన్‌స్టిట్యూట్ శిక్షితులకు విద్యార్థి వేతనాలు

పునాలోని ఫిలిం ఇన్‌స్టిట్యూట్‌లో ఛాయాగ్రహణం, శబ్దగ్రహణం, కూర్పు, దర్శకత్వపు శాఖలో శిక్షణపొందే విద్యార్థులు నల్గురికి నెలసరి రు 150 వంతున విద్యార్థివేతనంగా ఇవ్వాలని మద్రాసు సంగీత నాటకసంఘం నిర్ణయించింది. 62—63 బడ్జటులో ఇందుకుగాను రు7200లు కేటాయించేందుకు నిశ్చయించింది.

చలనచిత్ర సాంకేతికుల సంఘాధ్యక్షుడు శ్రీయన్. కృష్ణస్వామి చేసిన సూచనపై సంగీత నాటకసంఘ ఉపసంఘం సమావేశమై పై నిర్ణయం చేసింది.

విద్యార్థులకేగాక, పరిశ్రమలోని యోగ్యులైన సాంకేతికులకుకూడా వేతనంలాంటిది ఇప్పించాలని కూడా శ్రీ కృష్ణస్వామి సూచించారు.

సినిమా 'కళ' కనుక పన్నువిధింపులో విచక్షణ!

చట్టంలో నిర్వచనం ఎలావున్నా చిత్రనిర్మాతలను కేవలం అమ్మకం కొనుగోలుచేసే వ్యాపారులుగా జమ కట్టి అమ్మకపుపన్ను విధించటం న్యాయంకాదని చలనచిత్రపరిశ్రమ ఒక "కళాత్మకవ్యవస్థ" కనుక పన్నువిధింపులో కొంత సానుభూతి, విచక్షణచూపటం అవసరమని భారత చలనచిత్రనిర్మాతలసంఘ ప్రతినిధివర్గం మహారాష్ట్ర ఆర్థికమంత్రి శ్రీ యస్. జి. బార్వేను కలుసుకుని విన్నవించుకున్నది.

సోవియట్ చిత్రానికి బ్రిటిష్ బహుమతి

"బాలెడ్ ఆఫ్ ఎ సోల్జర్" అనే సోవియటు చిత్రానికి, ట్వెంటీయత్ సెంచరీఫాక్సు వారి "ది హజ్లర్" చిత్రానికి, ఎ టేస్ట్ ఆఫ్ హనీ' అనే బ్రిటిషుచిత్రానికి ఉత్తమచిత్రాలక్రింద బ్రిటిష్ ఫిల్మ్ అకాడమీ బహుమతులు లభించాయి.

"నో లవ్ ఫర్ జానీ"లో నటించిన పీటర్ ఫించ్, "టూ వుమన్'లో" నటించిన సోఫియా లారెన్‌లకు ఉత్తమనటనకు బహుమతులు లభించాయి.

తర్జుమా అక్రమం కాదు!

హిందీ, తెలుగు, తమిళచిత్రాలను కన్నడంలోకి తర్జుమాచేయటం అక్రమమనువాదాన్ని ఖండిస్తూ కన్నడ హాస్యనటుడు బి. హనుమంతాచార్ "ఈ చిత్రాల తర్జుమా కన్నడపరిశ్రమకు హాని కలిగించక పోగాపరిశ్రమ విస్తరణకు ఎంతో తోడ్పడింది. ఈపద్ధతి వల్ల ఇతరభాషల చిత్రాలను సినలు కన్నడచిత్రాలతో పోల్చి అభిరుచులను పరిశీలించేందుకు ప్రేక్షకులకు అవకాశం కలిగింది. కన్నడచిత్రాలు తగినంత డబ్బుచేసుకోవనే భయంతో ప్రదర్శనశాలల యజమానులు తమిళ, హిందీ, తెలుగుచిత్రాలను ప్రదర్శించటంవల్లసినలు చిత్రాలకు ప్రదర్శనశాల దొరకనప్పుడు ఇతరభాషలనుండి తర్జుమాచేయటంవల్ల వచ్చే నష్టమేమిటి? ఇప్పుడు ఏడాదికి 12, 14 మించి కన్నడచిత్రాలు తయారు కావటంలేదు, మరి కన్నడచిత్రాలపట్ల ఉత్సాహం కలిగించాలంటే డబ్బింగ్‌చిత్రాల ప్రదర్శనంకన్న వేరే మార్గంఏమిటో?" అన్నారు.

పోలీసులతో పోట్లాడిన నోవాక్

హాలీవుడ్ నటి కిమ్‌నోవాక్ ఇటీవల మాస్కో వెళ్ళినప్పుడు లెనిన్‌సమాధి చూచేందుకని వెళ్ళి కారుదిగి రెడ్‌స్క్వేర్‌లో ప్రవేశించబోయిందట. ఇంతలో ఇద్దరు పోలీసులు పరుగెత్తుకువచ్చి అలా స్క్వేర్‌కు అడ్డంగా పడిపోవటం తప్పనిచెప్పారు. ఆమె నేను లెనిన్‌సమాధిచూడాలని వచ్చాననిచెప్పగా అందరితోపాటు క్యూలో నుంచోవాల్సిందని ఆపోలీసు మహాశయులు చెప్పారట.

ఆ నటి గౌరవఅతిథిఅని, పదిమందిమధ్య నిలుచునేందుకు తగ్గబూట్లు వగైరా ధరించలేదని ఆమె అనువాదకుడు విన్నవించుకున్నా వినక పైగా అసలు మిస్ నోవాక్ ఎవరేం? అని అడిగారట.

లెనిన్‌సమాధిముందు తమ భక్తిశ్రద్ధలు ప్రకటించుకోవాలని వచ్చే జనం వరుసలు చూచి పాపం, నోవాక్ హడిలిపోయి 'విశ్వవిద్యాలయమన్నాచూసాస్తా అనుకుంటూ' వెళ్ళిపోయిందట.

గ్రీసులో 'సుజాతా' తర్జుమా ప్రదర్శనం

అస్పృశ్యత ఆధారంగా బిమల్‌రాయ్ నిర్మించిన 'సుజాత'ను గ్రీక్‌భాషలోకి తర్జుమాచేసి, గ్రీస్‌లో ప్రదర్శిస్తారు.


ఈ చిత్రాన్ని అరబ్ సబ్‌టైటిల్సుతో మధ్య ప్రాచ్యంలో విడుదలచేస్తారట.

విదేశీ చిత్రరంగం

బ్రిగెట్టీ పాత పాట

ఇంతకుముందు ఒకటి రెండుసార్లుగా అంటున్న బ్రిగెట్టీ బార్డోట్ మళ్ళీ నేను సినిమాలనుండి

—49 వ పేజీ చూడండి



హిందీనటి వహీదాఖాన్.



"సిరిసంపదలు"లో సావిత్రి, కాంతకుమారి

తెలుగు పత్రికలన్నిటిలోనూ ఆంధ్రసచిత్ర వారపత్రిక సర్క్యులేషన్ అత్యధికమైనది!

హరివంశము

హారీతశివశర్మ

సాందీపనిపర్వం - 57

రాజగృహములను చేరినదేగాని, మహానందుని భార్యకు ప్రాణములు ప్రాణములలోలేవు. తాను ఇప్పుడు పౌండ్రకుని కలిసికొనును. సుదక్షిణను కలిసికొనును. తాను వారితో ఏమి మాట్లాడవలయును? ఎట్లు మాట్లాడవలయును. ఇంటిదగ్గర బయలుదేరినయప్పుడున్న ఆలోచనములు దారిలో లేవు. దారిలో కల్గిన ఆలోచనములు ఇప్పుడులేవు. పౌండ్రకుడెంతయో ప్రేమముతో ఆ బంగారు మృగమును తెచ్చియిచ్చెను. ఆ మృగమును తనభర్త ఇట్లుచేసి, రాజునకు అవమానమును తెచ్చెను. అసలు ఆ బంగారుమృగము వచ్చినది మొదలు కొంపలో ఈరగడ రాజుచు వచ్చినది. తాము ఆ మృగము నేల చూచితిమి? ఏలయుబలాటపడితిమి? అనుకొన్నది మహానందుని భార్య. తా నా మృగమును రాజమందిరములలో చూచిన దినము ఆమెకు ఇప్పుడు గుర్తుకు వచ్చినది. పౌండ్రకుడు తన్ను ఆరోజున 'తల్లీ' అని సంబోధించెను. తన్నా మృగమున్న మందిరములోనికి తీసికొనిపోయెను. అప్పుడు కథ ఇట్లు నడచునన్న భావము తనకు కల్గలేదు. తన భర్త ఆ మృగమును వద్దనినాడు. తాము వద్దన్న బాగుండియుండెడిది. తాను ఆ మృగమునందలి అనురక్తిని ప్రదర్శించినది. పౌండ్రకుడు మృగమును ఇంటికి పంపెను. ఇప్పుడు ఆ ఇల్లిట్లైనది.

మహానందునిభార్య రథముపై వచ్చుటను పౌండ్రకుడు తన మేడలమీదనుండి చూచెను. మొదట వానికి ఆశ్చర్యమయ్యెను. తరువాత అర్థమయ్యెను. అర్థమైనదే తడవుగ నతడు సుదక్షిణమందిరములకు బయలుదేరిపోయెను. సుదక్షిణను సంబోధించి నవ్వెను. ఆ నవ్వు విచిత్రముగా నున్నది.

"స్వామి! ఏమి అట్లు నవ్వుచున్నారు" అన్నది సుదక్షిణ.

"సుదక్షిణ! నే నీ దినమున ఒక ఘనకార్యము చేయబోవుచున్నాను. నీవు నాకు బాసటగా నిల్వవలయును?"

"ఆచార్య మహానందులపై వచ్చిన అభియోగమును గూర్చిన విచారణమును మానుచున్నారా?"

పౌండ్రకుడు మరల నవ్వెను.

"సుదక్షిణ! అంతయు నీ యెదుట జరుగును. నీవును చూతువుగాని: విందువుగాని. అరుగో ఆచార్యుల భార్యలు వచ్చుచున్నారు. వారికి ప్రత్యుత్థానముచేసి, తీసికొనిరమ్ము. నే నిక్కడ నీ ఆస్థరణముపై కూరుచుందును."

సుదక్షిణ అతని మాటలు నమ్మలేదు. నవ్వుటాల కట్లనుచున్నాడనుకొన్నది.

"స్వామి! నిజముగనా! ఆచార్యులవారి భార్య మన ఇండ్లకు వచ్చుచున్నదా!" అన్నది.

"నీవే చూడుము."

సుదక్షిణ తన మందిరగవాక్షములనుండి చూడగా మహానందుని భార్య అగుపించినది. దారుకుడు వాకిట నాపిన రథమును డిగ్గి, ఆమె పాదచారియై తన మందిరముల దిక్కై వచ్చుచున్నది. అంతదూరమున గూడ నామె దైన్యము మూర్తిదాల్చినట్లు, తన పూర్వపు ఔద్ధత్యముతగ్గి, పరిదీన మూర్తియై సుదక్షిణ నయనాధ్వమం దొదిగిపోయినది.

"స్వామి! ఎవ్వరివో మాటలు విని తాను ఆచార్యులను దండించుటకు పూనుకొనినారు. ఆయన సంగతి తెలిసియు మీరలేల ఇందుకు పూనిక వహించవలయును?"

"సుదక్షిణ! ఇది ధర్మమునకు సంబంధించిన విషయము. నేనేమి చేయగలను. ధర్మపరిషత్తులు ధర్మమును నిర్ణయించును?"

సుదక్షిణ విచిత్ర మందహాసము చేసినది. "స్వామి! నామీద కోపముతో తా మీపని చేయుచున్నారు" అన్నది.

పౌండ్రకు డామెవంక చురుక్కున చూచినాడు. "నీవు నన్ను వాసుదేవునిగా గుర్తించుటలేదు. గుర్తింపజేసెదను" అన్నాడు.

సుదక్షిణ మాటాడలేదు. ఉత్తరీయమును పైన వేసికొని, ఆచార్యాణికి, మహానందునిభార్యకు ప్రత్యుత్థానము చేయబోయినది. మందిరములో పౌండ్రకుడు ఒంటరిగాయుండి, ఒంటరి ఆలోచనములు చేసినాడు. అతని ముఖము గంభీరమైయుండినది. పెదవులపై విచిత్ర మందహాసము తొలుకాడుచున్నది.ఏదో పరమమైన తృప్తిని భజించుచున్నట్లతడు తనలోతాను నవ్వుకొనుటయు చేయుచుండెను.

ఆచార్యాణి మహానందునిభార్యయు, సుదక్షిణయు లోపలకు రాగా, అతడు ఆసనమునుండి మర్యాద అంతయు ఆకారమై లేచి,మహానందుని భార్యకు ఉచితాస్థరణము చూపెను. ఆమె కూర్చుండలేదు. కనుకొలకులలో నీరు నిండగా మౌనము వహించి నిలుచుండిపోయినది. పౌండ్రకుడు మాటాడలేదు. సుదక్షిణ అన్నది:

"ఆచార్యాణీ! ఆసీనులుకండు! సేదతీర్చుకొనుడు. కొంచెము మంచితీర్థ మిప్పింతునా! ఎవరు అక్కడ! ఆచార్యాణికి మంచితీర్థమును తెమ్మని బ్రాహ్మణునితో చెప్పుము!

ఆచార్యాణి కూర్చుండలేదు. నిలబడియే యున్నది. ఆమె ఏమియో మాటలాడబోవునుగాని మాటాడలేకపోవుచున్నది. దుఃఖము కంఠము గతముకాగా, పావురా యెలుగునుపోని బాధతోకూడిన కువ కువ లెవ్వియో ఆమె కంఠమును దాటివచ్చుటకు ప్రయత్నము చేయుచు, అమెచేసెడి ప్రతిరోధమువలన ఆగిపోవుచున్నవి.

సుదక్షిణ అన్నది: 'తల్లీ! ఆచార్య మహానందుల విషయమై మాట్లాడుటకేనా వచ్చినది?"

అవును అన్నట్లు ఆచార్యాణి తల ఊపినది.

"మహారాజుతోగూడ ఆ విషయము మాట్లాడెదరా?"

అవును అన్నట్లు ఆమె తల ఊపినది.

"మహారాజ! ఆచార్యాణి అభ్యర్థనము విన రాదా?"

"నేను విననన్నానా?" అన్నాడు మహారాజు.

అంతలో బ్రాహ్మణుడు మంచితీర్థమును తెచ్చెను. సుదక్షిణ ఆ మంచితీర్థము నందుకొని, మహానందుని భార్యను సమీపించి, "తల్లీ! కొంచెము దాహము పుచ్చుకొనుము" అని ఆమెచేతికి తీర్థము

—53వ పేజీ చూడండి



జరిగిన కథ

చిన్నతనంనుంచి తల్లిదండ్రులు మమతకరువైన సూర్యం నాయనమ్మ నరసమ్మగారి ఆదరణలో పెరిగి పెద్దవాడవుతాడు.

సంతులమ్మ నిర్మల నరసమ్మగారింట్లో కొంప వాటాలో అద్దెకుంటోంది. మరో వాటాలో రాజ్యలక్ష్మివాళ్లు ఉంటారు. శంకరంగారు సూర్యం పని చేస్తున్న కంపెనీలో హెడ్ గుమాస్తా.

4

అంతాకలిసి ఆఫీసులోనుంచి బయటికి వస్తున్నప్పుడు "ఐతే మీకు ఇంటి అద్దెలు మారునాటు యాభై దాకా వస్తాయన్నమాట?" శంకరంగారు సూర్యాన్ని ఛోగట్టాచేశారు.

"సరే," అని సూర్యం సాధ్యమైనంత వినయంగా సమాధానం యిచ్చినా, అందులో అనవసర ప్రసక్తి, అడుగుతున్నావన్న ధ్వని లేకపోలేదు.

"ఐతే... మీ బామ్మగారి తదనంతరం ఇతరత్రా పేచీలు, దాయాది తగాయిదాలు ఏమీ రావు కదూ?" ఈ ప్రశ్న వేసింది వాళ్ల ఆఫీసు కాషియర్ మంగపతి. కళ్లజోడుకోసంచి చింతపిక్కలాంటి గ్రుడ్లు వివతంపెట్టి మరీ అడిగాడు.

సూర్యం అనుకోకుండానే మంగపతిని అసహ్యంగా చూసి ఊరుకున్నాడు.

శంకరంగారుకూడా కాషియర్‌కేసి మందలింపుగా చూశారు.

"అన్నట్టు! ఓయ్ సూర్యం! మాయింటికి ఓసారి రావయ్యా!...మా ఆవిడ నిన్ను చూస్తానంది... బుద్ధిమంతుడూ, చదువుకున్నవాడూ మా ఆఫీస్‌లో ఓ కొత్త అబ్బాయి చేరాడూ అంటే అప్పట్నించీ నన్ను వేపుకు తింటున్నది.

43—వ పేజీ చూడండి

మీ వయస్సు ఎంత?

'జయశ్రీ'

కూరలమ్మేమనిషి కూరలిచ్చి, "ఆ ముసలమ్మ కొంటుందేమో అడుగమ్మా!" అంది. ఇది విన్న మా పక్కవాటాలోని రత్నమ్మగారు "ముసలమ్మ యేమిటే! పేరెట్టి పిలవలేవూ! నాకేమైనా పళ్ళూడి పోయాయా! బుర్రపండిపోయిందా! అప్పుడే ముసలిదాన్నయిపోడానికి" అంటూ కోపంతో ముందుకు వచ్చింది. ఆమెకు ముసలమ్మ అన్నందుకు తగని కోపం వచ్చింది. ఆమె వయస్సు నలభై అయిదు, ఏభై లోపల ఉంటుందని అంచనాకట్టవచ్చు. ముప్ఫయ్యేళ్ళ కొడుకున్నాడామెకు. అతడు కూడ ఆమె కాపురానికివచ్చిన చాలా కాలానికి పుట్టాడట. అయినా ఆమె తన నిజమయిన వయసు చెప్పదు.

సాధారణంగా మన స్త్రీలలో వయసు దాచుకునే అలవాటు ఉంది. పెద్దవాళ్ళమయినా, చిన్నవాళ్ళలా ఉండాలనే తాపత్రయంవల్ల ఎదుటివాళ్ళు మన వయసు అడక్కపోయినా, చెప్పి నమ్మించటానికి ప్రయత్నిస్తాం. నామట్టుకు నేను యెవరేనా "మీరు యిద్దరు పిల్లల తల్లిలా కనిపించరండీ! ఇంకా కాలేజీ స్టూడెంటులా చలాకీగా కన్పిస్తారు." అంటే సంతోషంతో పొంగిపోతాను. నాలాంటివాళ్ళు చాలమంది ఉంటారని నా నమ్మకం. మనకు యెక్కువ ఏళ్ళుంటే ఎవరేనా తక్కువగా అంచనావేస్తే ఎంతో తృప్తిపడతాం; ఇంకా చిన్నవాళ్ళలా కన్పించటానికి ప్రయత్నిస్తాం. అంతవరకూ బాగానేఉంది. కాని వయసును కప్పిపుచ్చుకోవాలనే ఆరాటంతో హద్దు మీరిన అలంకారాలు చేస్కుని, సభ్యతకు దూరంగా ఉండటం మంచిదికాదు.

ఈమధ్య ఒక విందు జరిగింది. ఆరోజు ఒకామె పచ్చని నైలాన్‌చీర కట్టుకుని వచ్చింది. ఇంకా అప్పటికి బాగా చలి ఉంది. ఆమె వయసులో చిన్నదికాదు, చిన్నవాళ్ళే ఆ సందర్భంలో అలాంటిచీరలు కట్టుకుంటే బాగుండదు. అలాంటిది ఆమెకు కొడుకున్నారు; మనుమలున్నారు; ఆమె వయసు యాభై సంవత్సరాలకు తక్కువ ఉండదు. శరీరం అంతా కనిపిస్తూ, ఆ నైలాన్‌చీర కట్టుకోవడంవల్ల ఆమెకు ఎంత తృప్తికలిగిందోగాని, వచ్చినవా రందరికీ ఆమె వేషం అసహ్యం కలిగించింది. ఆడవాళ్ళ పరువు తీసిందనిపించింది నాకు!


ఆవిడను ఒకసారి, "మీ వయసెంత ఉంటుందండీ!" అని అడిగాను. దానికి ఆమె సమాధానం యిది. "అమ్మా! చిన్నప్పుడే పిల్లాడ్నికని మనుమల్నెత్తాముగాని, నాకింకా నలభైయేళ్ళు దాటలేదు." అది యేదైనా ఎలక్షను సందర్భంలో "నేను ఫలానా సంవత్సరం ఫలానాపదవిలో చేరాను. నా సర్వీసు ఇరవైయేళ్ళకుపైగా ఉంది." అని చెప్పుకుంటారు. ప్రమోషను కావాల్సివచ్చినప్పుడు వయసు, సర్వీసు, యెక్కువ ఉంటుంది. అదే రిటైరయిపోతూన్నప్పుడు యెందుకు మరి రెండేళ్ళు తగ్గించి వేసుకున్నాముకాదు అనిపిస్తుంది.

పై ప్రయోజనాలమాట అటుంచి నిష్ప్రయోజనంగా మనం వయసు తక్కువ చెప్పుకుంటాం. కొంతమందిని అడిగితే నాకు నావయసు తెలియదనేస్తారు. కొంతమంది ఇరవయ్యో పాతికో ఉంటాయి అనేస్తారు టూకీగా. ఎవరైనా ఒక యేడాది కనీసం తగ్గించి చెప్తారు. బిడ్డలవయసు తల్లి తగ్గించి చెప్పాలట. ఎందుకంటే వారికి దృష్టి తగులుతుందని. తల్లి బిడ్డలయేళ్ళు దాచుకుంటే బిడ్డల ఆయుర్దాయం పెరుగుతుందని అంటారు. మా అమ్మమ్మ అంటూండేది. "మనం యేళ్ళు తక్కువ చెప్పుకుంటే ఆయుర్దాయం క్షీణిస్తుందని" అలాగంటే నాకు భయంవేసి, నిజమే చెప్పుతున్నాను. అయితే యిది మూఢనమ్మకమని తోసిపారేయటం కష్టంకాదు.

వృద్ధాప్యం వస్తూన్నకొలది, ఐహికదృష్టి యెక్కువై కోరికలు అణగడానికిబదులు వేర్వేరు రూపాలతో మొలకెత్తుతాయి. వాయిలు చీరలతోనూ, కాటుకజడలతోనూ మధ్యవయసుగల స్త్రీలు నిత్య జీవితంలో కన్పిస్తూనే ఉంటారు. మిగిలిన జీవిత కాలం యేదో ఆధ్యాత్మికచింతతో ఉండక ఐహిక బంధాలవేపు మొగ్గుతుంది వారి మనసు. కొంతమంది భర్త ఉన్నవాళ్ళు చిన్నవాళ్ళమనుకుంటారు. ఏభై యేళ్ళు వచ్చినా, తలకు 'డై' కొట్టుకోవడం, పళ్ళూడిపోతే 'తెలపళ్ల సెట్టు' తగిలించుకోవడం చూస్తూఉంటే మన నాగరికత విజృంభించి, ఎన్ని వెర్రి రూపాలు దాలుస్తోందో మనకు తెలుస్తుంది.

మనం "వృద్ధాప్యం" అంటే భయపడతాము. "జర" అనే వ్యాఘ్రం ఎక్కడ తన బ్రహ్మాండమైన నోరు తెరచి కబళించివేస్తుందోనని భయంతో యేళ్ళు తగ్గించి, ముసలితనానికి దూరంగా ఉన్నామని భ్రమపడతాం. కాని, వయసు "మనిషిని క్షీణింపజేస్తుంది" అన్నట్టు మనం ఎంత దూరంగా పోతే అంత దగ్గరకు వస్తుంది. ముసలితనాన్ని కప్పిపుచ్చుకునేందుకు మనం పడే అవస్థలు చూస్తే మనకే నవ్వు వస్తుంది. ఇంకా యౌవనంగా కనపడాలని నాగరికతాప్రపంచంలో యువతీయువకులే అనుభవించటానికర్హులు అని ముద్దరగొట్టి వస్తు సముదాయాల్ని తామెందు కనుభవించకూడదు? అనే కోర్కెల ప్రవాహమే ఈ వయసును కప్పిపుచ్చుకునేందుకు కారణం.

వయస్సుతోపాటు బుద్ధి పరిపక్వం పెంచాలి. ఏ వయసులో ఉండే గౌరవమర్యాదలు, హుందాతనం ఆ వయసుకుంటాయి. అలాగే యే వయసులో పాటించవలసిన సభ్యతలు, బాధ్యతలు ఆ వయసు కుంటాయి. అలాగే ప్రభుత్వంవారు కూడ వయోవృద్ధులనే జ్ఞానవృద్ధులుగా భావించి, అనేక రంగాలలో ప్రాధాన్యం ఇస్తున్నారు. బుర్రపండిన లాయరు, డాక్టర్లవద్దకే లోకులు వెళ్తారుగాని చిన్నవారిని యెవరూ నమ్మరు. వయసులో ఉండే గౌరవం మనకే తెలుస్తుంది పెద్దవాళ్ళమయాక. ★



ఆడపడుచులు

"ఆడపడచులతో సంసారం" అన్నవ్యాసం మీద ఎన్నో ఉత్తరాలు వచ్చాయి. కాని ఒక సోదరి విజయవాడనుండి వ్రాసిన విమర్శ ఏమీ సమంజసముగా కన్పించలేదు.

కొత్త కోడలు ఒక ద్వేషభావంతో వస్తుందని, అప్పైన లోకులమాటలతో మారుతుందని ఈ సోదరి రాశారు. కాని గొప్ప మనసు కలవారు అత్తగారు వగైరా వుండకూడదని, లోకుల మాటలకు లొంగి, మనసును మార్చుకోనరు. ఆమె రాసిన ఉత్తరమును ఆమె అమలులో పెట్టినవారు కాయుసన్నను.

అందరు కొత్తకోడళ్ళని ఉర్న్యగా పేరు మాపెట్టి రాయటం పనికిరాదు. ఈలాంటి చవుక వారు ఉత్తరాలు రాయడం మానిస్తే చాలా మంచిది.

అందరూ ఏకీభావంతోవుంటే బాగుంటుందని రాసి ముగించుచున్నాను.

వి. సీతామూర్తి (హైదరాబాదు.)

* * *

ఆడపడుచులతో సంసారం అన్న వ్యాసం నాకు చాలా బాగుంది.

ప్రమీల (ఉరవకొండ)

ఆడపడుచులు సాధింపులు వెనుకటిరోజులలో కాని, ఈరోజులలో చదువుకుని యెంతో విశాల హృదయంగల ఆడపడుచులు వదినలు యెంత మందిలేరు? మాకుటుంబంలో మా వదినగారు నేను యెక్కడికైనా వెళ్లినప్పుడు మా అన్యోన్యతను చూసి చాలామంది ఆశ్చర్యపోయేవారు. మాపిల్లలకు వాడగ్గరకన్నా మావదినగారిదగ్గర చనువెక్కువ.

కె. మీనాక్షిదేవి (ముప్పాళ్ళ)

కొంతమంది వదినలు ఆడపడుచులకు (చాలా హీనంగా హింసించటం చూచానులెండి) వాళ్ళకి మాటామాటా పెరిగి మగవాళ్ళతో చెప్పటం జరుగుతున్నది. కనుక ఇకనుంచి అన్నా మంచిగా వుంటారని ఆశిస్తున్నాను.

విన్నకోట్ల రమాదేవి (విజయపురి)

* * *

వనితలూ-వస్త్రాలూ

కామేశ్వరిగారు వ్రాసిన వ్యాసం చదువుతుంటే మొదటవారు వెంకటగిరి, కంచి, చీరల ప్రచారము చేస్తున్నారా! అనిపించింది.

కాని రచయిత్రి ఇచ్చిన సలహాలు అమూల్యములనుటలో సందేహములేదు. కొందరికి బట్టలున్నను, వాటిని ఉపయోగించే విధానము తెలియక తికమకపడటం చూస్తూనే ఉన్నాం. అదేగాక, ఈ రోజుల్లో విధవలు కూడ సిల్కు చీరలు ధరించడం చాలా చోట్ల కనబడుతూనేఉంది. బట్టలు ఉన్నవని ఆడంభరంగాను, లేవని నిరాడంబరంగానూ ఉండక ఉన్నవాటితో శుభ్రముగాఉంటే అదే చాలా మంచిది.

కె. అన్నపూర్ణమ్మ (అలహాబాదు)

* * *

ఈనాటి స్త్రీలకు సహజముగా వస్త్రములయందు ఆసక్తి ఎక్కువగా ఉండును. కాని వస్త్రములను వాడుటయందు ఎక్కువ శ్రద్ధ వహించరు.

యస్. ప్రమీల (ఇందుపూరు)

* * *

డి. కామేశ్వరిగారు అన్నట్లు ఏ వయస్సుకి తగ్గట్టు ఆ బట్టలు వేసుకుంటే బావుంటుంది. ఇద్దరు, ముగ్గురు పిల్లలుపుట్టేక లంగా, ఓణీ కట్టుకొంటే ఏంబావుంటుంది? నాది చిన్నవయస్సే, పిల్లలు పుడితేమాత్రం కట్టుకోకూడదా అని అనుకుంటే కుదురుతుందా? ఎదుటివారు ఆక్షేపిస్తారు.

కె. సుజాత (మోరి)

* * *

వ్యాసంలోని చివరి వాక్యాలు "వయస్సునుబట్టి, లావు—సన్నం—సమయాలనుబట్టి మనం బట్టలు కట్టుకొనడం నేర్చుకోవాలి" అన్నవి ఆచరణద్వారా కలిగిన అనుభవమేమో అనిపించుచున్నది. కొంత మంది పట్టుచీరల విలువ పోగొట్టుచున్నారు. అన్ని పనులు చేయునపుడు కూడా వాటినే వాడుదురు.

కాకుమాను కామేశ్వరమ్మ (పాలవ్రరు)

* * *

వంట చేసేటప్పుడు—నాజూకు వస్త్రాలు వాడక, దానికితగిన వస్త్రాలువాడి సాయంత్రము షికారుకు వెళ్ళేటప్పుడో—షికారుకు వెళ్ళేటప్పుడో నాజూకు వస్త్రాలు అనగా, సిల్కు, వాయిల్ చీరలు వాడినచో నిజానికి గూడా స్త్రీలు ఎంతో అందంగా అలంకరించుకున్నవారవుతారు.

సిద్ది నర్సమ్మ (తేర్వాల)

* * *

డి. కామేశ్వరిగారి "వనితలు—వస్త్రాలు" అన్న వ్యాసం చదివాను. చాలా చక్కగా రెండు ముక్కల్లో విజాన్ని నిరూపించారు. ఈనాడు, రేపు అంతా "ఫేషన్" కాలం. ఆవిడ చెప్పినవిధంగా అంతా నడుచుకోవాల్సిన అవసరం చాలా తక్కువ. మగవారి ఎగతాళిలు మాట అటుంచి, మనలని చూసి ఏడ్చేవాళ్ళు కూడా వున్నారు. ఎంత వున్నప్పటికీ లేనట్టుగా నటిస్తూ ఉండాలి. అందుకు నేను వారితో ఏకీభవిస్తున్నాను.

వి. శాంతాబాయి (ఝూర్సుగూడ)

* * *

అద్దెకొంపలు

అద్దెకొంపల యజమానులకు కావలసినది డబ్బుమాత్రమే. ఇంటిలోఉండేవారు నానా అవస్థలు పడినాసరే వారికి లెక్కవుండదు. వి. జానకి (జయపురం) గారు తమయింటివారు అద్దెకిచ్చుకుని బాధలు పడుతున్నామని వ్రాశారు. పిల్లా జెల్లా ఉన్నయిండ్లలో శుభ్రముగా ఉండకపోవచ్చును. ఆవిషయము పిల్లలున్నవారికే తెలుస్తుంది. అలాబాధపడేవారు ఇళ్ళుఅద్దెకివ్వటం మానుకోవాలి.

కె. కామేశ్వరమ్మ (పాలవ్రరు)

* * *

జీవన వ్యయం

శ్రీమతి పద్మావతి శర్మగారు 'రూర్కెలా' వంటి పారిశ్రామిక నగరాల్లో ధరవరలెలావుంటాయో చక్కగా వివరించారు. 'రూర్కెలా' ఐదులు కెంపెడ్తున్నారు, భిలాయివంటి నగరాల్ని ప్రస్తా

మించినా సరిపోతుంది. ముఖ్యమైన యింటి విషయం రచయిత్రి మర్చిపోయారు. ఈ నగరాల్లో ఒక్కొక్క యింట్లో రెండు, మూడు కుటుంబాలు కూడ కాలం గడుపుతూ వుంటారు. బెంగుళూరులో మా వదినగారికి ఇల్లే దొరకలేదు, కంపెనీలో పది సంవత్సరాలు సర్వీసు అయిపోయినా!

శ్రీమతి జయంతి లక్ష్మి (బెంగుళూరు)

* * *

రచయిత్రి తమ స్వంతవిషయాలను విపరీతమైన గొప్పకు తీసుకుపోకుండా ఉన్నది ఉన్నట్లుగా చిత్రించినట్లు తోస్తున్నది. సాధారణంగా ఏదో ఒక అదనపుఖర్చు ప్రతినెలా వస్తూ ఉండటం ప్రతి కుటుంబంలోకూడా సహజమే. రచయిత్రి ఈ వ్యాసంలో తమ విషయాలను సహజంగా వ్రాసినందుకు చాలా సంతోషం. రచయిత్రులందరూ కూడా ఇటువంటి సహజమైన వ్యాసాలు పత్రిక ద్వారా మాకు అందివ్వగలరని ఆశిస్తున్నాను.

పి. బల్లికృష్ణమ్మ (నిడుబ్రోలు)

* * *

మనదేశంలో ఆంధ్రులు ఉద్యోగరీత్యా అనేక చోట్ల నివసించుచున్నారు. వారికష్టసుఖాలుగూర్చికాని, అక్కడి జీవనప్రమాణం గూర్చి తెలిసికోవటం మనకు చాలా అవసరం. కాని, అత్తలు, ఆడబడుచులు, లాంటి వ్యాసాలువ్రాసి స్త్రీతోటి స్త్రీ జాతిని అవమానపరచుకోవటం శోచనీయం. అలాంటి వ్యాసాలు తగ్గించి, 'మంచివ్యాసాలు' వ్రాస్తారని ఆశిస్తున్నాను.

కల్లూరి యశోద నరసింహులు (అనంతపురం)

* * *

శ్రీమతి పద్మావతిగారు మునుపు చాకలివాళ్ళు రేవులెక్కన బట్టలు పుతుకుతారని వ్రాశారు. ఇప్పుడు ఇక్కడకూడ బట్టకి రెండుఅణాల చొప్పున తీసుకొంటున్నారు.

కుమారి పి. రాజ్యం (వరి)

వంటలు

బాదంఖీర్

కావలసిన వస్తువులు


సీమబాదంపప్పులు	— 12
పాలు	— 1 కప్పు
నీరు	— $\frac{3}{4}$ కప్పు
రంగు.	— చిటికెడు
చక్కెర	— 4 చెంచాలు

బాదంపప్పుల్ని ఒక గంటసేపు వేడినీటిలో నానవేసి, పొట్టుతీసి, మెత్తగా రుబ్బాలి. రుబ్బగా తయారైన ముద్దలో నీరు, పాలు పోసి కలుపుకోవాలి. ఆతరువాత చక్కెర కలిపి సన్నటి సెగమీద మరగనివ్వాలి.

* * *


వనితలకు మనవి

వనితావాణికి పంపే ఉత్తరాలు క్లుప్తంగా ఉండాలి. వీలైనంతవరకూ పత్రికలో సగం 'కాలం' మించకుండా ఉంటే బాగుంటుంది. వ్రాసినవారి పేరు వగైరా తెలుగులోనే వ్రాయాలి. ఇంగ్లీషులో ఉండకూడదు.



"నువ్వు మహారాణిగా కాకుండా కొన్ని రోజులపాటు వంట చేయడం నేర్చుకుంటే మనం కొంతడబ్బు మిగుల్చుకోవచ్చు కదా."
"అసలు మీరు కొన్ని ఖర్చులు తగ్గించే డబ్బు మిగల్చడం నేర్చుకుంటే ఆ డబ్బుతో ఒక వంటవాణ్ణి పెట్టుకోవచ్చు గా!"

తెలుగు పత్రికలన్నిటిలోనూ ఆంధ్రసచిత్ర వారపత్రిక సర్క్యులేషన్ అత్యధికమైనది!



PHILLIPS ఫిలిప్స్ సైకిళ్ళు

మీకై నిర్మితమైనవి

పొగడ్త కంటికి వదరైన ఫిలిప్స్ సైకిలు నేటి మీవంటి వుత్సాహవంతులైన యువకుల కొరకై నిర్మితమైనది. ఎట్టి మోటు వాడుకకైనను తట్టుకొన జాలునట్లుగా అపరైన పదును చేయబడిన ఉక్కుతో దృఢముగా నిర్మింపబడినది.

డెబ్బై ఏండ్లుగా ప్రపంచ ఖ్యాతి పొందిన ఫిలిప్స్ సైకిళ్ళు, యిప్పుడు టి. ఐ. సైకిల్స్ వారి అత్యాధునికమైన కర్మాగారంలో, ఖచ్చితమైన పద్ధతులలో తయారుచేయబడుచున్నవి.

RENOWNED THE WORLD OVER — MADE IN INDIA — PHILLIPS — MADRAS

టి. ఐ. సైకిల్స్ ఆఫ్ ఇండియా *అంబత్తూరు – మద్రాసు*


డాక్టర్ రాజు

బొమ్మల కథ

దేవిక

23






అద్దంలో ఇరవై మూడేళ్ళ తన మొహం చూసుకున్నాడు మూర్తి. 'ఉహూ! లాభం లేదు!' అని నిట్టూర్చాడు. ఎన్ని వంకరలు పెట్టి, ఎన్ని కోణాలు మార్చి చూసినా, తనమొహంలో అంద మైనది ఏదీ కన్పించ లేదు; కాదు; కనిపించదు. 'బాబ్జీ' అనే పిలుపు పక్కింటి అమ్మా యిలు తనను ప్రేమించారంటే, వాళ్ళ కళ్ళు పోయింది ! ఈ ముఖంలోకి అందం రావాలంటే, ప్లాస్టిక్ సర్జరీ తప్ప వేరే గత్యంతరం లేదు. అందుకు బహుశా విదేశాలకు వెళ్ళవలసి ఉంటుంది. అది తను బి. ఏ. పాసయితేగాని సాధ్యంకాదు. బి. ఏ. పాసవడానికి ఆరునెలలు వ్యవధి ఉంది. ఈలోపల, ఆ అమ్మాయిల గోల నెలా భరించడం ?— అదే, మూర్తికి ఎదురైన సమస్య.

పక్కింటి అమ్మాయిలంటే, కొత్తగా ఆ బంగళాలో అద్దెకు దిగిన ఇంజనీరుగారి అమ్మా యిలు. అది తాతగారామూర్తులు మూర్తి తండ్రిది. అందులో ఒక గదిమాత్రం మూర్తి కోసం ఉంచి, తక్కినదంతా ఆ ఇంజనీరుగారికి అద్దె కిచ్చేశారు, మూర్తి తండ్రైన కోదండ రామయ్యగారు, ఆయన ఉద్యోగరీత్యా మరో ఊర్లో ఉండవలసి రావడంవల్ల.

శ్రీకాకుళం కాలేజీలో మూర్తిని ఎరుగని



వాళ్ళు లేరు. హాకీ, క్రికెట్, ఫుట్‌బాల్ మొదలైన ఆటల్లో అతనిది అందెవేసిన చెయ్యి. ఆరడుగుల పొడవూ, బలిష్టమైన కండలు తిరిగిన శరీరం పెట్టిన భగవంతుడు, మూర్తి ఆకారానికి, ఆఖరిసారి మెరుగులు దిద్దడంలో పొరపాటుచేసి, అప్రక్కన ఖాళీగా పడివున్న ఒక చింపాంజీ తలను తీసుకొచ్చి అతికించేశాడు. ఇన్నిరోజులనుంచీ ఆ విషయం మూర్తిని అంతగా బాధించలేదు. కాని, ఈ ప్రపంచంలోకల్లా అందమైన ఒకే ఒక అమ్మాయి— తనరూపం గురించి మాటిమాటికీ వెక్కిరించి మరొక అమ్మాయితో కలిసి తనను ఏడిపించడం, మూర్తికి చాలా బాధ కలిగించింది. ఆమె, ఇంటి వీరుగారి రెండో అమ్మాయి, సుజాత. ఆమె పదహారేళ్ళ, అప్సరస. మూర్తికి కవిత్వం రాకపోవడం వల్ల ఆమె అందంయొక్క వివరాలు ఆంధ్ర మహాజనులకు లభించలేదుకాని, లేకపోతే ఆమె కట్టుకునే పరికిణీ వోణీల రంగులదగ్గర్నుంచి, ఆ పొడుగాటి జడా, ఆ విశాలమైన కళ్ళూ, ఆ ఎర్రటి పెదవులలో ఉన్న అందంగురించి, స్వయంగా ఒక నూరుపద్యాలు రాసి, అచ్చొత్తించి, ఆ పుస్తకాల్ని అందరికీ ఉచితంగా పంచిపెట్టి ఉండేవాడు, మూర్తి! భగవంతుడు చేసిన మరొక లోపం, మూర్తికి కవిత్వం రాకపోవడం. మూర్తికే గనక కవిత్వం వస్తేనా......?

అస లిదంతా ఎలా ప్రారంభమైందంటే, తన కోసం అద్దె కట్టబడిన గదిలో కూర్చొని, ప్రొద్దున్నపూట మూర్తి చదువుకుంటున్నాడు. సరిగ్గా ఆగది ఎదురుగా ఉన్న మరొక గది కిటికీ దగ్గర నిల్చుని ఇద్దరు అమ్మాయిలు మాట్లాడుకుంటున్నారు. వారి మాటలు మూర్తి చెవులో పడ్డాయి.

"ఈ ఊళ్లో 'జూ' కూడా ఉందిలాగుందే."

"అవునేవ్, మనకింత దగ్గరలో 'జూ' ఉండడం, చాలా మంచిది సుమా! కాస్త మనకి ఊసుపోతుంది."

మూర్తి తలెత్తి చూశాడు. ఆ సమయానికి మూర్తి బుర్రలో ఇంకా ఆ మాటల అర్థం స్ఫురించలేదు. ఇద్దరు, జిగేల్‌మని మెరిసిపోతున్న అమ్మాయిలు కన్పించారు.

"మనిషేనే ....!" అంది అందులో చిన్నమ్మాయి.

"అవును సుమా, టార్జాన్ అయివుండాలి!" అని ఇద్దరూ కిలకిలా నవ్వుకున్నారు. ఆ నవ్వును చూసేసరికి మూర్తికి చరాలుమని కోపం వచ్చింది. వాళ్ల మాటలకు అర్థం బోధపడింది. వెక్కిరిద్దామనుకున్నాడు. పేర్లు పెడదామనుకున్నాడు. కసితీరా ఏడిపిద్దామనుకున్నాడు. కాని ఆ నిముషంలోనే, ఆ చిన్నమ్మాయి మాటిగా తనవేపు చూసి, తల తిప్పేసుకోవడం, మూర్తి 'ఐస్' అయిపోవడం జరిగిపోయింది. మరి ఆ అమ్మాయిని ఏడిపించ బుద్ధెయ్యలేదు, మూర్తికి. ఎందుకంటే, ఏ యువకుడైనా, ప్రేమించడమో ఏడ్పించడమో ఏదో ఈ రెండిట్లో, ఒకపనే చెయ్యగలడుగాని, రెంటినీ చెయ్యలేడు. అయినా, అలా ఆ అమ్మాయివైపు చూస్తూ ఉండిపోయాడు. గాని, మరో ఆలోచనే అతనికి తట్టలేదు.

తరువాత మూర్తికి ఆ అమ్మాయిలలో పెద్దమ్మాయి పాడటం విన్పించింది. మూర్తి మెల్లిగా లేచి, తలుపు వేసేసి, బయట వరండామీదకు వెళ్లాడు. ఆ అమ్మాయిలు ఏవో మాటలు మాట్లాడుకుంటూ నవ్వుకుంటున్నారు.

"టార్జాన్ మీద ఒక పద్యం రాయవే"

"అబ్బ, అంత 'ఇన్‌స్పైరింగు' గా లేదు, రూపం."

"పోనీ ఒక గేయమో, గీతమో రాయి."

"అలాగేలే. అన్నట్టు — 'కోతినుండి మనిషి' అన్న గేయం చదివావా? ఎంత బాగా వర్ణించాడే."

"అవునవును. చాలా బావుంది."

గదితలుపు తాళం వేసి, కాఫీ త్రాగడానికి బయల్దేరాడు మూర్తి. ఈ ఇద్దరమ్మాయిలకీ సంగీతం, సాహిత్యం, అంటే చాలా యిష్టం లాగుంది, అనుకున్నాడు. పైగా చాలా గడుసు అమ్మాయిలులాగ ఉన్నారు. తను తల్చుకుంటే, మూడు నిముషాల్లో వాళ్ళని కళ్లనీళ్ల పర్యంతం చెయ్యగలడు. అమ్మాయిల వెనక్కాలవెళ్తూ, వాళ్లను కావలసినంత అల్లరిపెట్టగల సమర్థత ఉంది.

89—వ పేజీ చూడండి



కోయవాడా

హాయవాతా అద్భుతగాథ

మూలం: లాంగ్‌ఫెలో : : అనుసరణ: పి. గణపతిశాస్త్రి

చిన్న చీమకూడా కాలు కదపలేని

కారడవిలో నోకోమిస్ ఒక పెద్ద ద్రాక్షతీగ ఉయ్యాల ఊగుతూంది. అప్పటికే సాయంకాలం అయింది. మరికొంత సేపటికి కొంచెం చీకటి పడింది. నిండుజాబిల్లి పండు వెన్నెల ఆ అడవిలో నాలుగుమూలలా వ్యాపించింది. ద్రాక్షతీగ చిగుళ్లు, పళ్లు ఆ వెన్నెల్లో తళతళా మెరిశాయి. పక్కనే ప్రవహిస్తున్న సెలయేటి నీటి తుంపురులు మంచి ముత్యాల్లా పైపైకి ఎగిరిపడ్డాయి.

నోకోమిస్ హాయిగా పాడుకుంటూ ఉయ్యాల ఊగుతూ మరి లోకం మాటే మరిచిపోయింది! మాటిమాటికీ తన అందం చూసుకుని ఉబ్బితబ్బిబ్బై గొంతెత్తి పాడింది. చందమామ కేసి చూసి కలకలా నవ్వింది. నోకోమిస్ జాబిల్లి చిన్నారి భార్య. చందమామ కూడా ఆమె కేసిచూసి కొంటెగా కన్నుగీటాడు. అంతలోనే వారిద్దరి మధ్యనించి ఏటి కొంగల బారు తివ్వుమని దూసుకుపోయింది. నోకోమిస్ లోలోపల నించి ఉప్పొంగుతున్న ఉత్సాహం పట్టలేక ఒక్క ఊపుతో కొండ మీది కెగిరి రేరాజు నీలాల ముంగురులు ముద్దుపెట్టుకోవాలని ఎంతో ఉబలాటపడింది! అమాంతంగా పైపై కెగిరింది!

ఆమె చెలికత్తెలిద్దరు ఆ పక్కనే నిలబడి "ఆహా! నోకోమిస్ ఎంతటి చక్కని చుక్క!" అని నిలువునా నిర్ఘాంత పడ్డారు. అంతలోనే ఆమె నోటిపాట ఉయ్యాలతో పాటు ఆకాశమే అందుకుంది! చెలికత్తెలిద్దరు గొంతులెత్తి "ఓహో!" అని మెచ్చుకున్నారు.

కన్నుమూసి తెరిచినంతలోనే ఆ ద్రాక్షతీగ ఉయ్యాల ముక్కలు ముక్కలై నోకోమిస్ పసిరిపచ్చిక మీద కూలిపోయింది. కొంచెం దూరంలో కొండపల్లెలో జనం ఆవింతచూసి ఏదో పెద్దతారక హఠాత్తుగా నేలమీదికి ఉరికిందని అనుకున్నారు. అంతేగాని జరిగిన ద్రోహం వాళ్ల కవళ్లకీ అంతుపట్టలేదు. జాబిల్లి కింకా చాలామంది భార్య లున్నారు. వాళ్ళందరు నోకోమిస్ చందమామ కేసి చూస్తూ హాయిగా ద్రాక్షతీగ ఉయ్యాల ఊగుతుంటే చూడలేక కళ్ళల్లో నిప్పులు పోసుకున్నారు. అతిరహస్యంగా ఆ ఉయ్యాల కట్టిన ఊడల మర్రిచెట్టు మీద కెక్కి వాడివాడి బాకులతో ఆ ద్రాక్షతీగ ముక్కలుగా ముక్కలుగా నరికి చిటారు కొమ్మల్లో దాక్కున్నారు.


పాపం! నోకోమిస్ కుప్పగా కూలబడిపోయింది! పసిరి పచ్చిక ఒత్తుగా పెరిగిన నేల కనక అట్టే గట్టి దెబ్బ తగలలేదు గాని లేకపోతే నోకోమిస్ ఆ క్షణంలోనే పరలోకంలో ప్రవేశించి ఉండవలసిందే!

ఆమె అమ్మో! అని అరిచి స్పృహ తప్పి పడిపోయింది. అంతలోనే చెలికత్తెలిద్దరు అనేక విధాల శీతలోపచారాలు చేశారు. మరి కొంత సేపటికి నోకోమిస్‌కి తెలివి వచ్చింది. క్రమం క్రమంగా తిరిగి తేరుకుంది. చెలికత్తెలిద్దరు ఆమె నోదార్చి నెమ్మది నెమ్మదిగా ఆ పక్కనే ఉన్న చంద్రకాంత శిలల సౌధంలోకి తీసుకుపోయారు.

అలాగలాగ మరికొంత కాలం గడిచిపోయిన తరువాత ఆ రేరాజు చిన్నభార్య కొక ఆడపిల్ల కలిగింది. ఆమె పగడాలరాశి. అందాలబరిణె! చిన్నినోరు తెరిచి చిట్టి చేతులెత్తి 'ఉవ్వా! ఉవ్వా!' అని అదేపనిగా మారాము చేసింది. నోకోమిస్ ఆ పసిదానిని గుండె కద్దుకొని కడుపు నిండా పాలిచ్చి ముద్దులతో ముంచెత్తింది. ఉయ్యాలలో పడుకోబెట్టి ఊపింది. చిన్నారి చుక్కలపోగులా మెరిసిపోతున్న ఆ పసిపాపకేసి చూసి మళ్లీ తన నిండుగుండె కద్దుకుంది. ఎంతో మురిపెంతో వెనోనా అని పేరుపెట్టి పిలిచింది. ఆ పసిపాప అది విని చిన్నచిరునవ్వు చిలకరించింది.

క్రమక్రమంగా వెనోనా పెరిగి పెద్దదయింది. ఆ అందకత్తె అల్లనల్లన ఒయ్యారం ఒలకబోస్తూ నడుస్తూంటే పసిరిపచ్చికలో చల్లని

33—వ పేజీ చూడండి



దేవునికి దరఖాస్తు

విశ్వమెల్లను నిండి వెల్గొందుచున్నావు
దేవదేవా! నీదు దివ్యసమ్ముఖమందు
ఉద్యోగమును జేయ సుఖలాట పడుచుంటి
కరుణతో నీవు నా మొర ఆలకించుమా!
పాపభీతియు, భక్తి, భయము, ప్రేమయు గల్గి
భూతదయతో నెపుడు భువిని నే చరియింతు
నిర్ణయించిన పనులు నెరవేర్పగా గలను
అంతెగాని యితర అర్హతలు మరి లేవు!
పెద్ద సంసారంబు, పేదవాడను నేను
ప్రొద్దుగడవదు మాకు పోషింపగాలేను
నేల, నింగియు దేవ! నీదు కార్యాలయమె
సువిశాల విశ్వమున చూడు మొక శాఖని
పెద్దమనుషులమంచు సుద్దులెన్నియొ పల్కి-
బుద్ధిలేకే వారు భువిని చరియించేరు!
వారివద్దను నేను వసియింపగాలేను
భారమై జగతిలో బ్రతికియుండగలేను
పనియొసగి నాకిపుడు బ్రతుకు
తెరువును జూపు
అనయమ్ము నీనామమాత్మలో జపియింతు-
పెన్నిధిని గన్నట్టి పేదనై యుప్పొంగి
మిన్ను, మన్నున నేను మేటినై
చరియింతు!

చిరమన శ్రీనివాసులు (చెన్నూరు)

* * *

రాసుల పేర్లు

"ఇప్పుడు రాసుల పేర్లు, వాటి అర్థం చెప్పండిరా. ఒరేయ్ వాసూ మొదటిరాశి ఏమిటో! నువ్వు చెప్పు" ఉపాధ్యాయుడు ఉత్తరువు చేశాడు.

"మేషం-మేకా"

"రైట్! తరువాతది నువ్వు చెప్పరా రవీ"

"వృషభం-ఎద్దూ"

"రైట్! ఆతరువాతది నువ్వు చెప్పరా శంకరం"

వాడు బిక్క మొహం వేసి రెండునిమిషాల తరువాత "గార్దభం గాడిద" గొణిగేశాడు!


సి. హనుమంతరావు (భీమవరం)

* * *


తేడాలు


అందరూ ఒకటంటారు
కొందరే ఒకటౌతారు!
అందరూ పోటీ చేస్తారు
కొందరే గెలుస్తారు!
అందరూ వ్రాస్తుంటారు
కొందరివే ప్రచురిస్తుంటారు!
అందరూ కృషి చేస్తారు
కొందరే నిపుణులౌతారు!
ఎందుకీ తేడా రావటం
అందుకే ఈ కవిత్వం!

అనుర్తలూరి ఉమామహేశ్వరరావు,
(వేటపాలెం)



చదువుల్రావు


ఏరా రెండురోజుల క్రిందట ఆపరేషన్ చేయించుకున్నావు కదా మళ్ళీ నిన్ను ఆపరేషన్ చేశారు ఏమిటి?
డాక్టరుగారు ఆపరేషన్ చేశాక పొరపాటుగా ఒక కత్తెరని నాలోపలే పెట్టి కుట్లు కుట్టేసారు. ఆ కత్తెరని తియ్యడానికి నిన్న మళ్ళీ ఆపరేషన్ చేశారు
ఇప్పుడు కులాసాగా ఉంటున్నావా?
గంట క్రితం వరకూ కులాసాగానే ఉన్నాను ఇందాకా డాక్టరుగారు నిన్ను ఆపరేషన్ చేస్తున్నప్పుడు నా స్టెతస్కోప్ ని ఎక్కడో పెట్టాను వెతకండి అని వచ్చి అంటున్నారు ఇది విన్నప్పటినుంచి ఒంట్లో కొంచెం గాభరాగా ఉంది
సత్యమూర్తి



దైవజ్ఞపోతూరి శ్రీరామమూర్తి

4-5-1962 శుక్రవారము మొదలు
10-5-1962 గురువారము వరకు

మేషం :

(అశ్విని, భరణి, కృత్తిక 1 పా.)

ఈవారం కొన్నిసందర్భాలలో విచిత్రమైన ఆలోచనలు తోస్తూ ఉంటవి. అందువల్లనే ఒకటి రెండు నిరుపయోగకార్యాలలో ప్రవేశించటం జరుగుతుంది. మీరు ఇతరులకు సహాయం చేయుకోయిన సందర్భంలో, మీ పనులు మరొకరు చేసి పెట్టవలసిన అవసరం ఏర్పడుతుంది. ప్రయాణాలు అనుకూలిస్తవి. వృత్తి ఉద్యోగాలలో ఎదుటివారిని నొప్పించకుండా మీ ధర్మాన్ని చక్కగా నెరవేర్చుకొంటారు. విలువగలవస్తువులు కొనే విషయాలలోగాని, ఇతరులచేత పనులు చేయించే విషయాలలోగాని మోసం జరుగకుండా చూసుకోవటం అవసరం. సాధారణంగా ఈవారం అంతా సుఖసంతోషాలతో గడుస్తుంది. కోర్టు కచేరీలలో మీ పనులు సుముఖంగా జరుగుతవి. 7, 8 తేదులలో ఇష్టవస్తులాభం, బంధుమిత్రులవద్దనుంచి శుభవార్తలు.

వృషభం :

(కృత్తిక 2, 3, 4 పా., రోహిణి, మృగశిర 1, 2 పా.)

ఇంతకుముందు ఏర్పడిన ఆందోళన తొలగి పోతుంది. ధనవ్యయం అధికంగా అవుతుంది. కాని, తలపెట్టిన పనులు పదిమందికీ సంతృప్తికరంగా నెరవేర్చుకో గలుగుతారు. మీ మంచిని కోరి సలహా చెప్పగలవారు లభిస్తారు. ముఖ్యంగా మీ ఆరోగ్యం గురించి జాగ్రత్తగా యుండండి. మీ అభివృద్ధి, కీర్తిప్రతిష్ఠలకు సంబంధించిన కార్యక్రమాలలో ప్రతిబంధకాలు తొలగిపోయి క్రమంగా ముందుకు పోగలుగుతారు. బంధువులవద్దనుంచి ఎదురు చూస్తున్న వార్తలు సకాలంలోనే వస్తవి. కాని, మీరు అనుకున్నంత ప్రయోజనం ఉండకపోవచ్చు. సంఘంలో మీ మాటను పదిమందీ ఆదరించి అనుసరిస్తారు. ధర్మకార్యాలలో పాల్గొంటారు. ఎంత భారమైన కార్యమైనా మరొకరిమీద ఆధారపడకుండా సాగించగల అవకాశం లభిస్తుంది. 4, 5 మనోవిచారం, చేసినపనినే చేయవలసి రావటం.

గ్రహస్థితి

మేషంలో సూర్యుడు, వృషభములో బుధ శుక్రులు, కర్కాటకంలో రాహువు, మకరంలో శని కేతువులు, కుంభంలో గురువు, మీనంలో అంగారకుడు, మేష వృషభ మిథున కటకాలలో చంద్రుడు.

* * *

మిథునం :

(మృగశిర 3, 4 పా., ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పా.)

మీరు ఎంతజాగ్రత్తగా ఉన్నామనుకున్నా తెలిసీ తెలియకుండా మీ బాధ్యతలలో పొరపాట్లు జరిగే అవకాశాలున్నవి. సాధారణంగా నమ్మకంతో మిమ్ముల కష్టనష్టాలలో దింపేవారు ఉంటారు. సాధ్యమైనంతవరకు ముందుజాగ్రత్త అవసరం. వ్యాపార వ్యవహారాలలో తిరిగి ఆలోచనలు, అధికశ్రమ మొదలైనవి కనుపిస్తవి. మీకు ఇబ్బందులను కలిగిస్తూ మీవల్ల తామే చిక్కుపడుతున్నామనేవారు ఉంటారు. మంచివారి స్నేహం, ఆదరణ లభిస్తవి. దూరపు ప్రయాణాలు చేయవలసి రావచ్చు. కార్యభారాన్ని యుక్తిగా తప్పించుకో గలుగుతారు. బంధుమిత్రులవల్ల ఖర్చులు పెరుగుతవి. సంఘ కార్యాలలో పోటీ అధికంకావచ్చు. 7, 8 తేదులలో ధనలాభం, కార్యసిద్ధి, అధికారప్రాప్తి.

* * *

కర్కాటకం :

(పునర్వసు 4 పా., పుష్యమి, ఆశ్లేష)

ఒకరి అభిప్రాయంతో నిమిత్తంలేకుండా మీ శక్తికి తగినట్లు వ్యవహారాలను సాగించగలుగుతారు. డబ్బుకు వత్తిడి పెరిగినట్లు తోస్తుంది. మానసికంగా ఆందోళన కలుగుతుంది. కాని, పోటీవారితో మీ వాగ్దానాలను చెల్లించుకో గలుగుతారు. పిల్లల శుభకార్య ప్రయత్నాలు అనుకూలించగల సూచన ఉన్నవి. ఆదాయం బాగుంటుంది. తలవనితలంపుగా మిమ్ములనుగురించి అపవాదులు వ్యాపించే పరిస్థితులు ఏర్పడగల సూచన ఉన్నవి. మీ క్రింద పనిచేసే వారు మిమ్ములను మంచిమాటలతోనే ఇబ్బంది పెట్టటానికి చూస్తారు. దైవానుగ్రహం బాగున్నది. ఏ సందర్భంలోనూ ప్రత్యక్షంగా అపకారం జరుగదు. వారాంతంలో వినోదకార్యక్రమాలలో పాల్గొంటారు. 5, 6 లలో అధికారులవల్ల అనుకూలత, అలంకారవస్తుప్రాప్తి, శుభవార్తలు.

* * *

సింహం :

(మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)

ప్రతివిషయంలోనూ ఇతరులతో పోటీ పడవలసి వస్తుంది. ఖర్చులు మాత్రం శక్తికి మించిపోయే సూచనలున్నవి. యుక్తివాదంలో మిమ్ములను బోల్తాకొట్టించటానికి చూసేవారుంటారు. ఇంతకుముందు మీరు ఎవరిని నమ్ముకున్నారో వారిని వదులుకొని, మరొకరితో సంబంధం కలిగించుకోవలసి వస్తుంది. మీ శక్తిని వినియోగించుకొని పదిమందిలో నిలబడగలుగుతారు. కుటుంబంలో విలువగల వస్తువులు కొంటారు.

మామూలు ఆదాయంకూడా ముందుకన్నా బాగుంటుంది. దేహశ్రమమాత్రం తప్పదు. లోగడ మీరు చేసినకృషి, ఈ సమయంలో ఫలిస్తుంది. ముందుముందు ఎప్పుడో ఉపయోగించవల పనులకై ఈ సమయంలో ప్రయత్నాలు ఆరంభమవుతవి. 9, 10 తేదులలో సంచారము, శుభ సంతోషాలకై ఖర్చులు.

* * *

కన్య:

(ఉత్తర 2,3,4 పా, హస్త, చిత్త 1, 2 పా.)

అదృష్టదాయకమైన సమయం. అయితే ప్రశాంతతమాత్రం ఉండదు. పట్టుదలగా పోట్లాడవలసిన అవసరం కలుగుతుంది. డబ్బు సమయానుకూలంగా వినియోగిస్తూ రావటంవల్ల మీ వ్యాపార వ్యవహారరంగాలలో అభివృద్ధి, జయము పొందగలుగుతారు. మాటలలో మిమ్ము లను ఎదుర్కొనటానికి ప్రయత్నించేవారు ఉంటారు. కాని, వారిప్రయత్నాలు పూర్తిగా సాగవు. బంధుమిత్రుల ఇండ్లకు ప్రయాణం చేయవలసి వస్తుంది. ఏపని చేస్తున్నా మనస్సు మాత్రం తీవ్రమైన ఆలోచనలతో సతమత మవుతూ ఉంటుంది. వారాంతంలో శుభవార్తలు తెలుస్తవి. దైవకార్యాలు అనుకూలిస్తవి.

* * *

తుల :

(చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు)

అన్నిరకాల మనుష్యులతోను సమానంగా వ్యవహరించి మీ ఆధిక్యతను కాపాడుకోగలుగుతారు. ఆదాయం బాగా వస్తూవుంటుంది. మరొక ప్రక్క ధారాళంగా ఖర్చు అవుతూ ఉంటుంది. మొత్తంమీద మీ కార్యక్రమాలు సుఖంగాను, లాభదాయకంగాను జరుగుతవి. మొదట్లో అశ్రద్ధగా ఉన్న పనులు ఈసమయంలో మంచిఫలితాన్ని ఇస్తవి. పెద్దమనుష్యులను కలుసుకోగలుగుతారు. వస్త్రాలు, ఆభరణాలు మొదలైనవి కొనగలుగుతారు. ఇంతకుముందు ఏర్పడిన తగాదాలు సమసిపోయి మనశ్శాంతి లభిస్తుంది. మీ అజాగ్రత్తను వినియోగించుకుని మోసం చేయటానికి ప్రయత్నించేవా రుంటారు. ఈసమయంలో జాగ్రత్తగా ఉండండి. 7, 8 తేదులలో శుభవార్తలు, ప్రయాణాలు.

* * *

వృశ్చికం :

(విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ.)

మీరు చురుకుగా ఆలోచించలేరు. ఒకరిమీద పూర్తిగా ఆధారపడలేక పోతారు. కలిసివచ్చేటట్లు కనుపించిన పనులు కొంచెం క్రమంగా తయారు కాగలవు. తగుమనుష్యుల సహాయం లభిస్తుంది. శుభసంతోషాలలో పాల్గొంటారు. మీరు ఇంతకు ముందు ఎవరిని స్నేహితులని భావిస్తున్నారో వారినే ఈ సమయంలో సందేహించవలసివస్తుంది. క్రొత్త విషయాలనుగురించిన ఆలోచనలు, ప్రసంగాలు ఆరంభ మవుతవి. వ్యవహార రంగంలో కార్యభారం పెరుగుతూ పోతుంది. పూర్తిగా ఆశ పోదు. ఎదుటివారి కలహాలు మీ అశాంతికి కారణం కావచ్చు. 9, 10 లలో కార్యభంగం, వృధా ఖర్చులు, తీవ్రమైన ఆందోళన.

* * *

ధనుస్సు :

(మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.)

మీరు ఎంత ఓర్పు, ఉత్సాహము చూపించినా ఎదటివారుకూడా ఆ ధోరణిలో మాట్లాడక పోవటంవల్ల మీరే ఒక అడుగు వెనుకకు రావలసి వస్తుంది. అందువల్ల కొన్ని పనులలో ఆటంకం కనుపిస్తుంది. అయితే నిదానంగా దానివల్ల కలిగే మంచిఫలితాన్ని పొందగలుగుతారు. ఆరోగ్యం సంతృప్తికరంగా ఉండదు. మీక్రింద పనిచేసేవారు ఒకమాటమీద నిలబడకపోవటంవల్ల మానసికంగా విసుగుదల ప్రారంభమవుతుంది. ఆదాయం బాగానే ఉంటుంది. ఎవరితో ఏ విషయాన్నిగురించి మాట్లాడుదా మనుకున్నా ముఖ్యంగా సమయం కలిసిరాదు. అన్నిరకాల పనులమీదా మీ బుద్ధిని వినియోగించవలసి రావటంవల్ల అలసట అధికం అవుతుంది. ఉద్యోగరంగంలో హోదామాత్రం పెరుగుతుంది. 5, 6 తేదులలో కార్యసిద్ధి, బంధువులవద్దనుంచి శుభవార్తలు.

* * *

మకరం :

(ఉత్తరాషాఢ 2, 3, 4 పా, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పా)

మనసులో అనేక యోచనలు చేస్తుంటారు. ఇందులో ఏ ప్రయత్నం కలిసివస్తుందో ఏది ప్రతికూలిస్తుందో తెలుసుకొనటం కష్టం. కాని మీ అవసరాలకు తగినంత ఆదాయం ధారాళంగా లభిస్తుంది. పదిమందిలో అగౌరవం వస్తుందేమోనని యోచన తగ్గిపోతుంది. పిల్లల వృద్ధి నిమిత్తం జరిగే ప్రయత్నాలు చాలావరకు ఒక స్థితికి వస్తవి. ఉత్తరదిక్కునుంచి లాభవార్తలు తెలుస్తవి. సాధారణంగా ఇతరులవల్ల మోసం జరుగుతుందేమోనని యోచన చాలావరకు తగ్గిపోతుంది. వారం చివరలో ఆశ్చర్యము, ఆందోళన కలిగే వార్తలు వింటారు. ప్రయాణ ప్రయత్నాలు కొనసాగకపోవచ్చు. 4, 5 లలో సుఖభంగం, వృత్తిలో అనుకూలత, ధనప్రాప్తి.

* * *

ఈ వారము ధరలు

ఈవారం బంగారుధర గతవారంమాదిరిగానే ఉంటుంది. వెండిధరలోమాత్రం మొదట మందీవచ్చి 3 నుంచి తేజీ రాగల అవకాశాలున్నవి. కందులధర మందీ అవుతుంది. చింతపండుధరలో తాత్కాలికంగా పెరిగే అవకాశా లున్నవి. వేరుశనగపప్పు ధరలో అకస్మాత్తుగా తేజీ వస్తుంది. వేరుశనగనూనెధర గతవారంమాదిరిగానేఉంటుంది. నూవులనూనె ధర కొద్దిగా పెరిగి తగ్గుతుంది. మాలు ధర నిలకడగా ఉంటుంది.

కుంభం :

(ధనిష్ఠ 3, 4 పా, శతభిషం, పూ. భాద్ర 1, 2, 3 పా.)

ఎవరు ఏవిధంగా మాట్లాడినా "అంతా మన మేలుకే" అనే ధోరణిలో మీరు తయారు కావటంవల్ల మీ అంతస్తును కాపాడుకో గలుగుతారు. మనశ్శాంతి, సుఖము లభిస్తవి. ఉద్యోగ మార్గాలలో అభివృద్ధికరమైన కాలం. సంగీతము, సాహిత్యము మొదలైనవాటియందు కృషిచేసే వారికి మంచి అవకాశం లభిస్తుంది. సంఘంలో గౌరవంతోబాటు ధనస్థితి కూడా బాగుంటుంది. కుటుంబంలో చిల్లరతగాదాలు వచ్చేటట్లు తోచవచ్చు. కాని, వాటివల్ల మీకు ఏమాత్రం వత్తిడి కలుగదు. ఏపనిలో ప్రవేశించినా అందరిని సంతృప్తిపరచగలుగుతారు. 6, 7 తేదులలో శుభవార్తలు, ధర్మకార్యాలు, మీ శక్తిని ఉపయోగించగల అవకాశం.

* * *

మీనం :

(పూ. భాద్ర 4 పా, ఉ. భాద్ర, రేవతి.)

ఎదటివారి నిష్ఠురాలను, వత్తిడిని తప్పుకొనటానికి రకరకాల మార్గాలను అనుసరించవలసి వస్తుంది. దానికి తోడు దేహసౌఖ్యం లోపిస్తూ ఉంటుంది. ఏ వ్యవహారంలోను ఒక నిశ్చయం చేయలేకపోతూ ఉంటారు. ఈ సమయంలో ఒక పని జరిగితేగాని మరొకపని చేయటానికి వీలుకాని మెలిక పరిస్థితి ఏర్పడటంవల్ల ఏపనీ పూర్తి చేయలేకపోతారు. కొన్ని నష్టకష్టాలను ఒప్పుకొని ఒకమార్గానికి రావటం అవసరం అవుతుంది. ప్రయాణాలు కొంతవరకు లాభిస్తవి. అష్టమిత్రులవంటివారితో ఎడబాటుకలిగే సమయం. ఈ సమయంలో మంచివారిసలహా మిమ్ములను ఒకదారికి తీసుకొనివస్తుంది. మొత్తంమీద ప్రశాంతత తక్కువ అని చెప్పవలసి ఉంటుంది. 5, 6, 7 తేదులలో శుభకార్యాలు, అధికారుల అదరాభిమానాలు. ★

సరాగమాల

వి. ఎ. కె. రంగారావు

నటభైరవి జన్యమైన ఆభేరి రాగానికి ఆరోహణావరోహణలు సగమపనిస, సనిదపమగరిస. సంగీతశాస్త్రముల ప్రకారం ఈ రాగానికి ముఖ్య లక్షణం మనోరంజనం. సరళ స్వరగతులతో తరళ కళలతో శ్రోతలను మోహింపజేయగలదీ రాగమని ప్రసిద్ధి. అందుకే కాబోలు ఈ రాగము భోగస్త్రీతో పరిపోల్చబడినది. [కాని ఈరాగసాధనసమయం మాత్రం అటువంటి స్త్రీలకు యేమాత్రం సరిపోవనిది. ఉదయం ఆరుగంటలనుంచి తొమ్మిదిగంటలవరకు.]

రాగాన్ని గురించి ఆమాత్రం చాలు. ఆ రాగంలో నలుగురికీ తెలిసిన కీర్తన త్యాగరాజుని "నగుమోము గనలేని". ఈ కృతిని మంగళంపల్లి బాలమురళీకృష్ణ పాడగా హెచ్. ఎం. వి. వారు ఇ. పి. రికార్డుగా విడుదలచేశారు. నంబరు 7 ఇ. పి. ఇ. 1611.

బాలమురళీకృష్ణ పాడటంలో, విద్వత్తేగాక, ఒక హాయీ ఉన్నది. పదోహరణాల ఆంధ్రులవటంవలన వీరి ఉచ్చారణ స్ఫటికంలాగ స్వచ్ఛంగా ఉంటుంది. తమిళుల నిసరిగమకాలతో విసిగినవాళ్ల కమృత ప్రాయం. అదీ లేకవారు పాడేటప్పుడు ఒక పాండిత్య ప్రకర్షకేకాక, సారస్వతంలోని స్వారస్యానికీ సమాన ప్రాముఖ్యత నిస్తారు. ఘటంకోసమని యెడా పెడా మాటలను దించిపెట్టరు. వినేవాళ్లను హడల గొట్టరు.

ఆంధ్ర వాగ్గేయకారచరిత్రలో బాలాంత్రపు రజనీకాంతరావుగా రన్నట్లు, బాలమురళీకృష్ణకు గానములో "దైవదత్తమైన ఉపజ్ఞతే కాకుండా' సరస్వతీకటాక్షమున్న వాగ్గేయకారుడు. అందు వలననే వారు పాడిన కీర్తనలు మరింత అర్థవంత ముగా తోచును.

* * *

వీప్రాంతపు జానపదగేయాలైనా సరళమైన పదస్వరజాలంతో కూడుకొని పామరజనాళికి అందుబాటులో ఉంటాయి. వివిధప్రాంతాల జానపదగీతాలలో మనకు సహజంగా ఆంధ్రదేశపు గీతాలు, కాస్త యిటూ అటూవున్న తమిళ, కర్ణాట, ఓఢ్రదేశపు గీతాలు నచ్చుతాయి.

ఇప్పుడు దొరికే గ్రామఫోను రికార్డులలో అచ్చం జానపదగేయాలు లేకపోయినా, జానపద గేయాలటువంటివి అప్పుడప్పుడు విడుదలౌతుంటాయి. వీటిలో చాల బాగావున్నవి, కె. జమునారాణి, పి. బి. శ్రీనివాస్ పాడిన రెండు యుగళగీతాలు: "మొగలిపూ ముడిచి మగువాలివలె నడిచి" నిజానికి తమిళ దేశానికి చెందిన వరస. మొదట "బాగప్పిరివిన్నై" చిత్రంలో కె. వి. మహాదేవన్ జోప్పించారు. సారథీవారు అదే కథను తెలుగులో "కలసివుంటే కలదు సుఖం"గా తీసి, అదే వరుసను ఉపయోగించుకున్నారు. అంత ఇంపుగాలేదు. దీనికి కారణాలు తమిళమాతృకకూ, తెలుగు అనుసరణకూ వరస కొంచెముకూడ మార్చకపోవటం. మాటలు కూడ డబ్బింగ్ పాటలవలె వికారంగా వుండటం.

జమునారాణి శ్రీనివాస్ పాడినపాటకు వరస కొంచెం మార్చి, కొత్త వాద్యబీజంలు కొన్ని చేర్చి, తేలికపరచినందువలన చాలా హాయిగా వీనులకు పసందుగా వుంది. "తొలి పైరు కోతలో" అనే మరొక యుగళగీతంలో తెలుగుదనం, జానపదాల తియ్యదనం రెండూ తొణికిసలాడుతున్నాయి. పై రెండింటికీ చిక్కని మక్కువలనిండిన చక్కని పదాలు పొదిపారు రచయిత రాజశ్రీ.

ఇక పాటకుల గాత్రసౌరభ్యం, సౌలభ్యం గురించి. లలితంగా పాడ ప్రయత్నిస్తే కర్ణాటం అలవాటు చేసుకున్న కంఠాలు సాధారణంగా కర్ణపేయంగాలేక, కఠోరంగా ధ్వనిస్తాయి. ఆ కర్ణాట ప్రతిధ్వని ఈ రెండు కంఠాలలోను, ఈ రెండు పాటలలోను లేదు. ఇరువురు "చక్కని మక్కువల చక్కలిగింతల వేళ" అలవాటుగా, చేనేచాటుగా కలుసుకునే ముగ్ధ హృదయాల స్పందనో యన్నట్లు పాడారు. జమునారాణికంఠంలో యవ్వనంపు జిలుగు. శ్రీనివాస్ గాత్రంలో తొలివలపు వెలుగు. ఈ రికార్డు నంబరు జి. ఇ.

వరుసలోను, మాటలలోను అసలు జానపద గీతాలకు కొంచెం దూరంగా, సినీమార్కు జానపదాలకు దగ్గరగానున్న పాటలు శ్రీరామ్, స్వర్ణలతతో పాడినవి రెండు ఎల్. ఆర్. ఈశ్వరితో పాడినవి రెండు. "వరుగెత్తే పాలగువ్వ", "వయ్యారి చిన్నదాన" మొదటి జంటది. నంబరు జి. ఇ. 37504. రెండు పాటలకు వాద్యానుసరణ తేలికగానేవుంది. మరి యెబ్బెట్టుగా ధ్వనించే వాయిద్యాల నుపయోగించలేదు. రెండవజంట పాడినవి "ఏతాము ఎక్కరా ఓమావ," "జంబైలే జోరు అంగరు బలే రోకలి" అన్నది. రికార్డునంబరు జి. ఇ. 37506. మొదటిది మాటలోనే తెలుస్తున్నట్లు ఏతముపాట (ట). రెండవది దంపుళ్లపాట. ఈ వాక్యానికి చివరకూడ (ట) నిస్సందేహంగా చేర్చుకోవచ్చు. ఇందులో అసంగత విషయాలు రెండు. మగవాడు దంపుళ్లపాట పాడటం. రెండవది ప్రతీదంపుడు పాటలో వున్నట్లు "అస్సో, అస్సో" అని లేకపోవటం. పాటలు వింటానికి బాగానే వున్నాయికాని, నిజంగా ఇవి జానపదుల జ్ఞానపథంలోనివికావి, వుండవలసినవికావి లేవు. పైనాలుగు రాజశ్రీయే వ్రాసినా దిగువ రెండిటిలో వెతికితే అశ్లీలత కనపడవచ్చు. అలా వెతకడం మన తప్పనుకోండి. అది వేరేసంగతి. ఈశ్వరి కంఠంలో పల్లెపడుచుదనపు బిగువు కనపడుతోంది.

చిగురాకులచాటున దోబూచులాడే మావిడిపిందెలా మారాములు కన్నెరికంగాని, పానిపిల్ల కాలిఅందెలా గారాములు సమపాళాన పలికే కంఠం ఎవరిది? బాల సరస్వతిది. (అచ్చు తప్పుగా స్వరశ్రుతి అని పడినా అచ్చంరైట్ అవుతుంది). జానపద సాహిత్యంలో భావ శబలతకూ, శబ్దమృదులతకూ తన కదనమే నందన వనముగా చేసినకవి యెవరు? కొనకళ్ళ వెంకటరత్నం. తమ పాటలలోనేగాక, పాడించిన పాటలలోను, సప్తస్వరాలలోని గుప్తమాధుర్యాన్ని వినిపించినవా రెవరు? శ్రీ ఘంటసాల. పై ముచ్చురి కలయిక ఒకేపాటలో వుంది. అది పాటకాదు. గంధర్వలోకానికి బాట. స్వర, సాహిత్య, స్వరాలు వెల్లి విరిసిన పూదోట ఘంటసాల వరస చేయగా, కొనకళ్ల వ్రాయగా, బాల సరస్వతి తీయగాపాడిన "ముసురేసిందంటే పైన అసలే మతి పోతది మామా" అన్న పాట. ముసురు పట్టిన వేళల్లో మామతలపుతో ఉసూరుమంటూ, పరువంతోమున్న పల్లెపిల్ల పడే తపనంతా మన కళ్లకు గట్టినట్లుంటుంది పాట వింటుంటే. ఒక్కోసారి మమతల మసకలోకానికి మన మతీ పోతది కూడ. ఈ రికార్డు నంబరు ఎన్. 28791. రెండవ ప్రక్క కీర్తిశేషులు తోలేటి వ్రాసిన "ఆంధ్ర మహిళ" పద్యాలనుకుంటాను.

పల్లెపాటలలో మాకు తెలియని మాధుర్య మేదిలే అనుకునే విద్యా(?)వంతులకుకూడ జానపద వాఙ్మయంలో ఆసక్తి, శ్రద్ధ కలిగించటానికి తమ రచనలద్వారా నండూరి, కొనకళ్ల యెంత తోడ్పడ్డారో అదేవిధంగా తమ అనుపమగానంతో సీతా అనసూయలుకూడ జానపదగీతాలందు ఉత్సాహం కలిగించేటందుకు తోడ్పడ్డారు. తమ యంగ్ ఇండియా కంపెనీకి (ఆ రికార్డులు ఇప్పుడు దొరకటం కష్టం) పాడిన పాటలు ఇప్పటికీ వింటానికి విందుగా ఉంటాయి. అందులో కొన్ని: "జాబిల్లి వస్తున్నాడు వెన్నెల్లు తెస్తున్నాడు", "మధూదయంలో మంచి ముహూర్తం మాధవీలతకు పెళ్లి" (భావగీతానికి జానపద వరవడి) గోలకొండోయి" "నువ్వు నేను కలసి పూవులో తావిలా తావిలో మధువులా" ఇందులో 'గోలకొండోయి" అన్నది వీరి అధ్వర్యానే "అగ్గిరాముడు"లో వేరే మాటలు సింగారించుకొని వినపడింది. ఆరేళ్లముందు కొలంబియావారు విడుదల చేసిన "అన్నాడే వస్తనన్నాడే", "మొక్కజొన్నతోటలో" అన్న రికార్డుకూడ ఇప్పుడు కాన్సెలయింది.

ఇప్పుడు అచ్చులోవుండి, ధారాళంగా దొరికేవి
87-వ పేజీ చూడండి

వ్రతభంగం

మధురాంతకం రాజారాం



పట్టుదలకు పర్యాయపదంలాంటిది సాంబయ్యగారి కుటుంబం. ఆ కుటుంబంలోని ప్రతి ఒక్కరూ ఒక్కొక్కరకమైన పట్టుదలను లోకులకు ప్రదర్శించారు. ఈ మితిమీరిన పట్టుదలతో వాళ్లెంత వనికంటే అంతమేకి బరితెగించగలరన్నది లోకులకు కూడా తెలిసినవిషయం.

మొరకమనుషులు అందరూ ముక్కోకట్టే ఒకచోట చేరినట్టు కనిపించే సాంబయ్యగారి కుటుంబంలో కాస్త మెతకమనసు కలిగినవాడు ఒక్క ప్రకాశం మాత్రమే! కానైతే ప్రకాశంగూడా పట్టుదలలో మిగతావాళ్ళకు తీసిపోయేవాడేమీ కాదు.

నలుగురు మగబిడ్డలను ఈలోకంలో దిగవిడిచి భార్య పరలోకం చేరుకున్నతర్వాత సాంబయ్యగారికి మళ్ళీ పెళ్ళిచేసుకోవాలన్న ఉద్దేశం లేకపోయింది. సవతితల్లి పెంపకం పిల్లలకు సరిపడకపోవచ్చునని గాదు. అసలు సాంసారికసుఖాలపట్ల సాంబయ్యగారికి అదినుంచీ ధ్యాస తక్కువ. ఆయన ఆలోచనలెప్పుడూ వ్యాపారరంగంలో గిరికీలు కొడుతుండేవి. తనకు ముసలితనంగానీ, చావుగానీ లేనట్టుగా మానవుడు డబ్బు సంపాదించాలన్నారు పెద్దలు. వెంటనే, మృత్యువువేళ బరబరా ఈడ్చుకుపోతున్నట్టుగా ఆ డబ్బును దానధర్మాలకు వినియోగించాలికూడా అన్నారనుకోండి! అంటే అన్నారులెమ్మనుకుని, ఈ సూక్తితో పూర్వార్థాన్నిమాత్రం కంఠతా పెట్టి, ఒంటబట్టించుకున్నారు సాంబయ్యగారు.

సాంబయ్యగారి కుమారులు నలుగురిలోనూ పెద్దవాడు ప్రకాశం. పువ్వు పుట్టగానే పరిమళమున్నట్టుగా వాడు హైస్కూలుకు వెళ్ళన్నరోజుల్లోనే రాత్రుల్లో పదిపదకొండు గంటలవరకూ చదువుకునేవాడు. పరీక్షల్లో ఎక్కడలేని మార్కులూ వాడికే వచ్చేవి. తరగతిలో ప్రథమముడుగా ఉత్తీర్ణుడౌతూ, వార్షికోత్సవాల్లో బహుమతులన్నీ వాడే దోచేసేవాడు. వీధిలో ఈ చివరినుంచి ఆచివరి వరకూ కాపురమున్న గృహస్థులందరూ ఆవరేజి తెలివితేటలు గలిగిన తమ తమ కుమారులను మందలించడానికి వీలుగా ప్రకాశాన్ని ఒక ఆదర్శంగా ఉదహరించేవారు. ఐతే సాంబయ్యగారుమాత్రం ప్రకాశం తెచ్చుకున్న బహుమతులకన్నింటికీ బజారురేటులో విలువకట్టి "పరవాలేదు! మావాడుగూడా కొంతవరకూ సంపాదనాపరుడౌతున్నాడు" అంటూ సంతోషించేవారు.

ప్రకాశంది అదోరకమైన మనస్తత్వం. పదిమందితో కలిసిమెలిసి తిరగవలసివస్తే వాడి ప్రాణం ఇబ్బందిలోపడిపోయేది. వాడు తన చుట్టూరా ఏర్పరచుకున్న ఒంటరితనాన్ని చీల్చుకుని నేనొక్కణ్ణేమాత్రం కొంత దగ్గరగా పోగలిగే వాణ్ణి. అందుకు ప్రకాశం నాకు సహపాఠకుడు గావడమొకటే కారణంగాదు. మా ఇంటికి నాలుగో ఇల్లే సాంబయ్యగారిది. పైగా, వారికీ మాకూ ఏదో దూరపుబంధుత్వంగూడా కద్దు. పువ్వుతో కలిసిన దారానికిగూడా సుగంధం అబ్బినట్టు ప్రకాశంతో చేరితే నా చదువు బాగుపడవచ్చునని మా నాన్నగారి నమ్మకం. ఆ నమ్మకాన్ని పురస్కరించుకుని సాంబయ్యగారి ఇంట్లో నేను నా ఇష్టమొచ్చిన పద్ధతిలో ప్రొద్దుపుచ్చడానికి అవకాశం చిక్కేది. సాంబయ్యగారు రాత్రి ఏ ఎనిమిది, తొమ్మిది గంటలకో ఇంటికొచ్చేవారు. మేడ మెట్లెక్కబోతూ, గదిలో మేమిద్దరమూ కనిపిస్తే, "ఏం చేస్తున్నార్రా మీరు?" అంటూ పలకరించేవారు. "ఏమీ లేదు బాబాయ్! కలిసి కంబైండ్ స్టడీ చేస్తున్నాము" అని బదులుచెప్పేవాణ్ణి నేను! "మీ చదువేమిటో చెప్పుకోండిగాని పదికి గ్లాసు కాలిపోకుండా ఆ దీపం కాస్త తగ్గించండి" అంటూ సాంబయ్యగారు మెట్లెక్కి మేడమీదికి వెళ్ళిపోయేవారు.

'కంబైండ్ స్టడీ' అనే ఇంగ్లీషుమాటకు సరైన అర్థంవచ్చే తెలుగుమాట యేదోగానీ, మా విద్యార్థుల పరిభాషలో అది పచ్చి బాతాఖానీ తప్పితే మరేమీకాదు. అయ్యవార్లకు ముద్దు పేర్లు పెట్టడం, సినిమాల్లోని హాస్యగాండ్ర వేళాకోళాలు మననంచేసుకోడం ఇత్యాది రసవత్తరవిషయాలను వింటున్నవాడు విన్నట్టేవుండి, చెప్తున్నవాడు చెప్తున్నట్టేవుండి హఠాత్తుగా ప్రకాశం ఒకానొక కావ్యభాగంలోకి జారిపోయేవాడు. ఉన్నట్టుండి, "ఏ సూత్రం ఆధారంగా బ్రహ్మ[illegible] నిర్మించారు?" అనేవాడు. లేదా, "షెల్లీ[illegible] ప్రసిద్ధి?" అని అడిగేవాడు. అడగకపోతే, "[illegible] తోని పెద్ద మహిమాన్విత రుక్మిణిగారి పూవు[illegible] దుడు......" అంటూ ఓ పద్యాన్ని ప్రార[illegible] గణవిభజనచేసి, యతిప్రాసలు గుర్తిం[illegible] పాదమో వ్రాయమనడి అని, నేను గురువేది తెలియక కీకారణ్యంలో దారితప్పినపోడిల[illegible] మిట్టాడుతుండగా, వాడు నా అవస్థను కళ్ళా[illegible] మౌనంగా కూర్చునేవాడు.

దీపం పెట్టినవాళ్ళను చల్లటివేళ తలచు[illegible] అంటారు. నావిషయంలో ప్రకాశం చేసింది [illegible]కంటే తక్కువేమీకాదు. ఒక్కొక్కవ్యక్తి ఒ[illegible]



ప్రత్యేకమైన పని చేయడంకోసం ఈ ప్రపంచం లోకి వచ్చాడేమోననిపిస్తుంది. తినడం, తిరగడం, మాట్లాడడంలాంటి జీవితావసరమైన పనులెన్ని చేస్తున్నా, ఆ వ్యక్తి ఆ ప్రత్యేకమైన పని చేయడానికే పుట్టివుంటాడని చూపరులకు భాసిస్తుంది. పుస్తకాలు చదివి, విజ్ఞానాన్ని సముపార్జించడానికి పుట్టినవాడు ప్రకాశం. పరీక్షలకు కూర్చోడం వాటి

ప్రతభంగం

కొక వినోదక్రీడ. అగ్నిపరీక్షలా ఎదురయ్యే ప్రతి సంవత్సరాంతపు పరీక్షలోనూ కడతేరి, నాపుదప్పి కన్ను లొట్టబోయినట్టుగా జస్టు పాసు మార్కులతో నైనా ఓ సర్టిఫికెట్టు సంపాదించుకోకపోతే బ్రతుకు గడవడం దుర్లభమైన నాబోటివాడికి ప్రకాశం చేసిన సహాయం మరిచిపోదగిందిగాదు. బోడినెత్తికీ, బొటనవ్రేలికి ముడిపెట్టదలచుకున్నవాడికిమల్లే, చాలీ చాలని జీతంరాళ్ళతో సంసారసాగరాన్ని ఈదడానికే ఈ మానవజన్మ లభ్యమైందని భావించినట్టయితే, నన్ను నా జీవితలక్ష్యంవైపు చేయిపట్టుకుని నడిపించాలని వెళ్ళినవాడు ప్రకాశం!

అలాంటి ప్రకాశం స్కూల్‌ఫైనలు పరీక్షలో కృతార్థుడయ్యాడు. ఇక కాలేజికి వెళ్ళడమే తరువాయి. ప్రకాశం ఉన్నతవిద్య నభ్యసించడానికి కొకికమైన అడ్డంకులను ఎవ్వరూ ఊహించలేదు. కానీ ఆశ్చర్యమేమిటంటే, ప్రకాశం కాలేజి మెట్లెక్కలేకపోయాడు. వాడి కింతవరకూ చదివిన చదువే చాలుననీ, పైచదువులకోసం పారాడడం వల్ల డబ్బు కాలం వృధాగావడం మినహాగా మరొక ప్రయోజనం లేదనీ నిక్కచ్చిగా తేల్చి చెప్పేశారు సాంబయ్యగారు.

అందు కాయన ఒక కారణంగూడా చెప్పేరు — మానవుడికి తెలివితేటలే ప్రధానంగానీ, చదువుగాదు. చదివినవాడికంటే చాకలాడు మేలనడం అందుకే మరి! ఆమాటకొస్తే తనేం చదువుకున్నాడు? తనకంటే బియ్యే చదివినవాడు సాధిచేసిం దేముంది! ఏమీ లేదు.

నువ్వు నీకు తగిన ఉద్యోగాన్ని చూచుకోవలసింది—అన్నా రాయన ప్రకాశాన్ని ఉద్దేశించి.

ప్రకాశం తండ్రిపైన తిరుగుబాటుచేస్తాడనీ, అలా తిరగబడవలసిన అవసరం ఉందనిగూడా నేను భావించాను. కానీ అలాంటి దేమీ జరగలేదు. ప్రకాశం తండ్రిమాటమేరకు ఉద్యోగాలకోసం దరఖాస్తులు వేయసాగాడు. అనతికాలంలో ఓ సుమారు పాటి ప్రభుత్వోద్యోగం దొరికిందిగూడా! పెట్టె, పరుపూ సర్దుకుని వెళ్ళొస్తాననిచెప్పి, ప్రకాశం యాభైమైళ్ళదూరంలోవున్న చిన్న పట్టణానికి వెళ్ళిపోయాడు.

ఉద్యోగంకోసం నేనంతదూరం వెళ్ళవలసిన అవసరం లేకపోయింది. మేష్టరీవృత్తితో జీవితంతో రాజీపడదలచుకున్నట్టయితే, మనదేశంలో ఎక్కడివారి కక్కడే ఉద్యోగాలు దొరికే సావకాశా లున్నాయి. అపలింకా టీచర్సు ట్రెయినింగులో వుండగానే నాకు పెళ్ళయింది. ఆహ్వాన పత్రికతోబాటు జాబుగూడా వ్రాశాను. కానీ పెళ్ళికి రాలేకపోయాడు ప్రకాశం. ఇక్కడ నాకు పెళ్ళి జరుగుతున్న ముహూర్తానికి సరిగ్గా వాడు నాగపూర్ యూనివర్సిటీ ప్రాంతంలో ఎక్కడో పరీక్షలకు కూర్చోబోతున్నాడనీ, అందువల్ల పెళ్ళికి రావడం కుదరదనీ, రాకపోయినా వాడి శుభాకాంక్షలు నన్ను వెన్నంటి వుంటాయనీ వ్రాశాడు ప్రకాశం.

తరువాత నాలుగైదు మాసాలకు వాడా పరీక్షలో పొస్సైనాడన్న వర్తమానం గూడా తెలిసింది.

"చూచావా బాబాయ్! నువ్వయితే ప్రకాశాన్ని చదివించనన్నావు. కానీ వాడు తనంతటతానే ఇంటరు పాసయ్యాడు......" అన్నాను.

వేడిపెనంలో నూనె ప్రుళ్ళినట్టుగా సాంబయ్య గారి ముఖంలో పుత్రోత్సాహం తొణికిసలాడింది. "అప్పుడే ఏమైందిరా సత్యం! నువ్వు చూస్తుండు. మావాడలాగే బియ్యేగూడా పాసైపోతాడు" అన్నా రాయన!

తొందరపడి సాంబయ్యగారిని అపార్థం చేసుకున్నందుకు నే నప్పుడెంతో విచారించాను. కుమారుడు పెద్దచదువులు చదువుకోడం ఈయనకు ఆనందకరమే! ఐతే అందుకు తనచేతినుంచి కానీ ఖర్చుకాగూడదన్నదే ఈయనగారి కసీసపు కోరిక!

ఈ తండ్రిగారి గడుసుతనం ఇదొక పర్వతం లాంటిదైతే, ఆ కుమారుడి జీవితం అదొక నదిలా ప్రవహిస్తూ ఎదిరించి ఢీకొనకుండా ఆ పర్వతం ఎలా పిలిస్తే అలా మలుపుతిరుగుతోంది. భగవంతుడు ప్రకాశానికి తెలివితేటలేగాకుండా తన జీవితానికి నిండుతనాన్ని, హుందాతనాన్ని చేకూర్చుకోడానికి కావలసిన నిలకడనుగూడా ప్రసాదించాడు. ఒకవైపున పితృవాక్యాన్ని ఉల్లంఘించకుండా, మరొకవైపున ఆదర్శాన్ని విడనాడకుండా ప్రకాశం ముందుకు సాగిపోతున్నందుకు సాంబయ్యగారికిమల్లే నాకూ ఆనందమే కలిగింది.

సాంబయ్యగారు సిద్ధసంకల్పులు. ఆయన చెప్పినట్టు ప్రకాశం బియ్యేపరీక్ష గూడా యిచ్చి, పట్టా పుచ్చుకోగలిగాడు. కానీ, ఆ పట్టా అంత సులభంగా అతడిచేతికి రాలేదు. అందు కతడు కాలేజిలోచేరి, రెండేళ్ళపాటు చదువుకోవలసి వచ్చింది. రూల్సు ఒప్పవని స్థానిక విశ్వవిద్యాలయం అతణ్ణి కాలేజిలో చేర్చుకోడానికి నిరాకరించింది. వాల్గేళ్ళ ఉద్యోగకాలంలో మిగిలించిన డబ్బును చేత బట్టుకుని, జీతం నష్టంమైన రెండేళ్ళు సెలవు మంజూరుచేయించుకుని, రెండువందల మైళ్ళ దూరం వెళ్ళి అక్కడొక కాలేజిలో చేరాడు ప్రకాశం.

ఉద్యోగి బ్రతుకన్నా, విద్యార్థి జీవితం సుఖప్రదమే! కానీ ఎప్పుడు? కార్డుముక్కకు బదులుగా మనియార్డర్లు దూకినప్పుడు! ఈ వెసులుబాటులేని కళాశాల విద్యార్థి పరిస్థితి చల్లటి వెన్నెలరాత్రిలో ప్రేయసితో సమాగమం లభించక విరహవేదనతో కుమిలిపోయే ప్రేమికుడి పరిస్థితి కంటే మెరుగ్గా ఉండదు. ఉన్నదాంతో సరిపెట్టుకోవాలన్న దృఢనిశ్చయంతో ప్రకాశం అష్టకష్టాలు పడివుంటాడని నా ఊహ! ఆ విషయం అతడి జాబుల మూలంగా చూచాయగా తెలిసివచ్చేది. అతడు చదువుకుంటున్న ప్రాంతంలో వంటచెరకు లభ్యం కాదట! వరిపొట్టుతో వంట చేస్తారట! 'ఈ భోజనాలు, ఈకొకపాకాలు నాకు బొత్తిగా సరిపడటం లేదురా సత్యం! పట్టెడన్నమైనా లోపలికి పోవడం లేదు. ఎక్కడైనా ఓ చిన్న ఇల్లు దొరికితే స్వయంపాకం చేసుకోవా లనుకుంటున్నాను" అంటూ అతడొక ఉత్తరంలో తనబాధ వెళ్ళబోసుకున్నాడు!

'అతి' సర్వత్రా వర్జింపవలెనందంటారు. ఈ తండ్రిగారి ఖచ్చితత్వం సంగతి జగద్విదితమే! పోనీ ఆ కుమారుడ్నైనా నోరుతెరిచి అడిగితే, ఈయన కాస్త మెత్తబడేవాడేమో! ఊహూ. ప్రకాశంలోని పట్టుదల ఆపని చేయనిచ్చిందిగాదు. ఎలాగైతేనేం, కాలానికి కట్టుబడి రెండేళ్ళ అజ్ఞాతవాసం పరిపూర్తిగావించుకుని, తిరిగివచ్చి మళ్ళీ తన ఉద్యోగంలో చేరిపోయాడు ప్రకాశం.

ఓరోజు ఉదయం సాంబయ్యగారిని కదిలించి చూశాను. "చూడు బాబాయ్! బెండకాయగానీ, బ్రహ్మచారిగానీ ముదిరిపోగూడదంటారు. ప్రకాశం నాంకంటే ఒకటి రెండేళ్ళు పెద్దవాడు. పెళ్ళయివుంటే వాడూ ఈపాటికి బిడ్డలతండ్రై ఉండేవాడు. నేనిలా చెబుతున్నందుకు నువ్వు మరొకవిధంగా భావించవద్దు! నీ కర్తవ్యం నీకు తెలియదనిగాదు. కానీ ఒకసారి నీకు జ్ఞప్తికి తేవడం బాగుంటుందనీ, భావ్యమనీ......" అంటూ అర్థోక్తిలో ఆగిపోయాను.

అప్పటికి నేనేదో విడ్డూరపు సంగతి ప్రస్తావించినట్టు అత్యాశ్చర్యంగా నావైపు చూస్తున్నారు

"అవునండీ! నేను సముద్రంలో పడీపడగానే ఒకపెద్ద సొరచేపవచ్చి నాకాలు పట్టేసింది" కోనేటిరావు బామ్మగారితో కోసేస్తున్నాడు.

"పాపం! ఎంతపని జరిగింది! అప్పుడేం చేశావేమిటి?" బామ్మగారికి జాలిముంచుకొచ్చింది.

"ఏంచేస్తాను! అది నా కాలు కాస్తా తినేసింది. దానితో వాదించి లాభంలేదని ఊరుకున్నాను!"

సాంబయ్యగారు. "ఓరి నీ ఇల్లు బంగారంగామా! ఇదేమిట్రా సత్యం! మా ప్రకాశం పెళ్ళికి నువ్వూ, నేనూ ప్రయత్నించడమేమిటి? దిగిరావాలిరా అబ్బాయ్ దిగిరావాలి. కొండమీది కోతైనా క్రిందికి దిగిరావాలి. ఏమనుకుంటున్నావో మరి! పోనీ నువ్వే చెప్పు. దేనిలో లోటు మావాడికి? రూపమా, చదువా, ఉద్యోగమా? ఏదీ కాగడావేసి వెదుకు చూద్దాం. ప్రకాశంలాంటివాడు ప్రకాశం ఒక్కడే! కాన్నైతే ఒక్కసరకు. తేరకు దొరికేదిగా దీ సంబంధం! మంచిమాటలకే రాలిపోయేదిగా దీ మామిడిపండు! టంచనుగా పదివేల గట్టి నాణాలు కుమ్మరించాలి. అంతకొక రాగిపైసా తక్కువైతే, ఆ పప్పులు మన దగ్గర ఉడకవు. వెళ్ళు. కావలిస్తే ఇది నా మాటగా లోకంలో టముకువేయించు......"

నా గుండె గుభేలుమంది: సాంబయ్యగారు కులాంతరమూ, మతాంతరమూ అయిన సంబంధానికి ఒప్పుకుంటే నేను చెప్పలేముగానీ, లేకుంటే ఇంటి భారీపరిమాణంలో కట్నం చెల్లించుకునే శ్రీమంతు లెవ్వరూ మా బంధువర్గంలో లేరు. పోగా, ప్రకాశానికి పిల్లనివ్వబోతున్న పుణ్యాత్ముడెవడోగానీ, ఒక ఆడబిడ్డను కనిపెంచిన నేరానికి అతనికి సాంబయ్యగారు ఇంత పెద్దజుల్మానా విధింపదలచుకోడం న్యాయం కూడా కాదు!

"అయ్యో ప్రకాశం! నీ నుదుట పెళ్ళయ్యే రాత వ్రాశాడో లేదో భగవంతుడు' అనుకుంటూ వేడిగా నిట్టూర్చాను.

ఆరోజు సాయంత్రం ప్రభాకరం నాకోసం వెదుక్కుంటూ మా యింటికి వచ్చాడు.

ప్రభాకరం సాంబయ్యగారి రెండోకుమారుడు. నిష్కర్షగా మాటాడ్డంలోనూ, నిక్కచ్చిగా వ్యవహరించడంలోనూ వీడు తండ్రిగారికన్నా నాలుగాకులు ఎక్కువగా చదివాడు. ప్రకాశానికిమల్లే పెద్దగా స్వప్రయోజకత్వం వెలిగించలేదుగానీ, వీడూ రైల్వేలో ఏదో మంచి ఉద్యోగమే చేస్తున్నాడు. కానీ ఒక విషయంలో ప్రభాకరం ప్రకాశంకంటె మెరుగు. వాడు విశ్వతరబడి స్వగ్రామంవైపు తిరిగిచూడడు. ప్రభాకరం అలాకాకుండా, ఆరునెలలకోసారి నాలుగు రోజుల సెలవులో వచ్చి బంధుమిత్రుల నందరినీ పేరుపేరునా పలకరించి పోతుంటాడు.

"ఉదయం మా నాన్నగారి ప్రసంగాన్ని నేను గూడా విన్నాను" అన్నాడు ప్రభాకరం.

"వినేవుంటావు ప్రభాకరం! బహుశా ఆ ప్రసంగం నీకు శ్రవణానందకరంగానే ఉండివుంటుంది. ఎందుకంటే, ముప్ఫై నలభై యేళ్ళ వ్యాపారానుభవంతో మీ నాన్నగారు వేరుశనగ, చింతపండు, చెరకుబెల్లం లాంటి సరుకులకుమాత్రమే ధర కట్టగలరని మన మందరమూ అనుకున్నాము. ఆయన మనుష్యులకుగూడా వెలకట్టగలరన్నది మనకు కొత్తగా తెలిసిన విషయం! ఆయన లెక్కప్రకారం మీ అన్నగారి కిమ్మత్తు పదివేలు. నువ్వూ ఆ అన్నకు తమ్ముడివేగనుక ఎంత లేదన్నా నీధర గూడా అయిదువేలదాకా పలకొచ్చు. పలకొచ్చునేమిటి, మీ నాన్నగారు పలికిస్తారు......"

ప్రభాకరం ఒక్క విసురుతో నా కడ్డు తగిలాడు: "చాలించవయ్యా సత్యం! రక్తమాంసాలున్న మనిషి అయినా రాయిలా, రప్పలా పడివున్నాడు గనుక ప్రకాశం అన్నయ్యను కావలిస్తే మానాన్న ఏమైనా చేసుకోవచ్చు. కానీ మనసంగతి వేరు......"

"అబ్బో, కూత ఘనంగావుందిరా ప్రభాకరం! ఈ పరిస్థితిలో నువ్వయితే ఏం చేసేవాడివేమిటి?"

"ఏంచేస్తానా! చెప్పిచేయడంతో స్వారస్యమేముంది? నేను చేసేదేమిటో చెప్పకుండానే చేస్తాను..." అన్నాడు ప్రభాకరం.

అన్నంతపనీ చేశాడు ప్రభాకరం. మూడు మాసాల తర్వాత ఒకనాటి శుభోదయాన అతడు తపాలాశాఖవారి సౌజన్యంతో తన వివాహమహోత్సవానికి ఆహ్వాన పత్రికలు పంచిపెట్టేదాకా, అతడు చేయబోతున్న పనేమిటో నాకు తెలిసిందిగాదు.

పత్రికలు కళ్ళబడగానే ఇంటి కొకరిద్దరు చొప్పున సాంబయ్యగారిని పరామర్శించడానికి వెళ్ళారు. కానీ పుణ్యానికిపోగా, పాపం ఎదురైనట్టు "ఎందుకొచ్చారు? వెళ్ళండి. ఇక్కడెవరూ చావలేదు. చచ్చినా రానంత



ప్రతభంగం

దుఃఖంతో తల్లడిల్లిపోవడంలేదు. ఎక్కడో ఎవడో ఏమిటో చేశాడని, అందుకోసం విచారిస్తూ కూచోడం నాపనిగాదు. ఈ క్షణాన్నుంచీ నాకు ముగ్గురే కొడుకు లనుకుంటాను. నా ఆస్తిని మూడంటే మూడే విభాగాలు చేస్తాను. ఈమాట దప్పితే నన్ను పాంబయ్య అని పిలవకండి. చచ్చుదద్దమ్మ అని పిలవండి......" అంటూ పాంబయ్యగారు వెళ్ళిన వాళ్ళపైన విరుచుకపడ్డాడు.

ఈ సంఘటన జరిగిన క్రొత్తలో నేనొకసారి ప్రకాశం ఉద్యోగంచేస్తున్న పట్టణానికి వెళ్ళడం తటస్థించింది. చేస్తున్నది పెద్ద ఉద్యోగమే అయినా, గాలీ వెల్తురూ బాహాటంగా సంచరించడానికి వెసు కాజే ఓ చిన్నగదిలో నివసిస్తున్నాడు ప్రకాశం. ఆగదిలో ఏ వస్తువుగానీ అది ఉండవలసినచోట కనిపించడంలేదు. ఓమూల పుస్తకాలరాశి ప్రోగుపడివుంది. మరోమూల దిన పత్రికలు చిన్న గుట్టలా పడివున్నాయి. అరిగిపోయిన పాదరక్షలు గదిలో ఎక్కడంటే అక్కడ ప్రత్యక్షమౌతున్నాయి. ఇన్నింటికీ మధ్య పరిచినపరుపు పరిచినట్టేవుంది. రోజు కొకసారి ప్రకాశం దాన్ని దులిపివేసుకుంటున్న సూచనలు గూడా లేవు.

"ఇనుపగజ్జెలతల్లికి వరపుత్రుడిలా వున్నావురా బాబూ! ఐనా నీకిదేం గ్రహచారంరా ప్రకాశం?" అంటూ వాపోయాను.

సుఖదుఃఖాలకు అతీతుడైన మహాయోగిలా నవ్వాడు ప్రకాశం. "ఏం చేయమంటావు సత్యం! నే నెన్నుకున్న జీవితపథం అలాంటిది......" అన్నాడు.

"నీ ఆదర్శాలసంగతి నాతో చెప్పొద్దురా ప్రకాశం! త్రాగలేక పాలు బోర్లపోసుకుంటున్నావని చెబితే నే నొప్పుకుంటాను. కాకపోతే ఇదేమిటి? కదలీమెదలకుండా చిన్నగుంటలో నిలిచిన మురికినీటిలా స్తబ్దమైపోయిన నీ బ్రతుకును చూస్తుంటే నాకు ఏడుపొస్తోంది. ఇప్పుడు జరుగుతున్న క్షణం. మరుక్షణానికి మనదిగాదు. 'ఒకటి కాలే దొకటి' పోలేదుగానీ, నీ కప్పుడే ముప్పైయేళ్ళు గడచిపోయాయి. బయట వెన్నెలకాస్తుండగా, చీకటికొట్టులో కూర్చుని కాలహరణం చేసినవాడికి, మళ్ళీ వాడు రమ్మన్నప్పుడు వెన్నెల రాదు. ప్రభాకరం నీకంటే చిన్నవాడు. వాడిని చూచైనా నువ్వు బుద్ధితెచ్చుకోవలసింది. నువ్వు మీ నాన్నగారిమాట లేందే పెళ్ళిచేసుకోవు. ఆయన పెద్దమూట చేతికి రాందే నువ్వు పీటలపైన కూర్చోడానికి ఒప్పుకోడు. ఆయనకు పిచ్చి కుదరదు. నీకు పెళ్ళికాదు....."

"ఎందుకూ! మా నాన్నగారికి పిచ్చికుదరడంతో బాటు నాకు పెళ్ళి గూడా కావడానికి మధ్యేమార్గం ఒకటుందిరా సత్యం......" అన్నాడు ప్రకాశం.

"ఏమిటది?" వింటూ అడిగాను.

"మా ట వ రు స కు పదివేలంటున్నారుగానీ, మా నాన్నగారు అయిదువేలకు ఒప్పుకోగలరని నా నమ్మకం."

"ఐతేమాత్రం! కన్నుపొడుచుకోడానికి ఏవేలైతేనేం ప్రకాశం! ఐదువేలుమాత్రం కట్నం గాకపోతుం దేమిటి?"

"అబ్బే, చెబుతుంటే పూర్తిగా వినిపించుకోవుగా నువ్వు. మళ్ళీ ఇందులోనూ ఓ కిటుకుంది. ఇప్పుడు నా నెలసరిజీతం రెండువందల రూపాయలు. అందులో నా ఖర్చులకు యాభై, అరవై రూపాయలు పోనూ మిగిలినడబ్బు బ్యాంకులో వేస్తున్నాను. రెండుమూడేళ్ళలో ఆ బ్యాంకు అకౌంటు అయిదువేలదాకా ప్రాకొచ్చు......"

నేను నిర్ఘాంతపోయినమాట వాస్తవం. తండ్రి అభిమతానికీ, తన జీవితానికీ మధ్య కత్తివాదరలాంటి ఆదర్శంపైన నడుస్తున్న ప్రకాశాన్ని మందలించినందుకు నేను కించపడ్డానుగూడా! జీవితంలో చెప్పుకోదగిన సత్కార్యం ఒక్కటైనా చేసి ఎరుగని నేను ఆత్మవిశ్వాసంతో, ఆత్మనిగ్రహంతో జీవితాన్ని అదొకవ్రతంలా గడుపుతున్న ప్రకాశాన్ని సరిదిద్దబూనడం హాస్యాస్పదం!

ఆరోజురాత్రి హోటల్లో భోజనంచేసి సినిమాకు వెళ్ళి తిరిగొచ్చేసరికి ఒంటిగంట దాటింది. ఆతరువాతైనా నిద్రపట్టిందిగాదు. ప్రకాశం తన ఆఫీసుగొడవలేవో చెప్పుకపోతున్నాడు. అతడెంత ఉత్సాహంగా చెబుతున్నా నాకు నాటినట్లు ఆసక్తి జనించడంలేదు. కానీ, అంతలో నల్లటి మబ్బుల్లో ఒక మెరుపు తళుక్కుమన్నట్టు విస్తారమైన ఆఫీసు విషయాలమధ్య ఓ అమ్మాయిని గురించిన ప్రసక్తి వచ్చింది.

"టైపిస్టుగా పనిచేస్తోందిరా సత్యం! పేరు నీరజ. రెండేళ్ళయింది ఉద్యోగంలో చేరి. పది గంటలకు సరిగ్గా ఆఫీసు కొస్తుంది. కుర్చీలో కూర్చుంటే తనేమో, తన పనేమో అటూ ఇటూ చూడదు. నవ్వు పలకరించడమే బ్రహ్మాండం. పెద్దవాళ్ళతో మాట్లాడవలసివచ్చినప్పుడు ఎంత వినయంగా మాట్లాడుతుందని......"

మావాడి పొగడ్త శృతిమీరిపోతున్నందుకు నాకు నవ్వొచ్చింది. "మంచిదేరా ప్రకాశం! కానీ ఆ వినయం కాస్త. అతివినయం కాకుండా ఉండాలి....." అన్నాను.

ప్రకాశం తటాలున నాపైన చేయివేసి, "దయచేసి, ఆమెనుగురించి తేలికగా మాటాడొద్దుతా సత్యం!" అన్నాడు.

ఆ హెచ్చరిక తాకిడికి నా గుండె కాసేపు పని చేయడం మానేసింది.

యథాలాపంగా ఓ మాట అనేశానుగానీ, నీడలా ఆమెను వెనకేసుకొస్తాడని నాకేం తెలుసు! ప్రకాశం లాంటివాడు ఆమెపైన ఈగ వ్రాలడానికైనా ఒప్పుకోడంలేదంటే, అందుకొక కారణం ఉండితీరాలి. ఇది ప్రేమజబ్బుతాలూకు ప్రాథమిక లక్షణమేగావచ్చు. అమ్మో ఈ పెళ్ళి ఆపాలు త్రాగుతుందా అనుకున్నాను. మానవసహజమైన ధూర్తబుద్ధి ఎక్కడికి పోతుంది?

ప్రకాశం పైకిలేచి లైట్ వేశాడు. పెట్టె తెరిచి అందులోని పుస్తకంలోనుంచి ఓ ఫోటో పైకి తీస్తూ, "ఈవిడే నీరజ" అన్నాడు.

సన్నగా పొడుగ్గా సాదాగావుంది నీరజ! చెప్పుకోదగ్గ ప్రత్యేకాకర్షణ ఏదీ ఆమెలో కనిపించడం లేదు. కానీ, ఆమె అందంగాలేదని చెప్పడానికిమాత్రం వీల్లేదు. ప్రేమ గ్రుడ్డిదనుకొ ఆ వున్న కొద్దిపాటి

అందాం ప్రకాశంకళ్ళకు త్రిగుణీకృతంగా కని పించిందేమో నాకు తెలియదు.

ప్రకాశం చెబుతున్నాడు. "నీరజకు తల్లిదండ్రు లున్నారు. పెళ్ళికావలసిన అక్కయ్యవుంది. ఆ ముగ్గురి జీవికకూ నీరజ సంపాదనే ఆధారం. ఆ అక్కగారికి గూడా ఏదో అయినసంబంధం వుందం టున్నారు. బహుశా ఈ సంవత్సరమో, కాక పై సంవత్సరమో ఆమెకు పెళ్ళి జరిగిపోవచ్చు......"

ఆపాటికి ప్రకాశం తండ్రిగారికోసం అయిదువేల రూపాయల నిధిని సేకరించడంగూడా పూర్తి గావచ్చు. దేవుడి దయవల్ల అనుకోని అవాంతరాలేవీ తటస్థించకపోతే, అంతటితో ప్రకాశం నీరజను చేపట్టి ఒకయింటివాడు కావచ్చు. చదువుకోడానికి వేసుకున్నట్టే ప్రకాశం పెళ్ళిచేసుకోడానికి గూడా వేసుకున్న ఈ పంచవర్ష ప్రణాళికకు విజయం చేకూరాలని నే నాక్షణాన హృదయపూర్వకంగా కాంక్షించాను.

* * *

హఠాత్తుగా పిలుపువచ్చింది ప్రకాశం దగ్గరి నుంచి! "తక్షణం బయల్దేరి రావలెను. ఇలా నేను రమ్మని కబురుపెట్టినవార్త మా నాన్నగారికి తెలియనివ్వొద్దు. వివరాలు నేరులో" అంటూ ముక్తసరిగా మూడువాక్యాలు వ్రాసి పోస్టుచేశాడు ప్రకాశం.

స్కూలుకు సెలవుపెట్టి ఆరోజు మధ్యాహ్నం రైలుకే బయలుదేరాను.

రైలు దిగేసరికి ప్లాట్‌ఫారంపైన్నే ఎదు రయ్యాడు ప్రకాశం. చిరునవ్వుతో స్వాగతమిచ్చాడు. ఇద్దరమూ దగ్గర్లోవున్న పార్కులోకి వెళ్ళి కూర్చు న్నాము. ఒక్కింతసేపు కుశలప్రశ్నలు గుప్పించిన తర్వాత ప్రకాశం అసలువిషయంలోకి వస్తూ, "సంగతేమిటో చెప్పమంటావా సత్యం! వెయ్యి మాటలతో వినుగెత్తించడమెందుకు! ఒక్కమాటలో చెప్పాలంటే, నేను ప్రతభ్రష్టుడినైపోయాను...." అన్నాడు.

"అదేమిటి ప్రకాశం! ఏం జరిగింది?" తెల్ల బోతూ ప్రశ్నించాను.

"నీరజకు అక్కయ్యవుందని చెప్పానుగదూ! ఆమెను మేనత్తకుమారుడి కివ్వడమన్న నిర్ణయం ఏనాడో జరిగింది. కానీ తీరా సమయం వచ్చేసరికి వాళ్ళుగూడా కట్నంపైన మోజుపడ్డారు. కోరిన కట్నం ఇచ్చుకోకపోతే ఆమెకు ఆపెళ్ళి తప్పిపోయే ట్టే తోచింది. అప్పుగానేననుకో—బ్యాంకులోవున్న డబ్బును తీసి నీరజతండ్రికి ఇచ్చుకోవలసి వచ్చింది"

"ఐతే నీ పెళ్ళి మళ్ళీ కాలనిర్ణయం లేకుండా వాయిదాపడిపోయిందన్నమాట......" నేను హఠా త్తుడినైపోయాను.

"పడిపోయేదే! కానీ 'ఒక్కొక్కప్పుడు' పిరికి వాడుగూడా మహాధైర్యశాలి కావడంకద్దు. నా విషయంలోనూ అంతే జరిగింది. నే నాదినుంచీ వరకట్నాలను వ్యతిరేకించాను. అందువల్ల స్వప్ర యోజనంకోసం ఒకానొక వరుడికి కట్నం ఇచ్చు కోడంతో తోప్పడిన బలహీనత నా అంతరాత్మను బాధిస్తోంది. ఇది నా మొదటి ఓటమి. రెండో ఓటమి మా నాన్నగారిమాటకు కట్టుబడి వుండలేక పోవడం. ఉందామన్నా నాలో ఓపిక నశించిపోయింది. చివరకు ఒకటి రెండు జీవితాల్లోకి వసంతాన్ని తేగలిగానన్న సంతృప్తి ఒక్కటిమాత్రం దక్కింది నాకు! ఈ సంతృప్తిని ఆమృగాభావించి జీవితం పద్మలో నా ఆదర్శాల నన్నింటినీ ఖర్చుగా రాసే స్తున్నాను. అందుకనే నిన్నూ, ప్రభాకరాన్ని రమ్మని జాబులు వ్రాశాను. రే పీపాటికి నాకూ, నీరజకూ పెళ్ళి జరిగిపోతుంది—రిజిస్ట్రారు సమక్షంలో!"

నువ్వు చేసింది తప్పో, ఒప్పో నాకు తెలియదు ప్రకాశం! కానీ నీకు భగవంతుడు మేలు చేస్తాడు...... ఈ మాటలు నేను బయటికి చెప్పలేదు. మనసులో అనుకున్నాను.

* * *

ఈసారి సాంబయ్యగారు తమ వివాదాన్ని కొద్దిగా సవరించుకుని, "నా కిద్దరుకొడుకులే ననుకుంటాను పో"మ్మన్నారు. అంతటితో ఊరుకున్నారుగారు. తన ఆస్తిని రెండంటే రెండువిభాగాలు చేయ బోతున్నాననీ, ఆ విభాగాల్లో ఒకభాగం చంద్రా నికీ, మరోకభాగం రామానికీ ఇవ్వడం జరుగు తుందనీ, ఆమాటగనుక తప్పితే, తననందరూ ఉద్ధ వాజమ్మ అని పిలవవలసిందని గూడా చెప్పారు.

నా మట్టుకు నాకు ఒకటే సందేహం: సాంబయ్య గారు ఆ ఇద్దరు కుమారులకైనా సకాలంలో పెళ్ళిచేయగలరన్న నమ్మకమేమీ లేదు. ఈ లెక్కన ఆయన ఒకనాటికి ఆ ఇద్దరు కొడుకుల్నిగూడా తమ జాబితాలోనుంచి తొలగించే ప్రమాదం ఉంది. అప్పు డిక ఈయన తన ఆస్తినంతా ఏంచేసి వెళ్తారు? రోమన్‌సామ్రాజ్య నిర్మాత జూలియస్ సీజరు బిడ్డలు లేకుండా చనిపోతూ, తన ఆస్తి పాస్తుల్ని రోమునగర పౌరులకందరికీ పంచిపెట్ట మన్నాడని చెబుతారు. సరిగ్గా అదేవిధంగా సాంబయ్య గారు తమ ఆస్తిని బుద్ధిగా తల్లి దండ్రుల మాట విని పిల్లనిచ్చే మామగారిదగ్గరినుంచి నిర్దాక్షిణ్యంగా కట్నాలు వసూలుచేసుకునే పెళ్ళికొడుకులకు తలా ఒక రూపాయ చొప్పున పంచిపెట్టవలసిందని విల్లు వ్రాసి, ఆ తరువాత నిశ్చింతగా కళ్ళు మూస్తా రేమో! చేసినా, అంతపని చేయగలిగినవారే సాంబయ్య గారు! ★

సరాగమాల

31–వ పేజీ తరువాయి.

హెచ్. ఎం. వి. కంపెనీకి వీరు ఇటీవల పాడిన నాలుగు పాటలు మాత్రమే. అవి, "ఎయ్‌రా ఏస్తైరి గెడ"తో జానపదపాట. దేవులపల్లి కృష్ణశాస్త్రి రచన. అలంకారాన్వేషకులుగా శాస్త్రిగారు తరచిన తోటల అందాన్ని పల్లెపదజాలంలో మలచిన పాట యిది. ఈ పాట మధ్యన వినవచ్చేవంత "అది తొయ్య, అది జెల్ల, అది బొచ్చె ఆడ వలయేయురా"లో యెంత పల్లెతనం ప్రతిబింబిస్తుందో "నాలుకళ్ళదానికైతే నాలుగు నిచ్చెయ్యరా, సోగకళ్ళదానికైతే సందువ లిచ్చెయ్యరా" అన్న చరణాల్లో అంత అమాయిక గ్రామీణశృంగారం గోచరిస్తుంది. ఈ రికార్డు రెండవప్రక్క యిప్పటికీ శ్రీకాకుళం, పరిసర జిల్లా లలో పాడుకలోనున్న "సోమి సోమన్నలాల సోమన్న లాలో చందమామ" అనే కోతలపాట. ఈ రికార్డు నంబరు ఎన్. 96171.

"కోటిరత్నము" పాడటంలో వరసలో కొన్ని శాస్త్రీయపోకడలు వున్నాయి. దీనికి రెండవ ప్రక్కనున్న "నందగిరి బంగారుమామ చంద్రగిరి నీరలంపేవా" తేలిక వరసగలది. రెండూ వినదగ్గవి కొనదగ్గవి. నంబరు ఎన్. 96187

గుప్తస్వరం

దొంగరాముడులో జిక్కి పాడిన "రావోయి మా యింటికి" కూడ పల్లెపదమే. అందులో ఆర్. నాగేశ్వరరావుద్వారా వినిపించే అతనిదే అనిపించే మగగొంతుక ఎవరిదో తెలుసా? మద్దాలి కృష్ణ మూర్తిది. ఇతనికి "తోడుదొంగలు", "జయభేరి" చిత్రాలలో చిన్న వేషాలుకూడ వున్నవి! ★

రచయితలకు విజ్ఞప్తి

రచయితలు తమ రచన లతోను, రేఖా చిత్రముల తోను, తగినన్ని తపాలా బిళ్ళలు అంటించి, చిరునామా వ్రాసిన కవర్లు జత చేసి పంప గోరుతాము. అట్లా పంపితేనే నిరాకరించిన రచనలను మరి కొంత త్వరగా త్రిప్పి పంపటం సాధ్యమవుతుంది.

హాయవాత్తా అమృతగాథ

25వ పేజీ తరువాయి

వెన్నెల వెలుగులు నాలుగు మూలలా [illegible] ఆ జవ్వని అందానికి ఆకాశంలో దేవతలే పాలరాతి ప్రతిమలయినారు! పిల్లగాలి తుమ్మెద రెక్కల్లాంటి ముంగురులతో దోబూచులాడి మైమరుపుతో మరి కదలలేక మెదలలేక అక్కడే మేనువాల్చింది.

నోకోమిస్ అది గమనించింది. ఒకనాడు ఎంతో ఆప్యాయంగా కుమార్తెను కౌగలించుకొని ముంగురులు, ముత్యాలహారాలు సరిచేసి మెల్లిగా చెవిలో చెప్పింది:

"నా బంగారు తల్లీ! వెనోనా! దీపదీపాలవేళ ఒంటరిగా ఎక్కడికీ వెళ్ళకమ్మా! పచ్చిక బయళ్ళలో లేడి పిల్లల వెంటపడి పరిగెత్తకమ్మా! పడమటిగాలి [illegible] ఒక తుంటరి ఉన్నాడు. వాడు తెల్లతెల్లవారేసరికి ద్రాక్షలగుత్తులన్నీ కోసి చిందరవందరగా అటు ఇటు విసిరి వేసి కొండగుహలో కూర్చుని దారమ్మటపోయే వయ్యారి గొల్లపడుచులకేసి సన్నసన్నగా ఈలలు వేస్తూంటాడు. చెట్లకొమ్మల్లో దాక్కొని గుసగుసలాడుతూంటాడు! ఎన్నయినా వింతకథలు మొదలుపెడతాడు! వాడిమాటగాని కొంచెం చెవికెక్కనిచ్చావా! ఆ మాయల మారివలలో పడిపోయావన్నమాటే! సంజవేళ కొలనులోదిగి కలవపూలు కోసేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలి సుమా! పచ్చిక మైదానంలో గాని కొంచెం మేను వాల్చావా! వాడు వెనకాలే వచ్చి చిత్రమయిన కథ ఏదో మొదలుపెడతాడు! వాడి మాటలు పికిలిపిట్టల పిలుపుల్లా మహా సొగసుగా ఉంటాయి సుమా! జాగ్రత్త!"

వెనోనా తల్లిసలహా వినీవిననట్టు మౌనంగా ఊరుకుంది. అప్పుడే కోసిన కలవపూవు రేకు [illegible] మింది. 'ఏం వినబడడం లేదుటే నా మాటలు!' అంది తల్లి. 'విన్నానమ్మా! పొద్దస్తమానము ఆ మేడలో పడిగాపులుపడి కూర్చోలేనమ్మా!' అని విసుక్కుంది. 'పొద్దస్తమానము మేడలో కూర్చోమన్నానుటే! చీకటి వేళ ఒంటరిగా కలవపూలకోసం వెళ్ళవద్దన్నానుగాని!' అంది తల్లి.

'సరేలే! అలాగే.' అని అక్కడినించి కదిలి ఏటిఒడ్డుకు తిన్నగా చెంగుచెంగున పరుగులుపెట్టింది వెనోనా! సన్నని సుడిగాలితో కలిసి గిరగిరా తిరిగింది. ఏటి నీటిలో నవ్వుతున్న చుక్కలకేసి చూసి వెక్కిరించింది. 'మా అమ్మ ఎప్పుడూ ఇంతే! నన్నొక్క నిమిషమయినా హాయిగా ఆడుకోనివ్వదు!' అని మూతిముడుచుకుంది. కెరటాలలో తేలిపోతున్న హంసలతో కలిసి ఊగులాడింది. తల్లి ఎన్నిసారులు గొంతెత్తి పిలిచినా మారు పలకక నాచుతీగల గుబురులలో గుసగుసమని [illegible] మాయమయింది.

నోకోమిస్ ఉసూరుమని నిట్టూర్చి 'పట్టి ఆకతాయిపిల్ల!' అని లోలోపల గొణుక్కుంది. అంతేగాని వెనోనాను మరి పల్లెత్తుమాట అనలేకపోయింది. ఆమె లేక లేక కలిగిన సంతానం! అదైన చిన్నప్పటినించి ఎంతో అల్లారుముద్దుగా పెరిగింది. అందుచేత మరి ఏమీ అనలేక నెమ్మది నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ మాటిమాటికి వెనక్కి తిరిగి చూస్తూ తిరిగి మేడలోకి వెళ్ళిపోయింది.

ఇంకా ఉంది

చిట్టిపాప విందు

అటపర్తి వెంకటసుబ్బారావు

చిట్టిపాప తా
చేస్తుంది విందు!
వివరం అంతా
వినిపింతు వినుండు!!

పుట్టబెడ్డతే
మైసూరుపాకం!
గులాబిరేకుల
జిలేబి ముక్కలు!!

కలకండ రొట్టె
కొంబ్యాంది!
కాగిన పిట్టె
గరమ గరమ టీ!!

తాటి కాయలే
తముల పాకులూ!
పూత గింజలే
ఇంపగు వక్కలు!!

ఇవి అన్నీ మీ
కిష్టం అయితే;
రావచ్చును మీ
రంతా విందుకు!!

టార్జాన్ ప్రణయం

23-వ పేజీ తరువాయి

కాని, ఏం లాభం ? తను ఆ, చిన్నమ్మాయిని ప్రేమించాడు. ఆ అమ్మాయికి కళ్లు నీళ్లు తెప్పించడం తనవల్ల కాదు.

వాళ్లన్న మాటలకి మూర్తికి ఉక్రోషం వచ్చినా, అందులో నిజం కొంత లేకపోలేదు. తనకి అందం లేదు. పెద్ద తెలివి తేటలు కూడా లేవు. లేకపోతే ఇరవై రెండేళ్లకి బి. ఏ లోనే కూచోడ మేమిటి ? ... అంటూంటారు, వాళ్ల నాన్నగారు, ఇక ఉన్నదల్లా, కండలు తిరిగిన శరీరం.

రెండు రోజులు ఆ అమ్మాయిల వేళాకోళాలు మౌనంగా భరించాడు. వారి గురించి కొద్దిగా వివరాలు సేకరించాడు. ఆ యిద్దరు అమ్మాయిల పేర్లూ విజయా, సూజాతా. పెద్దమ్మాయి వయస్సు ఇరవై, పెళ్లి కూడా అయిపోయింది. రెండవ అమ్మాయి మెట్రిక్‌కు కడుతోంది. ఇద్దరూ తెగ పత్రికలూ, పుస్తకాలూ చదువుతారు. పాటలు బాగా పాడతారు. అంతేకాకుండా వారీ ఊరు వచ్చి కొద్దిరోజు లైందో లేదో వారింటికి నలుగురైదుగురు స్నేహితురాళ్లు రావడం, ఏవో పాటలు పాడడం, పుస్తకాల గురించి కబుర్లు చెప్పడం గమనించాడు మూర్తి. ముఖ్యంగా నిర్మలా దేవి, వారింటికి రావడం మూర్తికి ఆశ్చర్యం వేసింది. నిర్మలాదేవి గొప్పగాయకురాలని మూర్తికి తెలుసు. ఆమె రేడియోలో ప్రోగ్రాము లిస్తుంది. అటువంటి సుప్రసిద్ధ వ్యక్తులు వాళ్లింటికి వస్తుంటే వాళ్లకి తనలాంటి వాళ్లమీద ఏం గౌరవ ముంటుంది ? అని ఆలోచించాడు మూర్తి. తనూ ఆటల్లో గొప్పవాడే. 'టెస్ట్ మాచెస్' లో ఎప్పుడైనా పాల్గొనే అవకాశం లభిస్తుంది. కాని... అంతవరకు ? .... అంతవరకు, అనామధేయుడే.

అలా, అద్దంలో చూసుకుంటూ ఆలోచిస్తూ ఉండగానే మూర్తి కొక మెరుపులాంటి వూహ తట్టింది. 'తను కవిత్వం రాస్తేనో' .... ! షేక్స్పియరుగారికి బహుశా అద్దం చూసుకుంటున్న సమయంలోనే, 'హేమ్లెట్' రాయాలనే వూహ తోచిందేమో ! అందువల్ల అతనా పుస్తకం రాయడం, మూర్తి బి. ఏ. లో ఆ పుస్తకాన్ని, (అంటే పుస్తకం కాదనుకోండి, దాని నోట్సుని— ఎందుకంటే ఈ రోజుల్లో టెక్స్ట్ పుస్తకాలు చదవడం ఫాషను కాదని మూర్తికి బాగా తెలుసు!) చదవడం జరిగింది. అద్దంచూసుకుంటున్నప్పుడు పుట్టే ఊహలు చాలా గొప్పవి. ఒక్కొక్కప్పుడు తెల్లవార్లూ నిద్ర లేనప్పుడు, అద్దం చూసుకుంటే దెయ్యాల కథలూ, హేమ్లెట్ లాటి పుస్తకాలూ జ్ఞాపకం వస్తాయి. అప్పుడు రచయితలు మళ్లీ కొన్ని కొత్తకథల్ని, డిటెక్టివ్ సాహిత్యాన్ని సృష్టించచ్చు. అలాటి విలువైన తలంపులలోకి చేరిందే, మూర్తి యొక్క కవిత్వా తలంపు. ఆ ఒక్క ఆలోచనే కాదు. వరుసగా మరికొన్ని ఆలోచనలు కూడా మూర్తికి వచ్చాయి. ఎలా రాయడం? దేనిగురించి వ్రాయడం? అసలు కవిత్వమంటేనేమిటో తనకు తెలియదే!—(అంటే "అక్కరకురాని చుట్టము ...." వగైరా, వచ్చుననుకోండి!) అయినా సరే, ఎలాగో రాయాలి. రాసి వరండా మీద పచార్లు చేస్తూ చదవాలి. అప్పుడు ఆ అమ్మాయి, "అబ్బ ! ఎంత బావున్నాయండీ మీ పద్యాలు !" అని ......

"ఒరేయ్ ! ఏ లోకంలో ఉన్నావురా ? అద్దం ముందు కూచొని, ఏమిట్రా వెర్రి వెర్రి చూపులు ? ఎంత పిలిచినా పలుకవేం ?" అని వీపు తట్టిన, రామం కేకలతో మళ్లీ మామూలు ప్రపంచంలో పడ్డాడు, మూర్తి.

రామాన్ని చూడగానే, మూర్తికి మరొక అయిడియా తట్టింది. 'ఒరేయ్ ! నేను కవిత్వం రాయాలి. ! రాసి తీరాలి !" - అన్నాడు.

"శాంతించు, బ్రదర్ ! శాంతించు ! నన్ను గుర్తుపట్టే ఉంటావు. నీ బాల్య స్నేహితుణ్ని ! కంగారు పడక విషయ మేమిటో చెప్పు !"

"ఈ హోటల్లో భోజనం ఎప్పుడూ ఒకే మాదిరిగా వుంటుంది." అప్పుడే హోటలునుంచి బయటికివస్తున్న పరంధామయ్య గారు అన్నారు.

"మరే ! ముక్కుపురుగు కూడా మారటం లేదు" అని తడుముకోకుండా సమాధానమిచ్చాడు గోలేశ్వరావు.

శివకామయ్య (చీపురుపల్లి)

"నాకు మతిపోలేదు. నువ్వు కంగారు పడక్కరలేదు."

"లేకపోతే నీకు కవిత్వ మేమిట్రా ? ఎవ్రడా చెప్పాడు నీకీ పాడు సలహా ? నయం. ఇంకా మొదలెట్టావు కాదు., నిన్ను వాల్తేరు దాకా మొయ్యలేక మేము వచ్చి ఉందుం."

మూర్తి దిగులుగా మొహం పెట్టేశాడు. "రామం ! నేను ప్రేమించానురా ! ఆ ప్రేమను వ్యక్తం చెయ్యడానికి కవిత్వం రాయాలిరా ! నువ్వు నన్ను అపార్థం చేసుకుంటే ఎలారా ?"

"అదా, చిట్టి తండ్రీ ! అలా, అసలు విషయం చెప్పు. సరే, అయితే, నీ కవిత్వానికి మార్గమేదో వెతుకుదాం, ముందు హోటల్ ప్రకాశ్‌కు పద" అన్నాడు రామం. బరువైన హృదయంతో మూర్తి లేచాడు. ఇద్దరూ బయల్దేరారు.

ఇడ్లీ సాంబారు అధ్యాయం లోంచి కాఫీ పారాయణ చేసేలోపల, అసలు విషయమంతా మూర్తి రామానికి చెప్పి, "నీ ఎరికలో ఎవరైనా పెద్ద కవి ఉంటే చెప్పరా. కొద్దిగా 'టిప్స్' నేర్చుకుంటాను. అతనివద్ద" అన్నాడు.

రామం కొద్దిగా ఆలోచించాడు. "చూడూ ఈమధ్య డి. సరయూరాణి అని ఒక పేరుతో పత్రికలలో కొన్ని కథలూ, పద్యాలూ పడుతున్నాయి చూశావూ ? ఆ సరయూ రాణిది మన వూరే, తెలుసా ?"

"ఆడవాళ్ల పరిచయం మన కెందుకురా ? ఎవరైనా మగవాళ్లని చూడు. వాళ్లతో స్నేహం చెయ్యడానికి వీలుంటుంది."

"సరయూరాణి అంటే స్త్రీ అనుకున్నావేమిటి ?"

"కాదా ? చంపేశావ్ ! ఆ కథలూ, ఆ వర్ణనా చూసి కేవలం స్త్రీయే అనుకున్నాను. మగవాడే నేమిట్రా ?"

"నేనూ నీలాగే అనుకున్నాను మొదట్లో. అసలు సరయూ రాణి కథల్లో దాంపత్య ప్రణయం, స్త్రీయై వర్ణించడం, అత్యంత ఉన్నత స్థాయికి వెళ్లింది. ఆ భావాలూ, ఆ మాటలూ వాటిలోని లాలిత్యం, మాధుర్యం, స్త్రీ హృదయంలోంచి, కలం లోంచి తన్నుకొచ్చాయనుకున్నాను. కాని అది అతని 'పెన్‌నేమ్.'

"హా ! హతవిధీ ! అతని అసలు పేరేమిటిరా ?"

"డి. సూరన్న పంతులు."

"ఓక్ !" అని గొంతుకలో ఏదో అడ్డం పడినదాన్ని సర్దుకున్నట్టు అభినయించాడు మూర్తి. రామం ఏమిటని ? అడిగాడు. మూర్తి, "అబ్బే, ఏం లేదురా. ఆ రచనలు చదువుతూంటే ఓ అందమైన ఇరవైయేళ్ల అమ్మాయి, సన్నని నడుమూ, చిలిపి చూపులూ, కొంటె వాలకంతో కన్పిస్తూంటుంది కళ్లముందర. కాని ...."

"నాకూ సరిగ్గా అలాగే అనిపించిందిరా. అసలు కీర్తి గడించినవా రెవరైనా అంతే అనుకో. వాళ్ల రచనలూ, పాటలూ, రేడియోలో విని వాళ్లెంతో అందంగా ఉంటా రనుకుంటాం. అంతెందుకు, "శతభిషం" గారని ఒకాయన గొప్ప కావ్యాలు రాశాడు. ఆయన రచనలు చదివి, చాలా అందంగా ఉంటాడనుకొన్నాం. ఒకసారి ఆయన ఫోటో గూడా పడింది. అది చూసి కొంత నిరుత్సాహం చెందా ననుకో. కాని అతనికి మన ఊరులో సన్మానం జరిగినప్పుడు చూశాను. బాపూ కార్టూన్‌లో పెళ్లికొడుకులా ఉన్నాడు. నా ఆశా భంగాన్ని ఆపుకోలేక ఆయన దగ్గరకు వెళ్లి 'మీ ఫోటో చూసి మీరు కొంచెమైనా బావుంటా రనుకున్నానండీ' అనేశాను. దానికి ఆయన నవ్వుతూ 'ఆ ఫోటోగ్రాఫరు నాకు చాలా అన్యాయం చేశాడు.' అన్నారు. అలాగే ఉంటుందిరా ఎప్పుడూ. మనం చూడవలసింది. హృదయ సౌందర్యం కాని భౌతిక రూపం కాదు" అని రామం చెప్తుంటే మూర్తి దృష్టి హోటల్ ప్రకాశ్‌లో అలంకరణార్థం ఉంచబడ్డ అద్దంవైపు మళ్లింది.

ప్రతివిషయానికీ రెండువైపు లుంటాయి. ఒకవైపు చెడ్డ ఉంటే, మరొకవైపు మంచి ఉంటుంది. అద్దంలో మూర్తికి కన్పించింది 'టార్జన్' రూపం. అయితేనేం—అది కేవలం

తెలుగు పత్రికలన్నిటిలోనూ ఆంధ్రసచిత్ర వారపత్రిక సర్క్యులేషన్ అత్యధికమైనది.



భౌతిక రూపం సూత్రమే! అది చూసి పక్కింటి అమ్మాయిలు వెక్కిరించవచ్చు!— కాని ఆ రూపంలో ఉన్న హృదయ సౌందర్యమో ?—అది వాళ్ళు గ్రహించినవాడు .... ? తనని సుజాత తప్పక ప్రేమించి తీరుతుంది. కాని హృదయ సౌందర్యం వెలికి రావాలి—అంటే కవిత్వం రాయాలి— అప్పుడు ఆ సుజాత, అది చదవాలి !

"ఒరేయ్, మరి ఆ—సరయూరాణిని—అంటే సూరన్న పంతుల్ని ఎప్పుడు పరిచయం చేస్తావు ?"

"ఇవాళ సాయంకాలమే. అతను నాగావళి బ్రిడ్జి దగ్గర నిలబడి, తన కవిత్వానికి ఆవేశం తెచ్చుకుంటూంటాడు. ఆ సమయంలో వెళ్దాం" అని రామం లేచాడు. బిల్లు మూర్తి చెల్లించాడు. అది మూర్తికి మామూలే. స్నేహితులందరి కాఫీ హోటలు ఖర్చులూ, అతనే భరిస్తాడు.

సాయంకాలం నాగావళి బ్రిడ్జి దగ్గర, ఎర్రగా సన్నగా పొట్టిగా, రేగిన జుట్టుతో, మాసిపోయిన పంటూ చొక్కాలతో, పాతికేళ్ల వయసులో ఉన్న ఒక వ్యక్తికి, రామం, మూర్తిని పరిచయం చేశాడు.

"ఈయనే సరయూ రాణి పేరుతో రాసే సూరన్న పంతులుగారు."

"నమస్తే !" "నమస్తే !"

మూర్తికి, ఆ రూపం చూడగానే అదేదో జోక్ జ్ఞాపకం వచ్చింది. (అందులో ఒక పెద్ద మనిషి, ఒక కుర్రాణ్ణి చూసి "నువ్వు శుభ్రంగా మొహం కడుక్కొని, కాళ్ళూ, చేతులూ, మట్టి లేకుండా కడుక్కొని వస్తే పావలా బహుమతి ఇస్తాను" అంటాడు. ఆ కుర్రాడు అలాగే శుభ్రంగా కడుక్కొని వచ్చి, ఆ పెద్దమనిషి పావలా ఇయ్యబోతే "మీరే ఉంచుకోండిసార్. అది మీరు క్షవరం చేయించుకుని, గడ్డం గీసుకొని వస్తే, నే నిచ్చే ప్రజెంటు" అంటాడు. మొట్ట మొదటిసారి ఆ పెద్దమనిషి, ఆ కుర్రాడూ కలుసుకున్నప్పటి దృశ్యం స్ఫురిస్తోంది. సూరన్న పంతుల్ని చూస్తే. అయితేనేం ?—హృదయ సౌందర్యం జ్ఞాపకం తెచ్చుకోడానికి ప్రయత్నించాడు మూర్తి.)

"మీ రచనలు చాలా బావుంటాయి. ముఖ్యంగా —మీ—'కైవల్య' అన్న కథలో, ఆ—స్త్రీ యొక్క భావాలు వర్ణించారు చూశారా—ఆహా!— ఏమి బాగా వర్ణించారండీ !"

సూరన్న పంతులు చిరునవ్వు నవ్వాడు. "అది ఒక హాలీవుడ్ సినిమా స్టారు జీవిత చరిత్ర లోంచి గ్రహించాను. దాన్ని మన వాతావరణానికి అనుగుణంగా మార్చేశాను."

మూర్తికి సూరన్న పంతులు జీనియస్ అనిపించింది. ఎక్కడి హాలీవుడ్—ఎక్కడి శ్రీకాకుళం— ఎక్కడి కైవల్యం ? అద్భుతం! అనుకున్నాడు.

తరువాత ముగ్గురూ హోటల్‌కు వెళ్ళారు. సూరన్న పంతులు కవిత్వం ఎంత బాగా రాయగలడో, టిఫిన్ కూడా అంత బాగా తినగలడు. మూర్తి సంతోషంతో బిల్లు చెల్లించాడు. సూరన్న పంతులి దగ్గర కవిత్వం గురించి కొన్ని మాటలు విన్నాక, రాత్రి మెల్లిగా రామం, మూర్తి, సూర్య

టార్జాన్ ప్రణయం

కాలనీలో ఉన్న మూర్తి గదికి వెళ్ళారు. సూరన్న పంతులు చాలా గొప్ప కవి. అని అనుకున్నారు. రామం దాన్ని బలపరుస్తూ, "ఒరేయ్ ! రచయితలు, తమకు జీవితంలో ఏది లభించలేదో దానిని గురించి చాలా బాగా రాస్తారు. ఉదాహరణకి సూరన్న పంతుల్ని చూడు. అతను ప్లీడరు గుమాస్తాగా నెలకి అరవై రూపాయలు గడిస్తూ, చాలా దారిద్ర్యంతో బాధపడుతున్నాడు. అందుకని, ధనిక సమాజాన్ని, కార్లూ, బంగళాలూ, వజ్రాల హారాలూ మొదలైన వాటిని తెగ వర్ణిస్తాడు. అసలా ఆ 'థీరి' వలననే—ఈ తను సరయూ రాణి అవునా ? కాదా ? అన్న సందేహం అప్పుడప్పుడు కలిగినా—అతనే సరయూరాణి అనే నిర్ణయానికి వచ్చాను." అన్నాడు. మూర్తి కూడా ఆ సంగతి ఒప్పుకున్నాడు.

"ఇతడు నిజంగానే నీపళ్ళు రాలగొట్టాడంటావా?" జడ్జి ఫిర్యాదిని నిగ్గతీసి అడిగాడు.

"నిజమేనండీ! వాడు పట్టి దొంగవెధవ. కదులుతున్న పళ్ళు అలాగే ఉంచి శుభ్రంగా ఉన్న పళ్ళు కాసినీ రాలగొట్టేశాడు" అతడు మొరపెట్టుకున్నాడు.

ఒక వారం రోజులు సూరన్నపంతుల్ని ప్రొద్దున్నా, సాయంకాలం హోటల్‌లో కలుస్తూ గులాబీజాం, మైసూర్‌పాకుల్ని ఆరగిస్తూ అతను బోధించే కవిత్వ సూత్రాలను అర్థం చేసుకున్నాడు మూర్తి. ఈ వారంలోనూ పాతిక రూపాయలదాకా, సూరన్న పంతులు, మూర్తి వద్ద చేబదులు కూడా వాడాడు.

ఆరోజు ఆదివారం. సుజాత ఒకర్తే కూచొని తన గదిలో—ఇంద్రధనస్సు—పత్రిక చదువుతోంది. వరండాలో పచార్లు చేస్తున్న మూర్తి, విజయ లేకపోవడం, సుజాత, ఒకర్తే కూచొని చదువుకోవడం చూసి, మూర్తి ఆమెను పలకరించడానికి నిశ్చయించాడు.

"ఏమండీ !" అని పిలిచాడు. సుజాత అతనిని చూసి లేచి నుల్చుంది. "రండి. నాన్నగారింట్లో లేరు. ఒక అర గంటలో వస్తారు. అలా కూచోండి" అంది మర్యాదగా.

మూర్తి తను వచ్చింది నాన్నగారి కోసం కాదనీ, పత్రిక కోసమనీ చెప్పాడు. సుజాత ఏం పత్రిక ? అని అడిగింది. ఇంద్ర ధనుస్సు, అను పత్రిక కావాలనీ అందులో, సరయూరాణి అన్న తన స్నేహితుడు కొన్ని పద్యాలు రాస్తాడనీ చెప్పాడు.

"ఏమిటి ? సరయూరాణా ? మీ స్నేహితుడా ?" అని ఉలిక్కిపడింది సుజాత.

"అవును. ఆ పేరు చూసి స్త్రీ అనుకొని ఉంటారు, మీరు. కాని అతని 'పెన్ నేమ్' అది. అసలు పేరు సూరన్న పంతులు."

సుజాత తెల్లబోయింది. మూర్తి ఆమె నామాత్రం ఆశ్చర్యపర్చగలిగినందుకు చాలా సంతోషించాడు. లేకపోతే తన గురించి, ఏమి టనుకుందో ?

"అసలు నా స్నేహితులు చాలామంది కవులున్నారు. సరయూరాణి నా బెస్టు ఫ్రెండ్" అని చెప్పి, ఎఫెక్టు కోసం "రామం అని ఇంకో ఫ్రెండున్నాడు. అతనూ రాస్తూంటాడు. మరి.... ఇంకా .... ఇంకా .... శరభిషం గారని—ఆయనా నాకు తెలుసు. ఇలా బోలెడు కవులున్నారు. వాళ్ళందరూ నన్ను చూడందే ఒక్క నిముషం ఉండలేరు. నేను ప్రక్కని కూచోపోతే వాళ్ళు కాఫీయే త్రాగరు." అని చాలా ముఖ్య విషయాలు చెప్పేశాడు మూర్తి.

సుజాత మొహంలో ఒక చిరునవ్వు ఉదయించి అణగారి పోయింది. "మీకు కవిత్వం అంటే చాలా యిష్టం. అనుకుంటాను. మిమ్మల్ని చూసి ...."

"టార్జాన్‌లా ఉన్నా ననుకున్నారు—"

"సారీ ! క్షమించండి !"

"ఫరవాలేదు. కానీ, కవులలో మీరు చూడవలసింది భౌతిక రూపం కాదు. వారి హృదయ సౌందర్యం చూడాలి."

"నిజం చెప్పారు."

"అవును. చాలామంది, గొప్ప కళాకారులు, కావాలని భౌతిక రూపం, వికారంగా చేసుకుంటారు. అంటే జుత్తు పెంచేసుకుని, బట్టలు మాపేసుకుని, గడ్డం పెంచుకొని, అసహ్యంగా తయారవుతారు. అప్పటికిగాని హృదయసౌందర్యం బయటికి రాదు."

"అలాగా ? నాకు తెలియదు."

"సరయూరాణిని చూస్తే మీ రాశ్చర్యపోతారు. అతను ఎంత అసహ్యంగా ఉంటాడో వూహించలేరు."

సరయూరాణి పేరెత్తినప్పుడల్లా, సుజాత తన మొహం ప్రక్కకి తిప్పేసుకోవడం మూర్తి గమనించాడు. దాన్నే వోర్వలేనితనం అంటారని తెలుసుకున్నాడు, రామం ద్వారా, తరువాత.

"అంతేకాక మరొక విషయం. రచయితలు తమకు ఏది, అనుభవంలో ఉండదో, దాని గురించే రాస్తూ ఉంటారు."

"అంటే ?"

"అంటే, చూడండి, కైవల్య—అన్న కథలో సరయూరాణి—ఆ ధనిక సమాజం గురించి ఎలా వర్ణించాడో, కారూ, బంగళా, విలువైన నగలూ—వాటి గురించి, దానికి కారణం, అతను అరవై రూపాయలు తెచ్చుకొనే గుమాస్తా అవడమే. అదే అతను ఒక గజిటెడ్ ఆఫీసరయితే తప్పక రాయలేడు."

టార్జాన్ ప్రణయం

"అబ్బా! మీకు చాలా విషయాలు తెలుసునే. అయితే మీరూ కవిత్వం రాస్తారా ?"

"ప్రయత్నం చేస్తున్నాను." అన్నాడు. ఇంతలో ఇంజనీరుగారు రావటం, ఇతర విషయాలు మాట్లాడటంతో కవిత్వ ప్రసక్తి ముగిసింది. కాని, తరువాత, సుజాతకీ, మూర్తికీ మాట్లాడుకోవడానికి చాలా అవకాశాలు లభించాయి. విజయ, అత్తవారి ఊరైన బెజవాడ వెళ్ళడంవల్ల, మూర్తికి సుజాత స్నేహం లభించింది. పత్రికలూ, పుస్తకాలూ, రెండు రోజుల్లో అటునుంచి యిటూ, ఇటునుంచి అటూ మారడం మొదలెట్టాయి.

మూడోరోజు ప్రొద్దున్న, సుజాత, మూర్తి గదివద్దకు వచ్చి, "తొమ్మిగి గంటలకు, బెజవాడలో రేడియో కవిసమ్మేళన ఉంది. అది వినండి. నేను కూడా వింటాను. తరువాత నేను నాన్నగారితో శ్రీకూర్మం వెళ్తాను. సాయంకాలం మాట్లాడుకుందాం, ఈ కవిసమ్మేళన గురించి" అని చెప్పి వెళ్ళింది.

మూర్తికి సుజాత అలా చెప్పి వెళ్ళడం, ఆమెకు తనమీద ఉన్న అభిమానమే అన్పించింది. తనొక కవినని అప్పుడే ఆమె చాలా గౌరవిస్తోంది. పైగా తనకూ పెద్ద కవులంతా చాలా ముఖ్య స్నేహితులాయె. ఇంక ఆమె తనను గురించి గొప్పగా భావించడంలో సందేహ మేముంది ? ఆ భావమే ప్రేమగా మారచ్చు .... అబ్బ! సుజాతే గనక తనని ప్రేమిస్తే .... ?

గడియారం టంగున తొమ్మిది కొట్టింది. వెంటనే రేడియో వేశాడు. "ఆల్ ఇండియా రేడియో విజయవాడ కేంద్రం నుంచి ప్రసారిత మవుతున్న కవి సమ్మేళనం వింటారు. ఇందు పాల్గొనువారు, శ్రీ శతభిషంగారూ, శ్రీమతి డి. సరయూరాణి ...." అంటూంటే రేడియోలోంచి వచ్చే ఆ మాటలకు మూర్తి విశ్చేష్టు డయ్యాడు. శ్రీమతి సరయూరాణి .... ఇదేమిటి ? తను వినడం పొరపాటు కాదుకదా ? మళ్లీ శ్రద్ధగా విన నారంభించాడు. ముందర, శతభిషంగారు తమ రచనల్ని చదివారు. తరువాత శ్రీమతి సరయూరాణి, ఒక గేయాన్ని చదువ నారంభించింది. స్వచ్ఛమైన ఆడగొంతుక. పైగా చాలా ఆవేశంతో చదువుతోంది. అంతేకాక తరువాత ఆమె—తను రచించిన ఒక భావగీతం పాడింది. అది తను మునుపు విన్నట్లు కూడా మూర్తికి తోచింది. అదవగానే మళ్లీ, అనౌన్సరు "ఇంత వరకూ మీరు శ్రీమతి డి. సరయూరాణిగారి కవిత్వం విన్నారు. తరువాత శ్రీ...." అని చెప్పడం కూడా విన్నాడు. మూర్తి, అచేతనుడై పోయాడు. ఎంత మోసం ? సూరన్న పంతులు ఎంత దగా చేశాడు ! అలా ఆలోచిస్తూ, యాంత్రికంగా కిటికీలోంచి చూశాడు. సుజాత తలిదండ్రులతో కారెక్కుతోంది. ఆమె తనవైపుచూసి కొంటెగా నవ్వటం గమనించాడు. కారుకదిలిపోయింది. రేడియో ఆపేసి మూర్తి బయల్దేరాడు.

నాగావళి బ్రిడ్జి దగ్గర, ఇన్స్పెరేషన్‌కోసం షికారు చేస్తున్న సూరన్నపంతులు, మూర్తి ఒక్క ఉదుటులో వచ్చి తన చొక్కా కాలరు పట్టుకొని, "ఒరేయ్! నువ్వు వేషా లేస్తావుట్రా నాదగ్గర ?" అనడంచూసి తబ్బిబ్బైపోయాడు.

"అబ్బెబ్బే ! లేదు .... లేదు !" అని సూరన్నపంతులు అంటూంటే మూర్తి వాడిని రెండు లెంపకాయలు కొట్టాడు. "నేనే సరయూరాణినని దగా చేస్తావుట్రా ? పద! నా రూముకు పద ! నీ సంగ తేమిటో కనుక్కుంటాను." అన్నాడు మూర్తి, తమ చుట్టూ జనం చేరడం గమనించి. దిక్కుమొహం వేసి సూరన్నపంతులు మూర్తి వెనకాల నడవడం మొదలెట్టాడు.

మూర్తి రూములో సూరన్నపంతులు తనది తప్పైపోయింది క్షమించమని, మూర్తి రెండు కాళ్ళూ పట్టుకొని ఏడ్చేశాడు. తను కూడా కొద్దిగా కవిత్వం రాస్తాననీ, అందువలన, ఎవరితోటో పొరపాటున తనే సరయూరాణినని అన్నాననీ, ఆ అబద్ధాన్ని నిలబెట్టుకోవడానికి ఇలా నటించానని అన్నాడు. అంతే దీనత్వానికి దిగిన సూరన్నపంతుల్నేమీ చెయ్యలేక పొమ్మన్నాడు మూర్తి.

సాయంకాలం చీకటి పడినా, లైటు వెయ్యకుండా తనగదిలో ఆలోచిస్తూ కూచున్న మూర్తికి, బయట, కారాగడం, అందులోంచి సుజాతా, తల్లీ దిగి ఇంట్లో కెళ్ళడం, మళ్లీ కారు ఎక్కడికో వెళ్లిపోవడం కన్పించింది.

కొద్దినిముషాలు పోయాక "అరె! చీకట్లో కూచున్నారేం ?" అంటూ సుజాత తన గదిలోకి వచ్చి స్విచ్చి వెయ్యడం చూశాడు. ఆమెతో మాట్లాడడానికి కూడా అతనికి ధైర్యంలేదు. సరయూరాణిగురించి తన మాటలు అబద్ధం అయిపోవడం, కవిత్వంగురించి తన ఊహలు తప్పయిపోవడంవల్ల, ఆమె తన హృదయసౌందర్యం గుర్తిస్తుం దనుకోవడం వట్టి తెలివితక్కువ. ఎక్కడినుంచో నూతులోంచి మాట్లాడినట్లు, "మిస్ సుజాతా మీరు నన్ను క్షమించాలి. నా ఫ్రెండు నన్ను మోసంచేశాడు. అందువల్ల నేను మీతో అబద్ధమాడుతున్నట్లు తెలియక అబద్ధ మాడాను. సూరన్నపంతులు సరయూరాణి కాదు" అన్నాడు.

"ఓ ! దానికేంలెండి. ఆ సంగతి నాకు ముందే తెలుసు. పాపం మీకు కవిత్వమంటే ఉండే యిష్టంవల్ల మోసపోయారు."

ఆమె సానుభూతి మూర్తికి చాలా బలం ఇచ్చింది.

"అసలు నేను కవిత్వం నేర్చుకుందా మనుకున్నాను."

"ఎందుకు మీరు హఠాత్తుగా కవిత్వం నేర్చుకోవా లనుకున్నారు ?" అని అడిగింది సుజాత.

ఆ లైటు వెల్తురులో ఆమె అపురూప సౌందర్యం, మరింత ప్రకాశవంతంగా కన్పించింది మూర్తికి. అతనిహృదయంలో ప్రేమ, నాగావళికి వరదలొచ్చి పొంగినట్లు, పొంగింది.

"నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను. నా ప్రేమ వెలిబుచ్చడానికే, కవిత్వం నేర్చుకుందా మనుకున్నాను. మీరు లేకపోతే నాకు ఈ జీవితమే వద్దు. మిస్ సుజాతా నేను వట్టి టార్జాన్‌లాంటి వాడినని మీ రనుకోవచ్చు ...."

"లేదు. నేనూ మిమ్మల్ని ప్రేమిస్తున్నాను" అంది సుజాత.

"ఆఁ !" అని తను కూర్చొన్న కుర్చీలోంచి లేచి ఆమె వద్దకు వెళ్లి, ఆమె సిగ్గుతో వంచిన తలను పైకెత్తి "నిజమేనా ! అయితే—మా నాన్నకు ఉత్తరం రాస్తాను" అన్నాడు.

"మానాన్నగారు అప్పుడే రాసేశారు" అని వెళ్లిపోబోయింది సుజాత. మూర్తి ఆమెను వెనక్కి పిల్చాడు, చిన్న మాట మాటాడాలని. "ఏమిటది ?" అంది, సుజాత. మూర్తికి ఏం మాట్లాడాలో తోచలేదు. గబుక్కున ఒకప్రశ్న జ్ఞాపక మొచ్చింది. అది ఇందాకటినుంచి అతని మనస్సులో మెదుల్తోంది. సిగ్గుతో, పారిపోదామని ప్రయత్నిస్తున్న సుజాతను ఆపాలని ఉందతనికి ప్రేమగురించి మాట్లాడితే తిరిగి జవాబివ్వకపోవచ్చు. అందుకని మూర్తి "సరయూరాణి, సూరన్నపంతులు కాదని ముందేమీ కెలా తెలుసు ?" అని అడిగాడు.

సుజాత నవ్వుతూ "మా అక్కే సరయూరాణి ! మేము ఆమెను సరదాకి 'విజయ' అంటాం కాని, ఆమె అసలు పేరు సరయూరాణి. ఆపేరు నచ్చక మాబావగారు విజయ అని పెట్టుకున్నారు" అని వెళ్లిపోయింది.

శంకరంగా రావ్యెయంగా పిల్చినదానికి సూర్యం వెంటనే జవాబు చెప్పలేదు. నాలిక తడిచేసుకుని చెబుదామనుకొనేటంతలోనే క్యాషియర్ మంగపతి "మరేనయ్యా! వెళ్ళండి...పాపం! ఆవిడకి అందరూ ఆడపిల్లలే అవటంవింది మగపిల్లలంటే పుత్ర వాత్సల్యం" అంటూ పళ్ళు బయటపెట్టి నవ్వేడు.

"మరోసారి వస్తానండి! గుడ్‌నైట్" శంకరంగారికి సమాధానం చెప్పి సూర్యం ఆయన మలుపుతిరిగే దాకా నిలబడ్డాడు. ఆయన సందులోకి తిరిగిపోయిన తర్వాత మంగపతికి ఓ సిగరెట్ ఇచ్చి తానొకటి ముట్టించుకున్నాడు సూర్యం.

"హమ్మయ్య! వదిలాడు ఘటం....ప్రాణాలు ఉగ్గబట్టుకునేసరికి నరకం అయిందనుకోండి." అని ఖరీదైన సిగరెట్ అవడం గమనించి మరింత ఉషారుగా దమ్ములాగేడు మంగపతి.

"ఆమాట ముందే చెబితే ఆయనెదుటే నే ఇద్దును సిగరెట్ .... ఆయన ఏమీ అనుకోరు తెలుసా?" నవ్వుతూ సూర్యం మంగపతికేసి జాలిగా చూశాడు.

మంగపతి మరింత జాలిగాచూసి ముసిముసిగా నవ్వేడు. "పాపం! ఇంకా సమాజంలో అడుగు పెట్టని కుర్రాళ్ళు మీరు ...ఉండేలుదెబ్బలు మీకేం తెలుస్తాయి...ఆయనెదుట సిగరెట్ కాలిస్తే యూడవడూ....అదీగాక ఆయన బీడీలు తాగుతాడు కూడానూ...." అన్నాడు.

"పోనీగాని...అసలు సమాజమో! అంటారు కదా? మీరంతా .... ఏది నాకు కనిపించదేం?". సూర్యం నవ్వుతూ అడిగేడు.

"ఓహో! అప్పుడే ఎలా తెలుస్తుందండీ...ఇంకా కాలేజీ గేటుకి పదిగజాల దూరంగా రాలేదు మీరు." అలాగే అంటూవుండండి మీకే తెలుస్తుంది దాని మజా...." అంటూనే మంగపతి మలుపుతిరిగి తన మీదకు దాపోతున్న సైకిల్‌ని తప్పుకుని, "మీ సిగరెట్‌కి థాంక్స్...వస్తా" నంటూ వెళ్ళిపోయాడు.

సూర్యం మంగపతినిచూసి ఓ 'విరక్త'నవ్వు నవ్వి "అతనికి ఇతగాడుకూడా సమాజం గురించి చెప్పే నాన్న జెరిగింటేటివాడే?" అనుకున్నాడు.

* * *

వసారలోనుంచి సూర్యం ఇంట్లోకి వెళ్ళిపోతూవున్నప్పుడు తన గదితలుపు తాళంతీసుకుంటూ నిర్మల అగుపించింది. సూర్యం ఆమెకేసి ఓసారి చూడకుండా ఉండలేకపోయాడు కాని తక్షణం చూపుల్ని మరల్చుకున్నాడు.

నిర్మల 'నమస్కారమండీ'. అన్నది ఆమె కంఠంలో ఒణుకూ జీరా ఉన్నాయి. అది కొత్తచేత ఆమెకు కలిగిన బిడియమూ సంకోచమూను.

ఐతే అవిధంగా తనామె పలకరిస్తుందని ఊహించనందున సూర్యం ముందుకి వెళ్ళిపోతూ "అరెరె! నన్నే కాబోలు"నని నాలిక్కరుచుకున్నాడు. నిర్మలకూడా ఆయన గమనించలేదేమో అనుకుని గదిలోకి వెళ్ళిపోయింది. అదే సమయంలో ఆ యింట్లోని మూడోవాటాదారు ముకుందరావు బయటికివెళుతూ "నమస్కారమండీ!" అని పలకరించి "మీకేం? బ్రహ్మచారులు ... అదృష్టవంతులు" అంటూ అదోలా నవ్వుతూ వెళ్ళిపోయాడు.

విడీ విడని చిక్కులు

16వ పేజీ తరువాయి

సూర్యానికి ముకుందరావుమీద ఆక్షణంలో కోప మొచ్చింది, ఒళ్ళుమండింది. ఎందుకో తెలీదు.

సూర్యం ఇంట్లో అడుగుపెడుతూవుండగా అంతవరకూ సరసమ్మగారితో మాటాడుతూవున్న సీతారామమ్మగారు తక్కున ఊరుకున్నది.

సరసమ్మగారు మాత్రం "లేదమ్మా! ఇంకా నేను ఫలానా అని అనుకోలేదే వాడికింకా యెన్నేళ్ళేమిటి? ముక్కుపచ్చలారని, బిడ్డ" అంటున్నది. అంతలో మనుమణ్ణి చూసి,

"ఇదిగో వెయ్యేళ్ళాయుష్షు! మాటలో వచ్చాడు బంగారుతండ్రి.... బాబూ! ఈవిడేరా, సీతారామమ్మగారు...మీ తాతయ్యకి వేలువిడిచినచెల్లెలు.... నిన్నెప్పుడో చిన్నవాడు చూసింది .... చూదామని ఇదవుతున్నది...." అని పరిచయం చేసింది.

"అలాగ' అని సూర్యం కొంచెం సిగ్గుతో

విలేఖరి: "ప్రొఫెసర్ గారు చేస్తున్న పరిశోధన ఏమిటో చెబుతారా?"

ప్రొఫెసర్ భార్య: "కళ్ళజోడు వెతుక్కోవటం!"

ఎ. స్నేహలత (మద్రాసు)

గదిలోకి వెళ్ళిపోయేడు. కిటికీలోనుంచి పెరట్లోకే, చూస్తూ దుస్తులు మార్చుకున్నాడు.

పెరట్లో నూతిదగ్గర నిర్మల నీళ్ళు తోడుకుంటున్నది. "ఎవరో ఏమిటో ఈవిడ? పెళ్ళైందో లేదో .... కొంపతీసి బాల్యవితంతువు కాదుగదా?" అని తనకు తెలియని కుతూహలంతో తలపోశాడు సూర్యం.

అంతలో అక్కడికి బియ్యంకడగడానికి బుట్ట పట్టుకుని రాజ్యలక్ష్మి వచ్చింది. ఓణీ నడుం చుట్టూరా తీసుకుని పైకి దోపుకున్నది. లంగా కుచ్చిళ్ళుచేసి బొడ్డుదగ్గర దోపుకుని నూతిలోకి చాద చెకచెకా ఒదిలింది.

నిర్మలందుకోనబోయి "ఎందుకు రాజా! నే చేదుతానుగాని నువ్వు బియ్యంపెనుకు" మన్నది.

"వద్దు..వద్దు .... పిన్ని తంపేస్తుందక్కా". భయంతో వారించింది రాజ్యలక్ష్మి.

"సరేగాని మాయింటికోసారి రారాదూ! దిగాలు పడి చేదను రాజ్యలక్ష్మికే వదిలేస్తూ అడిగింది నిర్మల "కాస్సేపు మాటాడుకుందాం... మరీ ఒంటరి బ్రతుకయ్యింది" అని.

నిర్మలమొహంలోని దైన్యమూ, ఆప్యాయతా రాజ్యలక్ష్మి కవగాహనలయి, "తప్పకుండా వస్తానక్కా ఒకవేళ సూర్యంబావ సాయంకాలం ఇంట్లో లేక పోతే అమ్మమ్మగారి డాబామీదనే మనం ఇంచక్కా కబుర్లు చెప్పుకుందాం...." అన్నది

"నీకు వాళ్ళ డాబామీద ఎవరేని మక్కువకదూ" బుగ్గమీద చిటికవేసి బిందెత్తుకుని వెళ్ళిపోయింది నిర్మల. రాజ్యలక్ష్మి కూనిరాగాలు తీస్తూ బియ్యం కడగడంలో నిమగ్నమైంది.

సూర్యానికి వాళ్ళమాటలన్నీ వినరాలేదు గాని ఏదో కొంత అర్థం అయింది.

అవతల్నించి సరసమ్మగారు "ఒరేవ్! సూర్యం" అంటూ కేకేసింది. వెళ్ళి కాఫీ అందుకున్నాడు.

"అదేమిట్రా! డ్యూటీకి వేళైపోయినట్టు ఆదరాబాదరా అలాతాగేస్తున్నావ్" మనవడి అనవసరమైన తొందరపాటు కామె విస్తుపోయింది. సూర్యానిక్కూడా తన ఉద్వేగానికి తనకే నవ్వొచ్చింది.

"నీకు సమ్మంధాలొస్తున్నాయిరా అబ్బీ!" సరసమ్మగారి వికసితవదనంలో గర్వరేఖకూడా పొడచూపింది.

"ఎన్ని వచ్చేయేమిటి? సమ్మంధాలు? ఆడపిల్లలా? మగపిల్లలా?"

"ఓరి నీ హాస్యం బంగారంగానూ .... ఈ సీతారామమ్మ నిన్ను చూస్తానని వచ్చిందంటే యెందుకనుకున్నావ్?"

వెంటనే సూర్యం "బాబోయ్! బామ్మోయ్!... ఆవిణ్ణిమాత్రం నామెడక్కట్టకు నీకాళ్ళట్టుకుంటా...." అంటూ నవ్వుతూ ముందుకి ఒంగి ఆవిడ కాళ్ళు పట్టుకోడం అభినయించేడు.

"ఛీ! అవతలికి పో! వెర్రివాగుడూ" అని ఆవిడకూడా తెరలుతెరలుగా నవ్వింది. మళ్ళీ చెప్పింది "అదికాదురా అబ్బీ! దీని ఎరికను ఓ సమ్మంధం వున్నదిట. పిల్లది ఇంటర్మీడియేట్ చదివిందట. వయస్సు కాస్త ఎక్కువేనని తోస్తున్నది. ఏమైనా ఇరవై లోపుట... పోతే నీ ఉద్యోగంచూసి కట్నాలు కానుకలు మాట్లాడ్తారట!" ఈసడింపుగా మూతి విరిచింది ఆమె

"అది సరేగాని బామ్మా! ఇన్నాళ్ళైంది ... మనయింట అద్దెలకు దిగినవాళ్ళతప్ప మనముట్నాల వెరుగముకదా.. వీళ్ళంతా యెక్కణ్ణుంచి వస్తున్నారు?"

సూర్యం ఈప్రశ్న ప్రతివదికగా యేవో బరువైన ప్రశ్నలే అడగాలని చూస్తున్నట్టు ఆమె గ్రహించింది ఆమె తప్పుకుందికి ప్రయత్నం చేసింది

"పోన్లెగాని, ఈ నీ ఉద్యోగం ఇంతేనా? ఇంకా పెరిగే సూచనలున్నాయా?" అనడిగింది.

"ఏమో పోనిద్దూ! అవకాశం దొరికిందికదాని ఇందులో చేరేనేగాని ఇది లాభంలేదు బామ్మా...." సూర్యం చప్పరించేడు.

"అవితే! గవర్నమెంటు కాదన్నమాట!"

"సరి! సరి! గవర్నమెంటు వుద్యోగాలు 'బామ్మ'లు మాత్రం వున్న సూర్యాలకి దొరకవమ్మా!"

"ఆఁ. ..నువ్వుమాత్రం ఏం తక్కువతిన్నావ్? బియ్యే చదివాయివారి ...పైగా బోలెడు తెలివితేటలు మీ తాతయ్య తర్వాత అంతవాడివి.... మావంశంలో నువ్వేనురా అబ్బాయ్!...." సరసమ్మగారు సూర్యానికి

వీడీ వీడని చిక్కులు

అతగాడి బుద్ధిబలాన్ని జ్ఞాపకంచేస్తున్నట్లు మొహం పెట్టింది.

"పోనీలే భామ్మా! మరికొన్ని పరీక్షలు కట్టి స్తాపై గవర్నమెంటు ఉద్యోగం సంపాయిస్తాగాని.. ఈలోగా సినిమాకి వెళ్ళిరానా?" అంటూ సూర్యం రివ్వున పలలపడ్డాడు.

"సరిపోయింది ..... ఇన్నేళ్ళు వచ్చాయి ఇంకా పరీక్ష లేమిట్రా మీతాతయ్య పద్నాలుగోపేట బడిలో మరి చదువు లేదనిపించేశారు...." ఆమె మనుమడు పోయినదిక్కే దీనంగా చూసింది. ఈలోగా నిర్మలా, రాజ్యలక్ష్మీవచ్చి ఆమెవెనుకగా ఎడంగా, నించున్నవైనం ఆమె గమనించనే లేదు.

5

నరసమ్మగారు వెనుదిరిగి ఆ ఇద్దర్నీ చూసిన చూపులకు నిర్మల మనిషి కుంచించుకుపోయింది. రాజ్యలక్ష్మి బెదిరిపోయింది. నిర్మల చేతులు దోసిలిపట్టి ఉన్నాయి. అందులో పచ్చని తామరాకులో తెల్లని నందివర్ధనంపూలు, ఎర్రని గులాబీలూ చల్లనికాంతులు ప్రసరిస్తూ చూపుల కాపోట దాన్ని ఇస్తున్నాయి. నరసమ్మగారి దృష్టిమీదా, మనస్సుమీదా కూడా వాటి ప్రభావం లేక పోలేదు.

"ఏమిటే రాజ్యం ? ఇదీ అసలుసంధ్యవేళ ?"

"మరేమో నమ్మమ్మా ! .... నిర్మలక్కయ్యా వాళ్ళ బళ్ళో ...." నరసమ్మగారు గుర్రుమగా వాక్యం ఎలా పూర్తిచేయాలో తెలియక రాజ్యలక్ష్మి "పూలున్నాయ్!" అని పూర్తిచేసింది.

నిర్మల తనే జవాబుచెప్పాలన్న అవసరాన్ని గుర్తించి చెప్పింది.

"మీరు ఈ పూలు పూజకని తీసుకుంటారనే ఆశతో ప్రాణపదిలంగా తెచ్చాను..... మీ ఆశీర్వాదం ఉంటే అదే పదివేలు"

పూల నందించబోయిన నిర్మలను చూసి రెండడుగులు వెనక్కివేసి "బాగుందమ్మాయ్ !" అని సాత్వికంగా అన్నదామె. కాని ఆ పూలను నిరాకరించలేక 'లక్ష్మీ ! అవి దేవుడిగదిలో పెట్టు' అన్నది.

పూలు గదిలో ఉంచి వచ్చి "సూర్యంబావ లేరుగదూ ! ...." నలుదిక్కులా వెతుకుతున్నట్లు చూసి అడిగింది రాజ్యలక్ష్మి.

"ఎందుకే వాడూ ! భడవఖానా ! సినిమాకి పోయాడు."

"మర్తేం ... కాస్సేపు నేను డాబామీద ...."

నరసమ్మగారు అసలువిషయం గ్రహించింది. కోపానికి మారుగా నవ్వేసింది.

ఐతే నిర్మలమీద తనకు లేని పదుద్దేశాన్ని తెచ్చుకోడం ఎందుకన్నట్లు మూతి బిగించి "అసలు మీ పిన్నిగారి పనులన్నీ ముగిశాయిటే నీకూ ?" అన్నది.

తలూపింది రాజ్యలక్ష్మి. అప్పటికే నరసమ్మగారిదగ్గర తనకుగల చనువునూ, హక్కునీ నిర్మల చిన్నచూపు చూస్తుందేమో .... వన్న భయం కవిపించిం దాపిల్ల కళ్ళల్లో.

"సరే ! పొండి.... ఓ పావుగంట పోయాక సూర్యాకళ్తావూ దిగిరా ప్రసాదం ఇస్తా" నంది ఆవిడ.

నిర్మల నొచ్చుకున్నదని ఆమెమొహం నల్లబడిపోడంవల్ల తెలుస్తూనేఉన్నదిగాని వెంటనే సంబాళించుకుని మెట్లెక్కిపోయింది.

* * *

నేలమీద చతికిలబడి వెనక్కి వాలి చేతులమీద ఆని తృప్తిగా దీర్ఘంగా నింగినిచూసి "అమ్మయ్య" అన్నది నిర్మల.

రాజ్యలక్ష్మి ఓణీ పైకిలేసుకుని ఇసిక ధూళి ఉందేమోనని నేలమీద ఊది కూచుంది.

"ఏం అక్కా ! ఎలా ఉంది డాబా !" ఆ డాబా బాగుంటే తనకెందుకు గర్వమోనన్నప్రశ్నే ఉదయించలేదా లేత హృదయంలో.

"ఉక్కబోసినట్లయింది .... ఉక్కిరిబిక్కిరి ఐనట్లుంది. నా అన్నవాళ్ల ప్రక్కని ఒక్క క్షణం ఒక్క లిప్త ఇలా కూచుండికి నా ప్రాణం తల్లడిల్లిందంటే నమ్ము."

నిర్మలమాటలు రాజ్యలక్ష్మి కళ్ళు పెద్దవి చేసుకుని విన్నది.

నిర్మల అడిగింది. "మీ పిన్నిగారు .... మీ పిన్నిగారు" ఆమె కళ్లల్లో నైర్మల్యం ఆప్యాయతా వ్యక్తపరిచించేదేగాని అసలుప్రశ్నవేయనేలేక పోయింది.

"మొత్తం ఈ లోగిలిలో ఐదువాటాలు కదూ" అని మాట మార్చింది.

"మేమొచ్చి మూడేళ్ల పైమాటే" నని జవాబిచ్చింది. రాజ్యలక్ష్మి.

"అదివరకు యెక్కడ ఉండేవా రేమిటి ?"

"రాజమహేంద్రవరంలో."

"మరి నువ్వు బడి మానేశావు ఎందుకు ?"

నువ్వెంతవరకూ చదువుకున్నావ్ అని అడగలేక వేసిన ప్రశ్న అది.

"థర్డ్‌ఫారందాకా చిన్నాయన బలవంతంమీద చదివించారు. అనక పిన్నికి పాపాయి పుట్టిందిగా ... మానేశా ...."

రాజ్యలక్ష్మి మొహంలో ఏ భావమూ లేదు. నిజం చెప్పిందంతే.

నిర్మలకుమాత్రం మనస్సు చివుక్కుమంది.

"మీ అమ్మా, నాన్నగారూ ఏరీ ?" అని అడగాలనుకుంది. ఐతే తను ఈ మూడు నాలుగు నెలల్లై చూస్తున్న రాజ్యలక్ష్మిజీవితం, ఆమెను ఆ ప్రశ్న వేయనివ్వలేదు.

"ఈ దిక్కుమాలినది ఎప్పుడు విడుదలవుతుందో" నని రాజ్యలక్ష్మిని వాళ్ళ పిన్ని వీపుమీద కసిగా కొట్టడం, తిట్టడం నిర్మల చాలసార్లు చూసింది.

"నిర్మలక్కయ్యా నీగురించి నా కివాళ చెప్పావమ్మా !" ఆపిల్ల కంఠంలోని నిష్కల్మషమైన ధ్వనికి నిర్మల కరిగిపోయింది.

"చెప్పుకుంది కేముందమ్మా .... నీకంటే నాకెవరూ అప్తులు లేరు ...." మోకాళ్ళమీద తల ఆన్చుకుంది. "తప్పకుండా మరోసారి చెబుతానుగా" అన్నది. వెంటనే తల ఎత్తి "క్రిందికి పోయి మామ్మగారు ప్రసాదం ఇస్తారు. తీసుకుని తిందాం" అంది.

"అప్పు చేస్తున్న మనిషేపోయా...." అంటూ రాజ్యలక్ష్మి వెంటనే క్రిందకి పరిగెత్తింది.

ఆకాశంమీద మిలమిలా నక్షత్రాలు మెరుస్తున్నాయి.

"దేవుడా ! ఏమిటి నీ మాయ? లక్ష్యరహిత పథయాత్రగా నాజీవితం ఇలా అర్థరహితమేనా" అని లోపలలోపల ఘోషించింది.

"నే నిక్కడ అబద్ధం చెప్పాను. దీనివల్ల నేనేం సంపాదించుకున్నాను ? నిజంచెప్పి మాత్రం ఇంతకంటే వెనుక సమాజంలో నేను తెచ్చుకున్న గౌరవప్రతిపత్తు లేమిటి" అని మథన పడింది.

6

"కొత్తపేటలో అరోగల్లీలో నాలుగో ఇల్లోయ్ మాది .... అయినా అదంతా ఎందుకూ ? ఇప్పుడు నాతో రాకూడదూ ...."

శంకరంగారి మాట కాదనలేకపోయాడు సూర్యం. 'సరేనండి' నన్నాడు అతన్ననుసరిస్తూ. వరుసగా ఆవీధి అంతా ముందుకొక అరుగు చిన్నగుమ్మం వంతున పెట్టెల్లాంటి కొంపలున్నాయి.

నాలుగోయింటి గుమ్మంలో ఇద్దరమ్మాయిలు పదేళ్లది, పదకొండేళ్లది ఆడుకుంటున్నారు. తండ్రిరాక గమనించి ఉత్సాహంగా ముందుకు ఉరకబోయినవాళ్లు కొత్తవ్యక్తిని కూడా చూసి లోపలికి తుర్రుమన్నారు.

గుమ్మంలోనే సంకోచంగా నిలబడిపోయిన సూర్యాన్ని "రావోయ్ రా ! కూర్చో" మని శంకరంగారే స్వయంగా ఒక కుర్చీ తెచ్చి అరుగుమీద వేసేరు.

అరుగంటే అరుగుకాదు. సలుచదరంగా శంకరంగారి లాంటి ఆఫీసర్లకు చాలిన డ్రాయింగ్ రూమే అది.

"అమ్మా ! కాంతం.... ముందాయనకి మంచినీళ్లిచ్చి .... అమ్మతో చెప్పు, కాఫీలు కలుపుతుంది."

పదేళ్ల కాంతం మంచినీళ్లగళాసుతో గుమ్మం దాకా వచ్చిందిగాని. నీళ్లు తొణకకుండా గడప దాటడం దానికి వచ్చిందికాదు. అంతలో ఆ తర్వాత చిన్నది రాధ వచ్చి 'నే నిస్తా లెమ్మ' ని ఆ గ్లాసు నందుకుంది.

సూర్యం ప్రత్యేకించి పరిశీలనా దృష్టితోకుతూహలంగా లోపలికి చూస్తున్నాడు.

'తీసుకోండి' రాధ సగంపైగా నీళ్లు తొణికించేసింది.

"ఓ...." సూర్యం పొదుపుగా ఆపిల్ల చేతిగ్లాసు నందుకుని, తనకు మంచినీళ్లు కావాలా ? అని తనలోనే అనుకుని అవి తాగేశాడు.

గ్లాసు తీసుకుని వెళ్లిపోతానన్నట్లు నిలబడి కుతూహలంగా చక్రాలంతేసి కళ్లతో రాధ సూర్యాన్ని చూస్తున్నది.

"నీపేరేమిటి పాపా !"

"రాధ" నోట్లో వేలుపెట్టుకుంది రాధ.

"మరి .... నువ్వు చదువుకుంటున్నావా ?" అంటే తల జోరుగా ఊపింది.

"అవ్వ ! ఎన్నోక్లాసూ ?"

"మూడు" అని చెప్పి మళ్లీ సంతృప్తిపడక "ఈ యేడేం ? పెద్ద బళ్లో అర్లో వడేస్తారు నన్ను .... దానికే నాకు సోషలు, లెక్కలూ కావాలిట ...." అని వేళ్లు కళ్లూ నోరూ తిప్పుతుని చెప్పి అలసిపోయింది.

"ఇంకేం గూడ్ ! సోషలూ, లెక్కలూ నేర్చుకో ...."

"ఊఁ .... కాని కాంతం చెప్పనంటుందిగా ...." రాధకంటే పెద్దది కాంతం.

"ఎందుకు చెప్పదూ ?"

రాధకు మళ్లీ ఏమితోచిందో కాని "చెబుతుందిగాని అదేమో కుర్చీలో కూచుని నన్ను క్రింద కూచోమంటుంది." అన్నది. దాని బుగ్గలు కందిపోయాయి.

సూర్యం ఎలాగో నవ్వాపుకున్నాడు. ఆపిల్ల ముద్దుమాట లటుంచి, అంత లేతవయస్సులోనే దాని అహంకారానికి కించిత్ విస్మయపడి మెచ్చుకున్నాడుకూడాను.

"పోనీ .... నువ్వే కుర్చీలో కూర్చోరాదూ...." గ్లాసందిస్తూ అడిగాడు.

"అసలు స్టూలుమీద కూచుంటే కూడా అది పాఠం చెప్పదుట ...."

గ్లాసు తీసుకుంటూనే 'తుర్రు'మంది రాధ.

"అతగాడేం పరాయివాడా ? .... ఇలా లోపలికి రమ్మనండి ...." సూర్యం కూడా అది ఇల్లాలిగొంతుక అని గ్రహించాడు.

ఆ గది మరీ పెద్దదిగా తోచలేదు. వెనుకనున్న ఇల్లుకూడా విశాలంగా ఉండే అవకాశాలేం లేవుకూడాను.

మూడొందల జీతగాడి జీవితం ఈ ఇరుకు వాటాలోనా వెళ్లబుచ్చుకొంటున్నాడూ ?

"ఏం బాబూ ! అయితే మీకుటుంబం అంతా ఇక్కడే ఉంటున్నారా ?" జానకమ్మగా రడిగింది.

తలూపాడు. "మా బామ్మా .... నేనూ మేమిద్దరమే మా కుటుంబం అన్నాడు కొంచెం నవ్వి. అతనంగదిలోనించి గాజుల వ్వడి, వీరెల చివరలూ ఆడపిల్లల ఉనికిని స్ఫురింపజేస్తున్నాయి. సూర్యం చెవులు రిక్క విన్నాయి.

"అలాగా.... నాన్నగారూ అమ్మగారూ...."

'అంతా చిన్ననాడే గతించారు.'

మధ్యలోనే శంకరంగా రందుకొని "ఇదోయ్ సూర్యం మీ హెడ్‌గుమాస్తాగారి కొంప .... అరుగు రాడపిల్లల తండ్రినోయ్ నేను. క్లీడరు గుమాస్తానో, ప్లీడర్నో అవ్వాల్సింది... ఎంచేతనంటావా ?" అని జందెంతో వీపు గోక్కొని "నేనే అబద్ధా లాడాలా ఏమిటే ? మా ఆవిడ ఆడినా చాలుగా" అన్నారు.

సూర్యానికి నవ్వొచ్చింది.

జానకమ్మగారు 'సరిసరి' అంటూ స్టైల్‌గా మరింత మెడముట్టారా లాక్కొంటూ వెళ్లిపోయింది.

ఆమెకు తల ఒకటే అరా నెరిసింది. కాన్పుల తాకిడినుంచికాబోలు మనిషి బహుసీరసంగా అగుపిస్తోంది. వయస్సుకూడా ఉన్నకన్నా మరొకదారేళ్లు ఎక్కువ అగుపిస్తోంది.

"వస్తానండి" సూర్యం లేచేడు.

"అప్పుడేనా ?" అంటూ శంకరంగారు సాగనంప లేచాడు.

జానకమ్మ వస్తూ "అదేం బాబూ ! వెళ్తున్నారు ... మా యింట ఈపూట భోజనంచేసి వెళ్లాలి ...." అన్నది.

సూర్యం మొహమాటంతోను అయిష్టంతోనూ సుళ్లతిరిగిపోయాడు. "పోనీలెండి .... మరోమా



వీడీ విడని చిక్కులు

"కాదేమో ... మీ బామ్మగారు ఎదురుచూస్తో ఉంటారేమో" అన్నది.

సూర్యానికి ప్రాణాలొచ్చేయి. ఊపిరందింది. "సరే" అన్నాడు.

'నమస్కారం'.

"మంచిది బాబూ ? వస్తూ ఉండండి ...."

దంపతు లిద్దరూ మంచివాళ్ళ అనుకున్నాడు వందుమెట్లు దిగుతూ సూర్యం.

ఐతే అతనిలో పొడసూపిన కుతూహలం మాత్రం తీరిందికాదు. ఏమో దేనినట్లు అనిపించింది ఎదను.

"ఆ ఈడొచ్చిన పిల్లలు వినిపించారేగాని కనిపించేరుగాదు .... ఎలా ఉంటారో .... ?"

ఐనా దాకెందుకుగాని అని వదిమార్చు అతనుకున్నా .... కిటికీ పక్కని ఉన్న జవ్వనుల రూపురేఖలగురించి అతని మనసు ఊహోగానాలు మానలేదు. "ఊరికే ! ఎందు కేమిటీ ?" అనుకున్నాడు.

సూర్యం యువకుడు .... బ్రహ్మచారి .... అంటే అది స్పైలా వచ్చిన నైజం.

*　　*　　*

సూర్యం యింట అడుగుపెడుతూనే ముందు గదిగుమ్మం గొళ్లెం పెట్టిఉండటం గమనించి ఆగిపోయాడు.

గొళ్లెం తీస్తూ 'బామ్మ ఎక్కడికి వెళ్లింది చెప్పుమా !' అనుకున్నాడు.

ప్రక్కవాటాలోని నిరంజనంగారి కోడలు సూర్యాన్నోసారి దీర్ఘంగా చూసి గిరుక్కున తిరిగి అదోలా నడిచి వెళ్లిపోయింది.

రాజ్యలక్ష్మి మెల్లిగా, వెనకాతలే నించోడం గమనించి ఎందుకే? న్నట్లు చూశాడు సూర్యం.

"అమ్మమ్మగారు హరనాథాలయంలో భగవద్గీత వినడానికి వెళ్లారు...." రాజ్యలక్ష్మి చెప్పింది.

సరే నన్నట్లు తల ఎగరేసి ఇంట్లోకి వెళ్లాడు. రెండడుగులు వేసి వెనక్కి తిరిగి చూశాడు. అతన్ని అనుసరిస్తున్న రాజ్యలక్ష్మి 'గతుక్కు' మని నిలబడిపోయింది.

సూర్యం కొంచెం నవ్వడానికి ప్రయత్నించి "అదేమిటే ? నీకు రానురాను మరీ సిగ్గు ఎక్కువైపోతున్నదీ ?" అన్నాడు ఉపేక్షగా.

రాజ్యలక్ష్మి మరింత బుర్ర దించేసుకుంది. గడచిన మూడేళ్లల్లోను రాజ్యలక్ష్మి అంత సిగ్గుపడటమూ, అంత ముగ్ధమోహన రూపమూ సూర్యంకంట పడలేదు.

"సరే ! రా" అని తన గదిలోకి వెళ్లిపోయాడు.

"మరేం టిఫినూ, కాఫీ, ఫ్లాస్కులోనూ ఉన్నాయిట ...." చెబుతూనే తుర్రుమనబోయింది రాజ్యలక్ష్మి.

సూర్యం అనాలోచితంగా చెయ్యి జాపి "ఇదిగో రాజా ...." అన్నాడు. పావురాయిలా వెళ్లిపోతున్న రాజ్యలక్ష్మి గుమ్మంలో తక్కున ఆగిపోయింది.

"అని కాస్త ఇలా ఇవ్వగూడదూ మంచి

లావిని ....” సూర్యం అడిగింతరువాత ఎందు కడిగానా అని నాలిక కర్చుకున్నాడు.

వట్టింటిలోకి వెళ్ళింది రాజ్యం. టిఫిను ఒక చేత, కప్పుతో పోసుకుని కాఫీ రెండోచేతా పట్టుకుని వచ్చింది. అవి రెండూ అక్కడ స్టూలు మీద పెట్టి ‘మరి వెళ్లిపోతా’ నన్నట్లు నించున్నది.

సూర్యం ఆపిల్లకేసి ముచ్చటగానూ ముగ్ధుడై చూశాడు.

ఆడపిల్ల లెంతలో ఎదిగిపోతారు, అనుకుని పకోడీలు తిన సువ్రక్రమిస్తూ తలెత్తి రాజ్యలక్ష్మి ముగ్ధమోహనరూపం చూసి రాజ ఎంత అందంగా ఐపోయింది” అనుకున్నాడు. అంత వరకూ అతనికేసి ఆర్భిప్పంతేసి కళ్లతో చూస్తున్న రాజ్యలక్ష్మి కళ్లు టప్పున వాల్చుకుంది.

“ఐతే రాజగారూ, కాఫీ దాహం తాగమంటా, తలవ ?”

రాజ్యలక్ష్మి తప్పుచేసి గ్రహించినదానిలాగ ఉలిక్కిపడి ‘ఉహూ’ అంటూ వెళ్లి మంచినీళ్లు తెచ్చి ‘ఠ’ క్కున గ్లాసు పక్కడ పెట్టేసింది.

ఆపిల్ల నడకబెడుగులకు ముగ్ధుడైపోయిన సూర్యం పకోడీల రుచికూడా తెల్సుకోలేక పోయాడు.

ఏదో అనబోయి మంచినీళ్లు తాగాడు. పొలమారింది.

అంతలో మొగలిపువ్వులా నించున్న రాజ్యలక్ష్మి ముత్యాలొలుక నవ్వేసింది. సూర్యం అందుకు జూరుగా ఏదో అనబోయి మరింత ముక్కులోకి నీళ్లు రాగా, ఉక్కిరిబిక్కిరి ఐపోయాడు. రాజ్యం కైటకొంగు నోటబెట్టుకుంది.

“అది సరేగాని నా టిఫిన్ తినడం అయ్యే సరికి యీ కాఫీ కాస్తా ఐస్‌వాటర్ అయిపోతుంది.” అన్నాడు.

‘అరె’ అని వేలు కొరుక్కుని రాజ్యలక్ష్మి వట్టింట్లోకి పరిగెత్తింది.

ఫ్లాస్కు తెచ్చి కప్పులోని కాఫీ అందులో పోయబోయింది.

“అహా హా ఫర్వాలేదు తాగేస్తాగా’ అని వారించబోయాడు సూర్యం. అతని చెయ్యి తనకి తాకుతుందేమోనన్నట్లు భయపడి కప్పు జార్చేసిందా పిల్ల. సూర్యం కాఫీ తనమీదకు చిందకుండా ముంచున్నాడు.

కప్పు ముక్కలైంది. ఫ్లాస్కు మాత్రం ఆపిల్ల గట్టిగా పట్టుకుంది. ఆ చెయ్యి ఒణుకుతున్నది కూడా. జరిగినదానికి నుదుట చిరుచెమటలు కమ్మేయి.

ఫ్లాస్కును ప్రక్కనిపెట్టి గాజుపెంకు లేరకూర్చున్నది రాజ్యలక్ష్మి. తెలిసి వచ్చినట్లు “జాగర్త ! పెంకులు గుచ్చుకుంటాయి” అన్నాడు.

ఒకసారి మొహం ఎత్తడానికి ప్రయత్నం చేసిందికాని ఆపిల్ల కాటుకకనులు చెమ్మగిల్లాయని గ్రహించిన సూర్యం విలవిల్లాడిపోయాడు.

“మరేం ఫర్వాలేదులే .... పోతే పోయింది. నువ్వు వెళ్ళి ఇల్లు రాస్తారే ఆ గుడ్డ పట్రా.... ఈ లోగా నే నివి ఏరుతా” నన్నాడు గాజుపెంకు లేరడానికి కూచుని.

“ఉహూఁ .... వద్దు .... గుచ్చుకుంటాయి” అని ఇంకా తొందరగా ఏరసాగింది గాజుపెంకులు.

కాఫీ గుడ్డతో తోత్తేసి నీళ్లుజల్లి రాసింది. ఆపిల్ల బాధపడుతున్నదేమో .... భయపడుతున్నదేమో నన్న బాధతో సూర్యం అలాగే నిలబడి పోయాడు.

“అమ్మయ్య ! మరేం భయంలేదుగాని ఇక పోయి ఫ్లాస్కు పక్కడ పెట్టి మరోగ్లాసు మంచినీళ్లు తే ....” అన్నాడు.

రాజ్యలక్ష్మి “‘నామంచే కదా నీకు కాఫీ లేకుండా పోయింది’’ అన్నట్లు కళ్లతోనే భావం వ్యక్తీకరించినట్లు చూసింది సూర్యంకేసి.

“అమ్మమ్మ ! ఏమీ అనదులే. నే చెబుతాగా” వాత్సల్యమూ, సానుభూతి ఉట్టిపడేలాగ చెప్పాడు.

“మరి కాఫీ ....” అని ప్రశ్న వేసింది. సూర్యానికి సంతోషమూ, కోపమూ రెండూ వచ్చేయి.

“బాగుంది గడుసుతనం .... నువ్వు ఒంపేసింది గాక పైగా నన్ను నిందిస్తున్నావా ?” అన్నాడు.

రాజ్యలక్ష్మి ఏమో అనబోయిందిగాని యేదో స్ఫురించినట్లు ప్లేటూ, ఫ్లాస్కూ తీసుకుని అక్కణ్ణించి వెళ్లిపోయింది.

“పోయినేడాది తనను చెవులు పట్టుకుని బావా అని ఊపిన రాజ్యమా ఈ అప్సరస !

“ఏడాది క్రితం అమ్మమ్మ ఇమ్మంటేనే నవ్వయంగా సున్నం వారు పొక్కేలాగ ఆకులకు రాసిచ్చిన అందాలభరిణే నా ? యీ ఒప్పుకుప్పు. సూర్యం ఎదనేమో పులకింత కలిగింది.

రాజ్యలక్ష్మి తిరిగివచ్చి “నేను కాఫీ పెట్టనా ?” అన్నది మెత్తగా.

“ఇంకేం .... కాఫీ ఇమ్మంటే అమ్మాయి ఇంతవరకూ చేసింది .... ఇక కాఫీ కాని ఇద్దువుగాని” నవ్వేడు.

దమ్మిడీఅంత మొహమ్మై పోయిం దా పిల్లది.

“మరెలాగ ? అమ్మమ్మగారు వాస్తే కోప్పడతారు” అన్నది.

“ఎవర్ని ? నిన్నా ? నన్నా ? ....”

‘నన్నే’ నన్నట్లు తలూపింది రాజ్యలక్ష్మి.

“విన్నెందుకూ మధ్య .... కాఫీ తాగకండా పోయింది నేనుగా ....” కొంటెగా అడిగాడు.

చురుక్కున మెరిసినట్లు చూసింది.

నాకు భయంతో ఇవతల ప్రాణాలు పోతూ ఉంటే నీకు వేళాకోళమా అన్నట్లు ఉన్నదాచూపు.

“కప్పు విషయం నువ్వేం అనొద్దు. బామ్మతో నేచెప్పుకుంటాలే” హామీ ఇచ్చాడు సూర్యం.

“సరే !” పారిపోయింది రాజ్యలక్ష్మి. మెరుపు మాసుకుపోయిన గుమ్మంకేసి చూస్తే అలాగే నాలుగు క్షణాలు బొమ్మలాగి ఉండిపోయాడు.

(సశేషం)

రచయితలకు మనవి

భారతిలో మేనెలనుండి ప్రతి నెలా ఒక చిన్న నవల ప్రకటించ వలయునని సంకల్పము. నవల అచ్చులో 15 పేజీలకు తక్కువ కాకుండా, 25 పేజీలకు మించకుండా ఉండవలెను. వ్రాతప్రతి ప్రతినెలా 5 వ తేదీకి చేరవలెను. ఆమోదింపబడిన నవలకు రు. 101-00 లు ఇవ్వబడును. అనువాదాలు అంగీకరింపబడవు. రచయితలు తమ రచనలను సంపాదకుడు, భారతి, అని పంపవలెను. ఉత్తరములుగాని, రచనలనుగాని సంపాదక వర్గములో ఎవరి పేరనూ పంపవద్దని మనవి. ఈ విషయమును ముఖ్యముగా గమనింప ప్రార్థన.

—సంపాదకుడు, భారతి.

ఆంధ్రసచిత్ర వారపత్రికలో ప్రకటనలు
మీ వ్యాపారాభివృద్ధికి తోడ్పడుతాయి


సినిమా వార్తలు

13-వ పేజీ తరువాయి

మానుకుంటానని మొదలుపెట్టింది. క్రితం సంవత్సరం ఇదుగో ఇదే నా ఆఖరుచిత్రమన్న బోర్డోట్ తర్వాత రెండు చిత్రాల్లో నటించింది. "జీవితంలో అసలు ఒక్కొక్కప్పుడు వెనక్కి తగ్గి ఉండటమే మంచిది. పదేళ్ళకుపైగా ఈ పరిశ్రమలో వున్నాను. ఇంక నా సొంత విషయాలు చూసుకోవాలి—ఇది బార్డోట్ అభిప్రాయం.

లారెన్స్ ఆఫ్ అరేబియాకు ఒంటెల రవాణా

లారెన్స్ ఆఫ్ అరేబియా చిత్రంలో పాల్గొనేందుకుగాను సహారానించి, స్పెయిన్‌లోని ఆల్మేరియాకు 700 ఒంటెలను రవాణాచేశారు. ఈ అతిభారీ చిత్రనిర్మాత శామ్ స్పైజిల్ జోర్డాన్ ప్రాంతంలో లొకేషన్‌కోసం 6 నెల్ల పాటుండి ఇటీవలనే స్పెయిన్ చేరుకున్నారు. పానావిజన్ కెమెరాలతో సహా 150 మంది బృందాన్ని తదితర జనాన్ని సామాగ్రిని చేరవేసేందుకు 48 లోడ్డు ట్రక్కులు, ఒక ప్రత్యేకపు రైలు కావలసి వచ్చాయట. 1600మంది ఒంటెల, 900మంది అశ్వికయోధులు స్పానిష్‌రేవులో జరిగే పోరాట సన్నివేశంలో పాల్గొంటాయి. భారతీయ నటుడు ఐ. యం. జోహార్ పాల్గొంటున్న ఈ చిత్రంలో సర్ అలెక్ గినెస్, ఆంథోనీక్విన్, ఆంథోనీక్వాయి, ఈజిప్షియన్ కళాకారులు మార్ షరీఫ్, గమిల్ రతిబ్‌లు, పీటర్ ఓటూలే (లారెన్స్ పాత్రధారి) వగైరా ప్రముఖ కళాకారులు పాల్గొంటున్నారు.




నవీన చిత్రవారి 'సవతికొడుకు'లో గుమ్మడి, హేమలత.

తెలుగుచిత్ర వార్తలు


స్వర్ణమంజరి

ముచ్చటగా మూడు భాషల్లోను ప్రజాదరణం పొంది, వీనులవిందు చేసిన సంగీతమయ చిత్రం 'సువర్ణసుందరి' నిర్మాతలు అంజలీ పిక్చర్సు నిర్మిస్తున్న 'స్వర్ణమంజరి' పూర్తికావచ్చింది. ఇప్పటికి 13 రీళ్లకు పైగా తయారైన ఈచిత్రంలోకూడా నిర్మాత సంగీత దర్శకుడు శ్రీ ఆదినారాయణరావు సంగీతం ప్రత్యేకాకర్షణ కాగల సూచన లున్నాయి.

నిత్యనూతన నటుడు ఎన్. టి. రామారావు నాయకపాత్ర ధరిస్తున్న ఈ చిత్రంలో అంజలీదేవి, కన్నాంబ, జయంతి, మీనాకుమారి, నాగయ్య, పద్మనాభం, పేకేటి పాల్గొంటున్నారు. సంభాషణలు : మల్లాది రామకృష్ణశాస్త్రి, పాటలు : సముద్రాల (సీనియర్), కళ : శేఖర్, వాలి,



బాబూమూవీస్ 'మంచిమనసులు' చిత్రంలో వాసంతి, సావిత్రి, జానకి,



విజయగోపాల్ వారి 'చిట్టితమ్ముడు'లో
రమణారెడ్డి.

తెలుగు చిత్రవార్తలు

ఛాయాగ్రహణం : ఆది ఇరాని. దర్శకుడు: వేదాంతం రాఘవయ్య. అతి భారీసెట్టింగులతో ఆకర్షణీయంగా తయారవుతున్న ఈ చిత్రం త్వరలోనే విడుదలకాగలదని తెలుస్తోంది.

* * *

సారధీసంస్థ

'ధైర్యే సాహసే లక్ష్మీ' అన్నారు పెద్దలు అంటే పదండిముందుకు పదండి తోసుకు అంటూ ముందుకు పోతే లక్ష్మీ కటాక్షం సిద్ధిస్తుందట. సరిగా అదనే చేసింది సారధీ సంస్థ. హైదరాబాద్‌లో స్టూడియో పెట్టున్నారంటే పైకి బాగుందన్నా లోపలమాత్రం సారథీ లేకుండానే రథం నడుపుతారేమో ననుకున్నారు. కొందరు. కాని ఇప్పుడు నిత్యనూతనోత్సాహంతో పుంజుకుంటున్నది సారధీ స్టూడియో. ఇంత వరకు చాలా చిత్రాలు తయారయ్యాయి. అసలు సారధీసంస్థే చాలా చిత్రాలు తయారుచేసింది. ఇటీవల వీళ్ల "కలసిఉంటే కలదు సుఖం" ప్రజామోదం పొందింది. ఇప్పుడు 'పడిక్కాడమేధై' ని తెలుగులో నిర్మిస్తున్నది.

ఈ సంస్థలో పనిచేసినవారే నిర్మాతలై స్టూడియోకి సహాయపడటం ఇంకో విషయం. అల్లా ఏర్పడిందే రవీంద్రా ఆర్ట్స్ ప్రొడక్షన్స్. సారధీలో పనిచేసిన శ్రీ తమ్మారెడ్డి కృష్ణమూర్తి, డి. వి. రెడ్డి అనే మిత్రునితో సంస్థ నెలకొల్పి సాంఘిక చిత్రం నిర్మించాలని ప్రయత్నిస్తున్నారు. సారధీలోనే తయారుకాగల సూచనలుగల వీరి చిత్రంలో ఎన్. టి. రామారావు, కృష్ణకుమారి, రేలంగి, గుమ్మడి, సూర్యకాంతం, గిరిజ పాల్గొంటారట.

దర్శకుడు: వి. మధుసూధనరావు, సంభాషణలు: వాళ్ల చిరంజీవి. సంగీతం: చలపతిరావు.

ఇదే స్టూడియోలో తయారవుతున్న ఇంకో చిత్రం మయూర్‌వారి "ప్రాణస్నేహితులు" కొంగారావు, కృష్ణకుమారి, హరనాథ్, ఛాయాదేవి ఇంకా అనేకులు పాల్గొంటున్న ఈ చిత్రదర్శకుడు: రజనీకాంత్.

కొద్దికాలంలోనే పలుసంస్థలు ఇలాగే హైదరాబాద్‌లో చిత్రనిర్మాణం కొనసాగించి, ఆంధ్ర ప్రదేశంలో తగినన్ని స్టూడియోలు లేని కొరత తీరుస్తాయని ఆశిద్దాం.

జానకీ రామారావు జంట

షాహుకారు చిత్రంలో ఈడుజోడుగల జంటగా పేరుపొందిన రామారావు, జానకిలను కన్యాశుల్కం, రేచుక్క—పగటి చుక్కల తరువాత చాలా రోజులకు సవతికొడుకులలో చూడబోతున్నాం. నవీన చిత్రా సంస్థ పేరిట తయారౌతున్న ఈ చిత్రంలో మంచి మనసు (లు) వాసంతి, పసందైన హుషారుజంట రేలంగి—గిరిజ, హేమలత, గుమ్మడి, సి. యస్. ఆర్, చదలవాడ ఇంకా పలువురు పాల్గొంటున్నారు. యువకుడు వై. రంగారావు దర్శకత్వం. కథ, మాటలు బైరాగి. సంగీతం: టి. వి. రాజు. నృత్యం: వి. జె. శర్మ. ఛాయ: జానకిరాం. కళ: జె. జయరామిరెడ్డి. చిత్రీకరణం అతి చురుకుగా సాగుతోంది.

ఇరుగు పొరుగు

కళా ప్రపూర్ణా అనే సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రంలో రామారావు, కృష్ణకుమారి, రేలంగి, గిరిజ, సంధ్య.పాల్గొంటున్నారు. దర్శకుడు: మూర్తి.

హిందీ చిత్రజగత్


హిందీలో తమిళ 'శారద'

తమిళనాడులో విజయవంతంగా నడుస్తున్న శారద చిత్రాన్ని ఏ. యల్. యస్. ప్రొడక్షన్స్ హిందీలో కూడా నిర్మించేందుకు సన్నాహాలు చేస్తోంది. చిత్రకథ, సంభాషణలు రామానందసాగర్ రచిస్తున్న ఈ చిత్రంలో ప్రదీప్‌కుమార్, మాలాసిన్హా ప్రముఖ భూమికలు నిర్వహిస్తారు.

నవకళాకేంద్రచిత్రం

భక్త సూర్‌దాస్ జీవిత చరిత్రను నవకళాకేంద్రం వారు చలనచిత్రంగా తీస్తున్నారు. ఇటీవల ముహూర్త షాట్ తీశారు.

భరత్‌భూషణ్ సూర్‌దాస్ భూమిక నిర్వహిస్తున్న ఈ చిత్రంలో కల్పన, వందనా, రత్నా, రణధీర్, యస్. కె. ప్రేమ్, జీవన్ తదితరులు పాల్గొంటున్నారు. పాటలు: ప్రేమ్‌ధావన్, సంగీతం: చిత్రగుప్త, ఛాయ: వి. అవధూత్. ★



గాడ్రెజ్ కంపెనీ నిర్వహించిన అఖిలభారత "సింథాల్ వ్యాస రచన" పోటీలో గెలుపొందిన వారికి ఇటీవల బొంబాయిలో బహుమతి ప్రదానం జరిగింది. సభకు పలువురు వర్తకప్రముఖులు, పత్రికావిలేఖరులు, విద్యావేత్తలు, విద్యార్థులు హాజరయ్యారు. ప్రముఖ చలన చిత్రనటి శ్రీమతి ఆశాపరేఖ్ బహుమతులు పంచిపెట్టారు. కుమారి మెలిస్సా గ్రాసియస్‌కు ప్రథమ బహుమతి (స్విట్జర్‌లాండ్‌కు రానూపోనూ విమానం టిక్కెట్టు) లభించింది. ఎయిర్ – ఇండియా జనరల్ మేనేజర్ శ్రీ బి. ఆర్. పటేల్ గాడ్రెజ్ కంపెనీని అభినందిస్తూ ప్రసంగించారు. సభాప్రారంభంలో గాడ్రెజ్ కంపెనీ ప్లానింగ్ మేనేజర్ శ్రీ బి. ఆర్. పారిధోలకియా సభికులకు స్వాగతం చెప్పారు.



ఉపరాష్ట్రపతి డా॥ రాధాకృష్ణనుండి సావనీర్ స్వీకరిస్తున్న “భార్యాభర్తలు” నాయిక శ్రీమతి కృష్ణకుమారి



ఉపరాష్ట్రపతి డా॥ రాధాకృష్ణనుండి సావనీర్ స్వీకరిస్తున్న “భార్యాభర్తలు” నాయకుడు శ్రీ నాగేశ్వరరావు.

చిత్రాలు ప్రజల తాత్త్వికస్థాయి పెంపొందించాలి

“చలనచిత్రాలు మానవుని తాత్త్వికస్థాయిని పెంపొందించేవిగా వుండాలి. నిర్మాతలు తమ వ్యాపారాన్ని అందుకు వినియోగించాలి. మానవ జీవితంలో చలన చిత్రాలు ప్రముఖపాత్రను వహిస్తున్నవి.

“శాస్త్రం దినదినాభివృద్ధి నొందుతున్న ఈ రోజుల్లో జరుగుతున్న ఎన్నో వింతలను చిత్రించి చూపించి, పిల్లల మనస్సులలో ఉత్తేజాన్ని కలిగించవలసిన బాధ్యత చిత్ర నిర్మాతలమీద ఉంది.” అని ఉపరాష్ట్రపతి డా. రాధాకృష్ణన్, 1961 సంవత్సరపు ఉత్తమ చిత్రాలకు బహుమతులు ఇస్తూ అన్నారు.

సుమారు 32 చిత్రాల నిర్మాతలు, దర్శకులు, కళాకారులు హాజరైన ఈ బహుమతి ప్రదానోత్సవంలో కేంద్ర సమాచార, ప్రచారశాఖ మంత్రి శ్రీ గోపాలరెడ్డి ప్రసంగిస్తూ, “ఇలాటి బహుమతులవల్ల చలన చిత్రాలస్థాయి పెరుగుతుందన్నదే ఉద్దేశ్యమనీ, అంతర్జాతీయ ప్రశంసలు పొందిన భారత చిత్రాల్లో 10 ప్రభుత్వ బహుమతులందుకున్నవేనని” అన్నారు.

ఈ సందర్భంలో భారత చలనచిత్ర సమాఖ్య అధ్యక్షుడు శ్రీ మోడీ శబ్ద ఛాయాగ్రహణాలకు కూడా బహుమతులు ఏర్పాటుచేయాలని సూచించారు.

వంగ భాషా చిత్రం “భగిని నివేదితకు” రాష్ట్రపతి స్వర్ణపతకం, రు. 20 వేల రొక్కం లభించాయి. అఖిలభారత స్థాయి యోగ్యతాపత్రం, రు. 10 వేల నగదును తమిళచిత్రం “పావమన్నిప్పు” పొందింది. దర్శకునికి రు. 2,500 బహుమతి లభించింది. మరాఠీ చిత్రం ‘మానిని’కి అఖిల భారత యోగ్యతాపత్రం మాత్రం లభించింది.

బాలచిత్రం ‘హట్టగాల్’ అనే హిందీ చిత్రానికి ప్రథమబహుమతిగా ప్రధాని సువర్ణపతకం, నిర్మాతకు రు. 20 వేలు, దర్శకునకు రు. 5,000 బహుమతి లభించింది.

ద్వితీయ బహుమతి చిత్రం ‘సావిత్రి’ (హిందీ) అ. భా. యోగ్యతాపత్రం, నిర్మాతకు రు. 10 వేలు, దర్శకునకు రు. 2,500 ఇచ్చారు.

వార్తా చిత్రాలలో “రవీంద్రనాథటాగూర్ (ఇంగ్లీషు)కు రాష్ట్రపతి సువర్ణపతకం, నిర్మాతకు రు. 4 వేలు, దర్శకునకు రు. 1,000 లు ఇచ్చారు.

ప్రాంతీయ భాషలలో ఉత్తమ చిత్రాలుగా ఎన్నికైన ‘భార్యాభర్తలు’ (తెలుగు) ‘కప్పలోట్టియ తమిళన్’ (తమిళం), ‘ధర్మపుత్ర’ (హిందీ), ‘మానిని’ (మరాఠీ), ‘సమాప్తి’ (వంగ), ‘శకుంతల’ (అస్సామీ) ‘ముదియనాయకపుత్రన్’ (మళయాళం) లకు రాష్ట్రపతి రజితపతకాలు బహూకరించారు.

ప్రాంతీయ యోగ్యతాపత్రానికి యోగ్యమైన తెలుగు చిత్రమేది రాకపోవటం గమనార్హం. బహుమతుల నందిస్తూ డా. రాధాకృష్ణన్ “ఇదివరకువలెనే ఇకముందుకూడా ప్రభుత్వ ప్రయివేటురంగాలు చిత్రనిర్మాణంలో అంతర్జాతీయఖ్యాతిని పొందగలవని ఆశిస్తున్నా” మన్నారు. ★

హరివంశం

15వ పేజీ తరువాయి

కోడిపాత్రమునందియిచ్చి, ఆమెను పట్టుకొని ఉచితాస్తరణముపై కూర్చుండబెట్టినది. కూర్చుండబెట్టి ఇట్లులన్నది:

"తల్లీ! మేము మీకు బిడ్డలవంటివారము. మీకు కామాక్షి యెట్లు, నేనట్లు. వారు మీకు పుత్రసమానులు. తమ కష్టమును, సుఖమును మాతో చెప్పికొనవచ్చును. తల్లీ! ఒక్క విషయమును చెప్పుమనినారా! ఆచార్య మహానందులను మహారాజులు విచారించుచున్నారనగా, అది ఆచార్యులమీద ఆగ్రహముచేతనని మీరు భావించుచున్నారు. తల్లీ! అది నిజముకాదు. నామీది కోపముతో మహారాజు ఈపని చేయుచున్నారు. మహారాజు ఆయనకు శిక్ష విధించుచో, అది నాకు విధించినట్లు. మరి మహానందులవారికి అభియోగములునులేవు, శిక్షలునులేవు. వారిని శిక్షించుట యేమిటి? ఏమి మహారాజా!"

పౌండ్రకుడు గల్లున నవ్వెను. మహానందుని భార్యకు ఆశ్చర్యమువేసెను. తానింత దుఃఖములో నుండగా, ఇందులో నెవరికి అది పట్టినట్లులేదు. పౌండ్రకునకిది నవ్వుగా నున్నది. సుదక్షిణ దుఃఖములేని, వేదనమునెరుగని ఫణితి నవలంబించినది. తన దుఃఖము వీరి కర్థమగుటలేదో! పౌండ్రకునకు ఇంకను బంగారుమృగము సంగతి తెలియదు వలె నున్నది. ఆమె ఆమాట యనుకొననంతలో మందిర బహిః ప్రాంగణమున, ద్వారమువద్ద కంచుకి యెవ్వరినో అదలించుట వినిపించెను. కంచుకి లోనికి వచ్చుచున్న అడుగుల సవ్వడియు విననయ్యెను. పౌండ్రకుడటుదిక్కు దృష్టులబరపి, సుదక్షిణను చూచి, ఏమి? అన్నట్లు శిరఃకంపనమాత్రముచేత ప్రశ్నించెను. అంతలో కంచుకి లోనికి రానేవచ్చెను.

"మహారాజా! వాచాలుడు ద్వారమువద్ద తమ్ము చూడవలయునని గోలచేయుచున్నాడు. నేను వీలు లేదన్నాను. వీలులేకపోవుట యేమిటి? నేను వాసుదేవుని ఇప్పుడు చూడవలసినదే! నని వాచాలు డనుచున్నాడు. నేను......" అని అర్థోక్తిలో అతడు మహానందుని భార్యవైపు చూచెను. పౌండ్రకుడు మందహాసము చేసెను. "కంచుకీ! ఇక్కడ క్రొత్తవారులేరు. వాచాలుని రమ్మనుము" అని ఆజ్ఞాపించెను. "చిత్తము" అని కంచుకి వెడలిపోయెను.

లోనికి వచ్చిన వాచాలుడు మహానందుని భార్యను చూచి, చూచినవాడు చూచినట్లే ఆగిపోయెను. ఏదో మహావృత్తాంతము చెప్పుదమని వచ్చినవాడు. అది చెప్పుచుండగా దానిని వినరానివారెవ్వరో అచ్చట నుండగా దిగ్భ్రాంతిని చెందినట్లు వాచాలుడు అప్రతిభుడై పోయెను. అందరి దృష్టులును అప్పుడతనిపై లగ్నములైనవి. పౌండ్రకుడు వానినిచూచి ఇట్లు ప్రశ్నించెను.

"వాచాలా! ఏమియో చెప్పవచ్చి ఆగిపోతివి?...."

వాచాలుడు మహానందుని భార్యదిక్కై ఒక్కసారియు, పౌండ్రకునిదిక్కై ఒక్కసారియు చూచుచు నుండిపోయెను.

"వాచాల!"

"పౌండ్రక.....కాదు...కాదు.....వాసుదేవ...."

సుదక్షిణ నవ్వినది. "మహారాజా! ఇతనిని మహా ఇరుకునపెట్టినారు" అన్నది. వాచాలునిచూచి, "వాచాల! మేము ఉండగా, అది చెప్పరానివార్త యగుచో నేను, ఆచార్యాణియు మరియొక మందిరములోనికి పోయెదము" అన్నది.

"వాచాల! ఏమి చెప్పవచ్చితివో అది చెప్పుము" అనినాడు పౌండ్రకుడు.

"వాసుదేవ! ఆచార్య మహానందులు మన ఇచ్చిన బంగారు మృగమును కొరగానివాని కెవ్వనికో దానము చేసినారు......"

పౌండ్రకుడు విచిత్ర కంఠస్వరముతో 'ఆః!' అనినాడు. మహానందుని భార్య మూర్ఛకూరినది. సుదక్షిణ విచిత్రమందహాసముచేసి, "ఇప్పటికి పూర్తి అయినది" అన్నది. ★

సనమూ-మనరాష్ట్రం

11-వ పేజీ తరువాయి

ఉన్నాంకదా ఎంత చిన్నవిషయమైనా నెహ్రూదాకా వెళ్లడం.

ఇలాంటి పరిస్థితుల్లో శ్రీ బ్రహ్మయ్య తా నధిష్ఠించిన పదవికి న్యాయం చేకూర్చాలన్నా, దానిని గౌరవభాజనం చేయాలన్నా, ముందు ఆయన దృక్పథంలోనే మార్పు రావాలి. రాష్ట్రంలో మరొకరు ఏకైక నాయకులైతే కావచ్చు. కాంగ్రెస్‌సంస్థలో ఆర్గనైజేషన్ విభాగానికి సంబంధించినంతమటుకూ, తానే అధినేత నన్న నమ్మకం కుదుర్చుకుని, సంస్థను పటిష్ఠం చేయడానికి తగిన కార్యక్రమం రూపొందించి అమలుజరిపే చొరవ తీసుకోవాలి. ఈనాడు కాంగ్రెసులో క్రమశిక్షణ, ఐకమత్యం లోపించిందన్నా, నానారకాలవారు కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నా కాంగ్రెస్ పార్టీ అండతో అధికారం చేపట్టాలనే తాపత్రయం తప్ప మరొకటికాదు. కాంగ్రెస్‌ను ఒక మెట్టుగా ఉపయోగించుకోవాలనేగాని, కాంగ్రెస్‌ద్వారా ప్రజాసేవ చేయాలనికాదు. ఈ పరిస్థితిలో మార్పు రావాలంటే, మంత్రిపదవికన్నా, అధ్యక్షపదవి, ఎం.ఎల్.ఏ. కన్నా కాంగ్రెస్ కార్యకర్త గొప్పవాడని నిరూపించాలి. రెండుపనులు చేస్తే ఇది సాధ్యమవుతోంది. ఒకటి— పరిపాలనావిభాగం నిర్వహించేవారు, సంస్థకు లోబడి, సంస్థ అధిపతుల నిర్ణయానుసారం వ్యవహరించేట్లు చేయడం. రెండు:—మంత్రి పదవుల కున్న ఆడంబరము, స్వాగతసత్కార పటాటోపాలు తగ్గించి ఎక్కడఉన్నా మామూలు కాంగ్రెస్ వాడిలాగానే ప్రజాసేవ తప్ప మరొకటి లేదని తెలిసి వచ్చేట్లు చేయడం.

ఈ రెండింటిలో ఏ ఒక్కటి చేసినా శ్రీ బ్రహ్మయ్య తన పదవిని సార్థకం చేసుకున్నవారవుతారు. లేదా, ఇటీవల ఈ పదవి నధిష్ఠించిన అనేకులలో వీరూ ఒకరై ప్రత్యేకతనేది లేకుండా ఉండిపోతారు. ★

పిచ్చఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరు రోగులు, ఒకరోజు మధ్యాహ్నం కాపలావాళ్లు ఎవరూ లేకుండ చూసి, దగ్గరలో ఉన్న కాలువగట్టుమీద హాయిగా విహరిస్తున్నారు. ఉన్నట్టుండి వారిలో ఒకడు కాలువలో దూకాడు. రెండవ వాడు ముందు వెనుకలు చూచుకోకుండ వెంటనే నీటిలోకి ఉరికి వాణ్ణి ఒడ్డు చేర్చి రక్షించాడు.


ఈ సంఘటన విన్న ఆస్పత్రి అధికారి రెండవవాణ్ణి పిలిపించి "నీ ధైర్యాన్ని మెచ్చుకుంటున్నాను. నీలా ఇతరుల ప్రాణాలు కాపాడిన వాడికి పిచ్చి ఏమిటి? రేపే నువ్వు ఇంటికి వెళ్లిపోదువుగాని" అని అభినందించాడు.

అధికారి మెప్పు పొందిన రోగి తన కృతజ్ఞత తెల్పుకుంటున్నాడు. ఇంతలో ఆస్పత్రి ఉద్యోగి ఒకడు అక్కడికి వచ్చి "ఇతడు రక్షించిన మనిషి ఇప్పుడే ఉరిపోసుకుని చచ్చిపోయాడు." అని అధికారి చెవిలో చెప్పాడు.

"నువ్వు కాపాడిన మనిషి ఉరిపోసుకుని చచ్చిపోయాడట పాపం!" అధికారి రోగితో అన్నాడు.

"అబ్బే లేదండీ! బాగానే ఉన్నాడు. నీటిలో పడి తడిసిపోయాడు కదా! ఎండుతాడని నేనే వ్రేలాడకట్టి వచ్చాను." రోగి మొర పెట్టుకున్నాడు!

ఆర్. విమల (బందరు)



మనమూ-మనదేహస్థితి

10-వ పేజీ తరువాయి

అది సెల్యులైటెస్ అవుతుంది. గడ్డలోనూ, రాచపుండులోనూ, ఏబ్సెస్‌లోనూ, ఎన్నో కొన్ని జీవాణువులు ఇన్‌ఫ్లేం అవుతవి. కాని, సెల్యులైటెస్ అన్న మాటను ఒక శరీరభాగంలో చాలావంతు ఇన్‌ఫ్లేం అయినప్పుడే, వాడడం వైద్య సాంప్రదాయంగా వస్తున్నది.

జీవకణంలోకి నీరూ, యితర పదార్థములు వస్తూ పోతున్నవిగదా ! నీరు లోపలికి మాత్రమే పోయి మళ్లీ బయటికి రాకపోతే జీవకణములు ఉబ్బిపోతవి. ఆ ఉబ్బును "నంజు" అంటారు. ఇంగ్లీషులో ఈడిమా అంటారు. ఈ ఉబ్బు రెండురకములు. జీవకణంలో నీరు బయటికిరాని రకం ఒకటి. జీవకణముల మధ్యప్రదేశములలో ద్రవపదార్థం అధికమై ఏర్పడేది మరొకటి. జీవకణములలోనుంచి టిష్యూఫ్లూయిడ్‌లోకి నీటినీ ఇతర వస్తువులనూ పీల్చుకునేశక్తి, కేపిలరీల వెయినుకొనలకు ఉన్నది. అవి కేపిలరీలో ఉండే పీడనశక్తి (Pressure) భేదములవల్ల ఏర్పడుతున్నది. ఆవిషయం రక్తప్రసారం చర్చిస్తున్నప్పుడు వివరిస్తాను. ప్రస్తుతానికి, కేపిలరీ అగ్రమునకు ఆ గుంజుకునే శక్తి ఉన్నదని తెలుసుకుంటే చాలు. హృద్రోగంలో, హృదయంలో కండరములు సంకోచశక్తిని కోలుపోయినప్పుడు రక్తం ధాతువులకు వచ్చినంత వేగంతో మళ్లీ వెనక్కుపోదు. అప్పుడు, శరీరం ఉన్నస్థితిలో క్రిందిభాగములు నీరుచూపుతవి. రక్తంలో ప్రోటీనుల పరిమాణం సరిగా లేకపోయినా నంజు చూపుతుంది.

పై విషయములు అర్థంచేసుకుంటే, జీవకణములలో జరిగే కార్యక్రమమే జీవితమనీ, అది లోపభూయిష్టము కావడమే రోగకారణమనీ, జీవనకార్యక్రమంలో కొన్ని వస్తువులు, జీవకణంలో రంధ్రములద్వారా లోపలికిపోవడం, అక్కడ కొన్నిమార్పులు చెంది మళ్లీ బయటికి రావడం, ఒక క్రమంలో, ఒక గతిలో, ఒక పరిమితిలో జరగడం అవసరమనీ అర్థం అవుతుంది. దానికి కావలసినవస్తువులను జీర్ణకోశం సరఫరా చేస్తుంది. ఆ వస్తువులనూ, అవి దహించబడడానికి, పునర్నిర్మాణం కావడానికి కావలసిన ప్రాణవాయువునూ రక్తం సేకరించి, ఆర్టెరీలద్వారా జీవకణములకు అందిస్తుంది. ఇందులో ఏ విషయంలో ఏ లోటు ఏర్పడినా అపాయమూ, క్రిమిదోషమూ లేకపోయినా వ్యాధి ఏర్పడుతుంది. అయితే, రక్తనాళములు శరీరంలో అన్ని ప్రదేశములలోనూ పోతవి కదా ? జీవకణములు అన్ని ప్రదేశములలోనూ ఉన్నవికదా ? అందుచేత లోపం అంటూ ఏర్పడితే, అన్ని ప్రదేశములలోనూ ఏర్పడాలి కదా ? అట్లా ఏర్పడకుండా లివరో, హృదయమో, మెదడో, ఒక అవయవమో, ఒక చిన్న భాగమో, ఉపాంగమో మాత్రమే ఏర్పడి మిగతాభాగములు బాగా ఎందుకు ఉండాలి ? ఎవరిలో అజీర్ణవ్యాధి ఆరంభిస్తుంది ? ఎవరిలో హృద్రోగం ఆరంభిస్తుంది ? ఎవరికి మతి చెడుతుంది ? ఎవరికి కేన్సరు పుడుతుంది ? ఎవరికి ఏరోగమూ లేకుండా సదారోగ్యంతో దీర్ఘజీవితం సాగిపోతుంది ? ఈ ప్రశ్నలకు జవాబుచెప్పే స్థితికి ఆధునిక వైద్య విజ్ఞానం ఇంకా రాలేదు. దానికి కారణం యోగశాస్త్రం చెబుతుంది. అయితే, అందుకు నికరమయిన నివారణం, ఆ శాస్త్రం సూచించినా, ఔషధాలలాగే ఆ నివారణమార్గములూ పరిమితమయిన విజయాన్నే పొందుతున్నవి.

ఆధునిక శరీరశాస్త్ర విజ్ఞానం, రోగ విజ్ఞానమూ, రోగంవల్ల శరీరధాతువులలో ఏర్పడే సూక్ష్మవికృతులను వివరించినంతగా, రోగకారణములను వివరించలేదు. అల్లాగే రోగవిభేదకారణములనూ వివరించలేదు. గనోరియా ఉన్నవారితో సంపర్కం గనోరియావ్యాధిని కలిగిస్తుంది అంటుంది ఆధునిక వైద్యం. ఇల్లా ఒకరినుండి ఒకరికి వచ్చే ఈ వ్యాధి. మొదటి రోగికి ఎల్లావచ్చింది ? అంటే ఆధునిక విజ్ఞానంలో జవాబు లేదు. వచ్చినప్పుడు కఠినపథ్యములు నిషేధములు లేకుండా శీఘ్రకాలంలో నివారించే ఔషధములను మాత్రం ఆధునిక వైద్య విధానం కనిపెట్టింది. కనుకనే ఆ వైద్య విధానానికంత ప్రచారం వచ్చింది.

జీవకణంలో జరిగే సంక్లిష్ట కార్యక్రమమును అర్థంచేసుకుంటానికి ఆధునిక విజ్ఞానవేత్తలు నిరంతరకృషి చేస్తున్నారు. జీవకణంలో ఏం జరుగుతున్నదో అదే శరీరం అంతటిలోనూ జరుగుతున్నది. వటవృక్షభాగాలకు కారణభూతములయినవన్నీ వటబీజంలో ఉన్నట్లే శరీరభాగాలకు కారణములయినవన్నీ జీవకణములలో ఉన్నవి. అందులో ప్రధాన కార్యక్రమానికి అగ్నీ, విద్యుచ్ఛక్తి కారణములు. అయితే ఈ రెండూ జీవకణంలో ఉత్పత్తికావడానికి కారణం అక్కడే లేదు. అది బయటనుంచి వచ్చే ప్రాణవాయువువల్ల ఏర్పడుతున్నది. ఈవిధంగా జీవకణము ప్రకృతిమీద ఆధారపడుతున్నది. జీవకణ విజ్ఞానము అందులో జరిగే భౌతిక రసాయనిక వికృతులతో అంతంకాదు. జీవకణంలోకి అనేకవస్తువులు ఎల్లా వచ్చి ఎల్లాపోతవో తెలుసుకోవాలి. ★

నిండిన జీవితకలశం

9వ పేజీ తరువాయి

'లేదు సీతా లేదు! .... కరగిపోయాడు .... అది సరేకాని ఇవేళ శివరాత్రి. అదైనా జ్ఞాపకం ఉందా? స్వామి దర్శనం చేసుకువద్దాం—పద.'

'సాంబశివా! ....' అంటూ భక్తకోటి కదలి పోతోంది.

'మన బాబు వస్తాడా....'అనడిగింది ఆశగా? సీత.

'తప్పకుండా .... త్వరగా బయలుదేరు మరి—.'

'నేను రాను .... నాబాబు వస్తే రోజూ వచ్చి దండం పెడతాను—కావలిస్తే మీరు వెళ్లండి.'

ఆమెకు ఎంత తోస్తే అంత—ఇంక వాదించి లాభంలేదు — కారణాలు చెవికెక్కవు. చొక్కా తొడుక్కొని ఒక్కడే బయలుదేరాడు.

జనం తండోపతండాలుగా వెడుతున్నారు. ఆడ, మగ, పిల్లలు—అంతా—కొందరు రెండెడ్ల బళ్లమీద గలగలమని కదలిపోతున్నారు. వింతలు, విశేషాలు మాటల్లో దొర్లి ఉత్సాహాన్ని ఉరికింప చేస్తున్నాయి. శంకరం దృష్టి పిల్లలమీదికే పోయింది. ఎంతమంది బాలురు! బాలికలు! .... అదృష్టాన్ని అందిపుచ్చుకున్న తలిదండ్రులు ఆ గుంపులో ఎందరు! .... కాని, తను ఏకాకి— సీత కూడా అంతే. ఇద్దరూ కలిసినా మిగిలేది ఏకత్వమే! ఒకే లోపంతో, ఒకే బాధతో మన సులో మమకారాన్ని ఘనీభవింపజేసే ఏకత్వం! .... ఛేదించలేని కోటలాంటిది. ఈ ఒంటరితనం మను ష్యుల సంఖ్యమీద ఆధారపడదు.

శంకరం ఆలోచనల్ని అదుపులో ఉంచి వడివడిగా నడిచాడు. రకరకాలైన బజారాలు, బెలూనులు, బొమ్మలు, డోలుబళ్లు, అదో పిల్లల ప్రపంచం. అన్నింటిని వింటూ, చూస్తూ నడుస్తున్నాడు. దూరంగా శివుడి గుడిగోపురం గర్వంగా తలెత్తి చూస్తోంది.

'నాన్నా! .... నాన్నా!' అంటూ ఎవరో అతని పంచె పట్టుకున్నారు.

శంకరం ఉలిక్కిపడి వెనక్కి తిరిగాడు. అయి దేళ్ల అబ్బాయొకడు అతన్ని ఆపివేశాడు. ఆశ్చర్యం లోంచి తేరుకొని, నిజానిజాలు తెలుసుకునేలోగా ఎవరో వచ్చి అతన్నెత్తుకున్నారు.

'చేయి విదలించుకుని ఎక్కడికిరా పరుగెడు తున్నావ్ గాడిదా?' అంటూ ఆ వ్యక్తి చెవి మెలి పెట్టాడు. ఆ అబ్బాయి తండ్రై ఉంటాడు.

'నాన్నా! .... నాన్నా! ....' అన్న పిలుపు శంకరం చెవిలో ప్రతిధ్వనించింది.

ఎంత తియ్యటి పిలుపు! ఈ పిలుపుకోసమే తను ఇరవై ఏళ్లుగా ఎదురుచూస్తున్నాడు.

నెమ్మదిగా నడుద్దా మనుకున్నా, భక్తిపార వశ్యంతో కదలిపోతున్న ఆ జనప్రవాహం 'నీల కంఠా' అంటూ అతన్ని ముందుకు నెట్టుకు పోయింది.

లక్కపిడతలు .... ఎర్రగా, నిగనిగ లాడుతూ చిన్నపిల్లల్ని ఆకర్షిస్తున్నాయి. శంకరానికి హఠా త్తుగా జ్ఞప్తికొచ్చింది.

ప్రతిశివరాత్రికీ ఓ బుట్టెడు లక్కపిడ తలు తీసికెళ్లటం అలవాటు. సీత అవన్నీ బాబు కోసమే నంటుంది.

'చూడండి! .... ఆడదానిలా లక్కపిడతలతో ఆడుకుంటా నంటున్నాడు. చివరికి వంటవాడై పోతాడు ....' అంటుంది సీత.

'ఆడదానిలా ఆడుకునేవారంతా వంటవాళ్లవు తారా ఏమిటి? .... అయినా నీ కొడుకు నల భీముల్ని మించిపోతాడులే!' అని ఊరిస్తా డతను.

రూపాయిచ్చి బుట్ట తీసుకున్నాడు.

పక్కనే ఓ ముసిల్ది — చిన్నపిల్ల—తన వస్తు వును ఎవరో దొంగిలించి తీసుకుపోతున్నట్టు శంకరం చేతిలో ఉన్న బుట్టకేసి చూపింది.

'బామ్మా! .... అవి నాకూ కావాలి!' అంది కళ్లు మరింత పెద్దచేస్తూ.

ముసిల్దానికి నడిచేందుకు, ఇంటిపనులు చేసేందుకు వంటో శక్తిలేకపోయినా మనవరాల్ని దబదబ బాదేందుకు మాత్రం కావలసినంత బలం ఉంది. ధారగా కళ్లవెంబడి కారుతున్న నీటిని చూసి అతను చలించిపోయాడు.

"ఏమండీ! మీ అబ్బాయికి మాటలువచ్చాయా?"

"రావటమా! వాడి నోరు ఎలా మూయించాలో తోచక చస్తుంటే"

వి. సుబ్బారావు (నిడుబ్రోలు)

చావ బాదేందుకూ్కడా ఈ లోకంలో పిల్ల లున్నారా?

'ఇంద .... ఏడవకు .... ఈ పిడతలు తీసుకో!' అంటూ బుజ్జగించాడు.

ముసిల్ది మందహాసంచేసింది.

'మీ పిల్లలు చల్లగా ఉండాలి బాబూ!' అంది ఆనందంతో.

శంకరం ముందుకి సాగిపోయాడు.

ముసిల్దాని చివరి మాటలు చెవుల్లో ప్రతి ధ్వనిస్తే పదే పదే నవ్వొచ్చింది.

తన కసలు సంతానం లేదు. తన 'పిల్లలు' చల్లగా ఉండాలిట! .... అందులోఉన్న బాధా పూరిత హాస్యాన్ని తలుచుకుని, వికటంగా, పెద్దగా, శివుడుకూడా అదిరిపడేలా నవ్వాలనిపించింది.

రంగురంగుల తోరణాలతో, దీపాలతో, అందంగా తయారైన రథం దగ్గరై దూరమైంది. ఆగుంపులో ఎందరో పిల్లలు—ప్రతి ఒకరూ సీత దృష్టిలో మెదిలే బాబులా కనిపించారు. అతనికి ఒక్కసారిగా భయంవేసింది. ఇంకా గబగబ నడుస్తూ సందడికి దూర మయ్యాడు. కదలి కకు దూరమై నిశ్శబ్దంలో, నిర్జనప్రదేశంలో ప్రవేశించాడు. తిర్నాపు హడావుడి మరో దేశంలో జరుగుతున్న యుద్ధం తాలూకు శబ్దంలా వినపడింది.

శంకరం ఓ బండరాతిమీద చతికిలబడ్డాడు. తనకోసం, లక్కపిడతలకోసం సీత ఎదురు చూస్తూ ఉంటుందన్న తలపుమొలకెత్తలేదు.

ఉన్నట్టుండి వీధి దీపాలు ఆరిపోయాయి.

కన్ను పొడుచుకున్నా కనిపించని చీకటి. ఆ సమయంలో అదే బాగుం దనిపించింది.

ఈ ఇరవై సంవత్సరాలదాంపత్య జీవితానికి ఫలితం? .... ఏమీలేదు. ఉదయం తొమ్మి దింటికి బడికి వెడితే సాయంత్రమే ఇంటికి తిరిగి రావటం.

'శంకరం మేష్టారు చాలా మంచివారు. ఎవర్నీ కొట్టరు' అని మెచ్చుకునే విద్యార్థులకు నిజాన్ని తెలుసుకునే శక్తి లేదు.

అలా ఎంతసేపు కూర్చున్నాడో అతనికే తెలి యదు. దూరంగా తిర్నాపు జనం చేస్తున్న రొద వినిపిస్తూనే ఉంది. ఈపాటికి శివుడి రథం కదిలే ఉంటుంది.

పక్కన ఏదో అలికిడైంది.

గమనించలేదు. నిశ్శబ్దంలో ప్రకృతి భయ పెట్టడం సహజం.

మళ్లీ అలికిడైంది. ఈమా రది మిధ్యకాదు. ఏదో ఆకారం కదలివచ్చి అతనిముందు నిలి చింది..... చీకటిని చీల్చివేస్తూ చూశాడు.

'ఎవరది? ....' అనడిగాడు.

'నాన్న! .... మా నాన్న! .... ఏడి?'

శంకరం ఉలిక్కిపడ్డాడు. ఎవరో అబ్బాయి. చీకట్లో ముఖం కనపడ్డంలేదు.

'నువ్వు ఇక్కడి కెలా వచ్చావు?'

ఆ అబ్బాయి మాట్లాడలేదు. మనసులో భావాల్ని ముఖంమీద కనుక్కుందామంటే వెలుగు లేదు.

'భయపడకు! .... మీ నాన్నదగ్గరకు నేను తీసికెడతాను' అంటూ నెమ్మదిగా చేరదీశాడు. ఆ పిల్లాడి శరీరమంతా గజగజ లాడుతోంది.

'ఛీ! .... ఎందుకలా ఇదవుతావు? .... మరేం భయంలేదు. నేను మావయ్యననుకో. నేను నాన్న దగ్గరకు తీసికెడతాను.' అంటూ అత న్నెత్తు కున్నాడు. ఎవరిపిల్లాడో ఏమో!

ఉన్నట్టుండి వీధి దీపాలు ఒక్కసారిగా వెలి గాయి.

శంకరంశివుడిగుడివేపు భక్తితో చూశాడు. చీకటితో నిండిన తనహృదయంలో వెలుగు ప్రవేశించిందిగామోలు!

ఆ అబ్బాయికేసి పరీక్షగా చూశాడు. నాలుగై దేళ్లుంటాయి. ఎర్రగా, అందంగా ఉన్నాడు. నూటికి నూరుపంతులు సీత ఊహలోని బాబులా ఉన్నాడు.

భయంతో బెదురుకుని, ఎక్కడికైనా పారి పోయి దాక్కుందామని తాపత్రయపడుతున్న కళ్లు, సిల్కుబట్టలు.

'నాన్న! ....' అని జ్ఞాపకంచేశా డతను.

'అవును .... నాన్నదగ్గరకే! .... పద!' అంటూ పదడుగులు ముందుకు వేశాడు.

ఆ అబ్బాయి తండ్రిని ఈ గుంపులో ఎక్కడని కనుక్కోటం? .... కనిపించిన ప్రతిమనిషిని

తెలుగు పత్రికలన్నిటిలోనూ ఆంధ్రసచిత్ర వారపత్రిక సర్క్యులేషన్ అత్యధికమైనది!

ఇది మీ అబ్బాయేనా ?' అనడుగుతూ వెళ్లటమా ?

ఏం తోచక రెండు నిమిషాలు అలాగే నిలబడ్డాడు.

ఏదో నిర్ణయానికి రాకతప్పదు. ఆ దారంట పోతున్న ఒంటెద్దుబండిని ఆపాడు.

'నాన్న! ...' అన్నాడు కుర్రాడు.

'నాన్నదగ్గరకే వెడుతున్నాం—' అంటూ బండెక్కాడు.

పదిహేను నిముషాల్లో బండి ఇంటిముందు నిలిచింది. బాడుగ ఇచ్చేసి లోపలకు వెళ్లాడు.

సీత దేవుడి పటాలముందు కూర్చుని ఏటో చూస్తోంది. అతనిరాక ఆమెకు తెలియదు.

'బాగానే ఉంది! .... తలుపు బార్లా తెరిచి ఉంచి నీ తపస్సు—ఏ దొంగైనా, ఏదైనా ఎత్తుకుపోతే ఏం చేస్తావ్ ?' అని కసిరాడు.

'నిజమే నండోయ్! .... బాబు హాయిగా నిద్రపోతున్నాడు. వాడి మెళ్లో గొలుసు ఎవరైనా తెంచుకుపోతే ఏం చేయటం ?' అంటూ భర్తకేసి చూసింది.

'ఆ అబ్బా యెవరండి ? ....'

సీతముఖంలో కొత్తవెలుగు కనిపించింది.

'ఎవరో కన్నకొడుకు. దారి తప్పి ఊరిచివర పడివుంటే బుజ్జగించి తీసుకొచ్చాను. అమ్మ, నాన్న ఎవరో తెలియదు. వేలకొలది మనుష్యుల మధ్య ఎవరికని ఇతన్ని వప్పగించటం ? .... అందుకని నెమ్మదిమీద ఆలోచించి ఏదైనా చేద్దామని తీసుకువచ్చాను.

సీత పిచ్చిగా అటూ ఇటూ పరుగెత్తింది. అన్నిగదుల్లోనూ దీపాలు వెలిగించింది. శివుడి గుడి ఉన్నదిక్కుగా అర్థనిమీలిత నేత్రాలతో, ఆనందంతో, అంజలి ఘటించింది. శంకరం అర్థంకాక అయోమయంగా చూశాడు.

'ఏవిటీ వెర్రి వేషాలు ?' అనరిచాడు.

'అయ్యో! ఇంకా తెలియలేదటండీ మీకు ? మన నోములు ఫలించాయి. ఆ శంకరుడు మనమొర విన్నాడు. మనింట్లో దీపాలు వెలిగాయి .... అలా చూస్తారేవండి? ఇరవైఏళ్లుగా చేస్తున్న తపస్సు ఈనాడు ఫలించింది.'

'నీ మాటలు నాకేం బోధపడటంలేదు.'

'అర్థంకాదు. అదృష్టం ఒక్కసారిగా కలిసి వస్తే నమ్మలేరు. మీరు తీర్థానికి వెడుతున్నప్పుడు అన్నమాటలు నిజమయ్యాయి.' అంటూ ఆ అబ్బాయిని లాక్కుని గుండెలకు హత్తుకుంది. పదే పదే ముద్దుపెట్టుకుంది. కళ్లవెంబడి ఆనందబాష్పాల పరంపరలు — శంకరం దిగ్భ్రమనుండి తేలుకుని, పరిస్థితుల కుడి ఎడమలు పరిశీలించాడు. అమాయకత్వం కోపానికి దాస్యం చేయదు. జాలితో, తర్కంతో లొంగదీయాలి.

'సీతా! .... నీ బాధ నాకు తెలుసు. కాని ఆ అబ్బాయి నీకొడుకు కాడు. అతన్ని కన్న తలిదండ్రులు ఎక్కడో ఉన్నారు. వెదకి అప్పగించే భారం మనమీదుంది. రేపే పేపర్లో వేయిస్తాను. పోలీసుస్టేషనులోకి రిపోర్టు ఇస్తాను.'

సీతకళ్లు రెండూ కోపంతో గుప్పుమన్నాయి.

'హోరు మూసుకోండి! .... అర్థంలేని ఆలోచనలూ, మీరూ — దేవుడు మనకు ప్రసాదించిన

నిండిన జీవితకలశం

వరం ఇది. నా బాబును మరొకరికి వప్పజెప్పటమేమిటి ? ఎవరైనా వింటే నవ్విపోతారు. అతనికి వేరే తలిదండ్రులు లేరు. మనమే అన్నీ. నేను కలలు కన్న బాబు అతనే!'

అతన్ని మళ్లీ గుండెలకు దగ్గరగా అదుముకుంది. అసలే జడుసుకున్న అతను మరింత బెజారైపోయాడు. శంకరం ఆమెకేసి జాలిగా చూశాడు.

'పట్టి అమాయకురాలివి. తప్పిపోయిన పిల్లాడు దొరికినంతమాత్రాన మనవాడైపోతాడా ? రేపో మాపో, నలుగురూ నిజం కనుక్కుంటారు. ఆ కుర్రాడి తండ్రిమాత్రం ఊరుకుంటాడా ? పోలీసుకు రిపోర్టిచ్చి వెదికిస్తాడు. మనం రుజా

"ఒరేయ్! ఒకగ్లాసులో నీళ్లు ఇవ్వరా" పైబెర్తులో ఉన్న ప్రయాణీకుడు క్రింద బెర్తులో ఉన్న తన మిత్రుణ్ణి అడిగాడు.

"నీమొహంమండా! అన్ని నీళ్ళు త్రాగుతున్నావేమిరా? ఇప్పటికప్పుడే పదిగ్లాసుల నీరు అందించానుకదా" మిత్రుడు విసుక్కున్నాడు.

"ఆనీళ్ళన్నీ నేత్రాగలేదురా! ఈబెర్తుకి నిప్పంటుకుంటే ఆర్పుతున్నానంతే" అతడు అమాయకంగా గొణిగాడు.

కె. మోహన్ (గుంటూరు)

మార్గంలో నడుచుకుంటే, సంఘం, చట్టం క్షమించి వదిలేస్తాయి.'

సీత నవ్వి ఊరుకుంది.

అంటే, ఆమె అభిప్రాయం ఇంక మారదు. మైలురాయిలా స్థిరత్వం పొందింది. ఆమెను తప్పించటం మెలాగో అతనికి తెలిసిందికాదు.

అంతవరకూ మౌనంగా ఉన్న ఆ అబ్బాయి మా నాన్నదగ్గరకు తీసికెళ్లండి' అన్నాడు.

'నాన్నారు అరుగో! .... వారే బాబూ!' అంటూ శంకరాన్ని చూపెట్టి బుజ్జగించింది. చిన్న పిల్లల్ని మోసగించటం సులభమైనా, ఎవరో దారంట పోయే దానయ్యను చూపెట్టి 'ఇతనే మీనాన్న' అంటే ఎలా నమ్ముతారు ?

'మీ నాన్న ఎక్కడున్నాడు?....'

'తీర్థంలో నన్నొదిలేసి ఎక్కడికో వెళ్లిపోయాడు. తరువాత నన్నెవరో ఎత్తుకుపోయారు'

శంకరానికి కొద్దిగా అర్థమైంది.

'నీ పేరు?....'

'బాబు ....'

'అవును — అతని .... పెండవాంలెదు. ఆ శివుడే నా దగ్గరకు పంపాడు.' అంది సీత.

'కాదు — బాబు నీ కొడుకు కాడు. అనవసరంగా వెర్రి ఆశలు పెట్టుకోకు. మనకు సంతానయోగం లేదు. మనం ఒకరొకరు చూసుకుంటూ బతకాల్సిందే!'

శంకరం కాస్త కఠినంగా, మాటిగా హెచ్చరించాడు.

సీత మాట్లాడలేదు.

తటాలున లేచి, దొడ్డితలుపు తీసుకుని పరిగెత్తింది. ఈ హఠాత్పరిణామానికి కారణం ఊహించలేకపోయినా ఏదో వైపరీత్యం జరగున్నదనిమాత్రం తోచిం దతనికి. ఆమెను మెరుపులా వెంబడించాడు. బావిలో ఉరకబోతున్న సీతను ఆఖరిఅడుగున పట్టుకున్నాడు.

'నన్ను వదలండి .... నేను ఛస్తాను. బాబు నావాడు కాడని, సంతానయోగం లేదని మీరే అన్నారుగా! ఇంకా నేనెందుకు బతికి ఉండటం?' అని విదలించుకోబోయింది. వెయ్యి ఏనుగుల బలం ఆ విదలింపులో ఉంది. ఆలోచించేందుకు వ్యవధి లేదు. మనస్సులో ఆశలకు ముందు స్థిరత్వం కలిగించాలి.

'సరే సీతా! .... బాబు నీవాడే! .... రా! పోదాం.'

'నిజంగానా ? .... '

అవు నన్నట్టు తల నిలువునా ఆడించాడు.

సీత తిరిగి వచ్చింది. బాబు కిటికీదగ్గర నిలబడి బయటకు చూస్తున్నాడు. శంకరం వచ్చే ప్రమాదాన్ని ఎదుర్కోటానికి సిద్ధమయ్యాడు. బాబును సీతనుండి వేరుచేయటం సాధ్యంకాదు.


* * *

ఏదైనా వస్తువుమీద మమకారం కలిగి, అది దొరక్కపోతే మతన్నా చెడుతుంది. విరక్తన్నా చుట్టుకుంటుంది. సీతకు పూర్తిగా మనస్తిమితం తప్పకపోయినా, దానికి కొంచెం దూరంలో ఉందని శంకరానికి తెలుసు. ఆమెలో ఎన్ని లోపాలున్నా, మనస్ఫూర్తిగా ప్రేమించాడు. అందుకే కర్తవ్యానికి కూడా జంకాడు, అంతేకాదు. మానవుడు తన అభిప్రాయాల కెన్నడూ స్థిరత్వం యివ్వలేడు. బాబును తనదగ్గరే ఎందుకు ఉంచుకోకూడదన్న ఆలోచన అతనికి కలిగితీరుతుంది.

ఆ మర్నాడు పొద్దున్న సీత స్నానంచేసి, దేవుడి పటంముందు దీపంవెలిగించి, బాబుకోసం గదిలోకి వచ్చింది. అతను హాయిగా నిద్రపోతూ ఉంటాడని, 'నాయనా! చిట్టితండ్రీ! లేవరా' అంటూ తను మేలుకొలుపు పాడాలని ఉబలాటపడింది .... కాని బాబు ఎప్పుడు మేలుకున్నాడో యేమో కాని, కిటికీలోంచి బయటకు చూస్తున్నాడు. తీర్థపుజనం బళ్లమీద ఇళ్లకు తిరిగిపోతున్నారు. ప్రతి వ్యక్తిని అతను పరీక్షగా చూస్తున్నాడు. తండ్రి జాడలకోసం వెదకుతున్నాడుగామోలు!

'బాబూ! .... కాఫీ తాగుతావా ?' అంది జుత్తు నిమురుతూ.

అతను ఉలిక్కిపడ్డాడు. సీతకేసి భయంగా చూశాడు.



నిండిన జీవితకలశం

'నాన్నారు ఆ బండిలో ఉంటారు. తీసికెళ్ళ-మన్నారు' అన్నాడు.

'అలాగే ! .... తప్పకుండా ! ముందు కాఫీ తాగుదువు కాని రా !' అంటూ వంటింటోకి తీసుకపోయింది.

మువ్వల చప్పుడు దూరంనుండి దగ్గరైంది.

'నాన్నారు .... బండిలో .... నాన్నారు' అన్నాడు మళ్ళీ.

శంకరం ఇదంతా జాలిగా చూస్తూ నిలబడ్డాడు.

సీత అతనిముందు చిక్కటి కాఫీ ఉంచింది.... అతను మౌనంగా కూర్చున్నాడు.

'బాబూ ! .... బంగారు తండ్రి !' అంటూ తాగించబోయింది.

'హద్దులుమీరే ఈ ప్రేమ వలను తిరస్కరించాడు.

'సీసీ, పాలు తాగుతావా ? ....'

'ఆ అబ్బాయి నలా ఎందుకు చిత్రవధచేసి చంపుతావ్ ? నీ వెర్రిని నీ దగ్గరే ఉంచుకో' అని కసిరాడు శంకరం.

'పిల్లల పెంపకంగురించి మీ కేం తెలుసండి ? .... ఈ విషయంలో మీరు జోక్యం కలుగజేసుకోకండి. మరో గంటలో దుకాణాలు తెరుస్తారు. మనబాబుకి నాలుగైదు చొక్కాలు, వంట్లాలు — ఆడుకునేందుకు ఏవైనా బొమ్మలు కొనుక్కురండి. రెండు బిస్కట్ల పొట్లాలు, పిప్పరమెంట్లు—అన్నట్టు బట్టలు మంచివి, సిల్కువి కొనుక్కురండేం ! .... ఈలోగా నేను వంటపని మొదలెడతాను.'

శంకరం ఆమె తో వాదించక తనగదిలోకి పోయాడు. వంటింట్లో సీత ఏవేవో కబుర్లు చెబుతోంది బాబుతో — అతను మాట్లాడుతున్నట్టు లేదు. ఈ నాటకానికి పరిసమాప్తి ఎక్కడ, ఏరూపంలో ఉంటుందో అతని కర్థం కాలేదు. అదేం చిత్రమోకాని, ఆ అబ్బాయి ఏడవటంలేదు. నాన్నదగ్గరకు పోవాలని మారాం చేయటంలేదు.

'నాన్నగారి దగ్గరకు తీసికెళ్లండి' అంటూ బాబు పరుగెత్తుకువచ్చి శంకరం ముందు నిలబడ్డాడు. వెనకాలే సీత పరుగెత్తుకొచ్చింది.

'ఈ దొంగ కృష్ణుణ్ణి పట్టుకోటం అసాధ్యంగా ఉందండి ! .... రా బాబూ ! బత్తాయిపండు తిందువుగాని' అని లాక్కుపోయింది సీత — శంకరం నిట్టూర్చాడు.

మరో గంటకు చొక్కా తొడుక్కుని బయటికొచ్చాడు.

అరుగుమీద ఎవరో అపరిచితవ్యక్తి కనిపించాడు. శంకరం అతన్ని పరీక్షగా చూసి 'ఏం కావాలి మీకు ? ....' అనడిగాడు.

'మరేం లేదండి .... నేను పొరుగూరివాణ్ణి - ఈ ఊళ్ళో శివరాత్రి చూసితీరాలని అందరు అంటే చూసిపోదామని వచ్చాను. మేం పదిమంది బండిలో వచ్చాం. నాతో నా కొడుక్కూ ఉన్నాడు. బండి దిగి గుడివైపు నడుస్తుంటే

గుంపులో అతను తప్పిపోయాడు. అతనికోసమే వెదకుతున్నా. ఈ ఇంటి అరుగుమీద కూర్చుని ఏం వెతగ్గలనని అడుగుతారేమో ! .... ఎక్కడని వెతకమంటారు ? ఓ నిర్ణీత ప్రదేశమంటూ లేదు. అతను ఎక్కడున్నాడో తెలియదు. అందు కని ప్రతిఇంటి యజమాన్ని అడుగుతున్నా — పోలీసు రిపోర్టుకూడా యిచ్చాను.'

శంకరం గుండె కలుక్కుమంది. ఆ వ్యక్తికి వంభై ఏళ్ళ కెక్కువ ఉండదు. అతనిముఖంలో విషాదం శాఖలు వేసింది. చేతికి రాళ్ళ ఉంగరాలు, బంగారు రిస్టువాచి, సిల్కు చొక్కా, శ్రీమంతుడై ఉండాలి.

'అలాగా ! .... అయ్యో పాపం !' అని జాలి పడ్డాడు అందరిలాగే శంకరం.

అతని కళ్ళెదుట బాబు కనిపిస్తూనే ఉన్నాడు. అంతరాత్మ చురుక్కున పొడుస్తూనే ఉంది. తప్పిపోయిన అతనికొడుకు బాబే ఎందుకై ఉండాలి ? ప్రతి తీర్థంలోనూ ఎందరో పిల్లలు మాయమవుతూంటారు.

'ఆ అబ్బాయి ఎలా ఉంటాడు ? .... అతని పేరు ?'

ఆవ్యక్తి అరుగుమీదనుండి క్రింద కురికి, పరుగునవచ్చి శంకరంచేతులు రెండూ పట్టుకున్నాడు.

'అతనిజాడ మీకు తప్పక తెలిసే ఉంటుంది. ఎర్రటి శరీరచ్ఛాయ. చూట్టానికి బొద్దుగా, అందంగా ఉంటాడు. వయసు నాలుగు సంవత్సరాలు. మెళ్ళో బంగారు గొలుసుంటుంది. అతని పేరు బాబు—చిన్నవాడైనా మంచి ధైర్యస్థుడు. అనవసరంగా ఏడవడు. ఎవర్నీ చూసి జడుసుకోడు.'

శంకరం అతికష్టంమీద నిలబడగలిగాడు. చివరి ఆశాకిరణంకూడా చీకటిపాల పడింది.

'ఒక్క నిముషం ఆగండి .... మా ఆవిణ్ణి కనుక్కువస్తాను. ఈవిషయమై ఆమె చెవిలో ఏదన్నా పడిందేమో అడుగుతా.' అంటూ ఇంట్లోకి పరుగెత్తాడు. ఆకలివేసింది గాబోలు, బాబు పాలు తాగుతున్నాడు. సీత 'విజయం నాదే' నన్నట్టు శంకరంకేసి గర్వంగా చూసింది. అతను సంగతి వివరించాడు.

'అతని ముఖం చూస్తుంటే గుండె కరిగి పోతోంది. మనం పిల్లల్ని కని పెంచలేదు. కనుక ఆ ఆవేదన ఎలాంటిదో మన కర్థంకాదు. లేని పోని కోరికలు మనకెందుకు ? అన్యాయంగా ఒకరి సొత్తును హరించకూడదు. బాబుని అతనికి నప్పగిద్దాం' అని బ్రతిమాలాడు.

'మీ ఇష్టం వచ్చినట్టు చేసుకోండి. కాని మీరు తిరిగి వచ్చేసరికి నా శవంమాత్రమే కనిపిస్తుంది'—ఒక్కసారిగా ఆవరించిన ఆవేశంతో బాబుని ముద్దుపెట్టుకుంది. గుండెకు హత్తుకుని గగనవిహారం చేసింది.

శంకరం బయటికొచ్చాడు.

'అడిగారా ? .... ఇంటావిడ ఏమంటోంది ?' అనడిగాడు ఆ వ్యక్తి ఆశగా.

'ఆవిడ తనకేం తెలియదంటోంది. మీరు వెదకిచూడండి. తప్పకుండా కనిపిస్తాడు.'

'నా అదృష్టం ఎలా ఉందో ఏమో మరి. ఈ అడ్రసు మీ దగ్గరుంచుకోండి. ఏమైనా కబురు తెలిస్తే అందజెయ్యండి' అంటూ కాళ్ళీడ్చుకుని అతను కదలిపోయాడు. పొంగుతూన్న దుఃఖాన్ని అతి కష్టంమీద శంకరం ఆపగలిగాడు.

సీత పంచభక్ష్యపరమాన్నాలతో బాబుకి అన్నం వడ్డించింది. అతను ఏదో తిన్నాడు. సిల్కు బట్టలు తొడిగి సింగారించింది. కళ్ళకు కాటుక పెట్టింది. ముఖానికి పౌడరు అద్దింది. ఎర్రటి జోళ్ళు తొడిగింది.—చైతన్యరహితమైన ఓ బొమ్మకు ఆమె చేస్తున్న అలంకరణను చూస్తూ మౌనంగా కూర్చున్నాడు శంకరం. బరువుగా అడుగులువేస్తూ నడుస్తున్న అతని తండ్రి రూపం కళ్ళముందు కదలి, శరీరంలో ప్రతి అణువునూ ఆడించివేసింది.

రెండు శిఖరాలమధ్య అతను చిక్కుకున్నాడు. ఎటూ చేరుకోలేడు—మధ్య ఉండనూలేడు.

ఇద్దరు వ్యాపారస్తులు కలసి పెట్టిన దుకాణంలో ఒక గుమాస్తా డబ్బు కాజేస్తున్నట్లు తేలింది.

"ఆ వెధవను పోలీసులకు అప్పగిస్తేగాని రోగం కుదరదు" భాగస్వాములలో ఒకడు అన్నాడు.

"ఒరేయ్ ! అదేం మాటరా. మనంమాత్రం అలా పైకివచ్చిన వాళ్ళంకాదూ!" రెండవవాడు గతాన్ని జ్ఞాపకం చేశాడు.

'మన అబ్బాయిని అలా షికారు తీసికెడదామా?' అనడిగింది.

'తప్పకుండా ! .... అతన్ని కన్నారికి అప్పగించి, మనం తిన్నగా శ్రీకృష్ణజన్మస్థానానికి పోదాం' అన్నాడు.

అతని అభిప్రాయం అర్థం చేసుకున్న సీత మరి మాట్లాడలేదు.

'బాబూ ! .... నీ మెళ్ళో గొలుసు ఉండేదా ?' —ఆ చిన్నసందేహాన్నికూడా నివృత్తి చేసుకుందామని అడిగాడు.

'ఉండేది. ఇప్పుడు లేదు. ఎవరో—మరో— దొంగ తెంపుకుపోయాడు.'

'అతను ధైర్యస్థుడు. అనవసరంగా ఏడవడు' అన్న తండ్రి వాక్యాలు తిరిగి వినిపించాయి.

* * *

రెండు రోజులుగడిచాయి.

నాన్నదగ్గరకు పోవాలని బాబు అంటూనే ఉన్నాడు. సీత అనునయిస్తూవచ్చింది. మూడోనాడుదయం బాబు పక్కమీదే పడుకున్నాడు.

'ఒళ్ళు వెచ్చగా ఉంది—' అంది సీత.

శంకరం ఏదో వైపరీత్యం వచ్చితీరుతుందని ఎదురు చూశాడు.

'ఏం వచ్చినా, ఫలితం అనుభవించి [redacted].' అన్నాడు.

సీత ఏవో మందులు చేసి తాగించింది. [redacted] రాత్రానికి జ్వరం ఎక్కువైంది.

'నాన్నారి దగ్గరకు తీసికెళ్ళరా ? ....' [redacted] గాడు జాలిగా బాబు.

'తప్పకుండా ....' అన్నాడు శంకరం

'నా బాబుకి దిష్టి తగిలింది .... అందుకే ఈ మాయదారిజ్వరం వచ్చిపడింది.' అంటూ దిష్టి తీసింది.

'దిష్టి తగలటానికి బయటివా రెవరూ చూడ లేదుగా !' అనడిగాడు శంకరం.

'మనకళ్ళు చాలవా ? ....' అని సంబరపడింది.

అర్ధరాత్రి శంకరం మేలుకున్నప్పుడు దీపం వెలుగుతూనే ఉంది. సీత బాబుమంచంపక్కన నేలమీద కూర్చుంది. అతను వెళ్ళి వంటిమీద చేయివేసి చూశాడు. చురుక్కుమంది. బాబు నిద్రపోవటంలేదు. మధ్యమధ్య కళ్ళు తెరచి అటూ ఇటూ బెదురుగా చూస్తున్నాడు.

'బాబూ ! .... బెంగ పెట్టుకోకు. నేనే అమ్మననుకో—ఆయనే నాన్నారు. పాతదంతా మర్చిపో! నీకు ఏం కావలిస్తే అది కొనిపెడతాను. చిన్న మోటారు కావాలా ? సైకిలు కావాలా ? .... ఏయేబొమ్మలు కావాలి ? బిస్కట్లు, పిప్పరమెంట్లు, చాకలేట్లు ....' అంటోంది ఆమె.

'సీతా ! .... ఇదేం బాగాలేదు. ఆ అబ్బాయి తండ్రి అడ్రసు నాదగ్గరుంది. రేప్పొద్దున్న వెళ్ళి అప్పగిస్తాను. తరువాత పశ్చాత్తాపపడి లాభం లేదు—చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టు.'

'మీ రలా చేస్తే ఏం జరుగుతుందో ముందే చెప్పాను. తరువాత మీ ఇష్టం.'

ఇంక ఆమెతో వాదించి లాభంలేదు.

మర్నాడుదయం జ్వరంతీవ్రత అలాగే ఉంది. శంకరం డాక్టర్ని తీసుకొచ్చాడు. అతను పరీక్షించి మాదిపాడిచాడు.

'ఎవరండీ ఈ అబ్బాయి ?' అనడిగాడు డాక్టరు.

'మా బంధువుల తాలూకు—పెంచుకుందామని తీసుకువచ్చాను' అంది సీత.

డాక్టరు మందు పంపిస్తానని వెళ్ళిపోయాడు.

అరుగుమీద కూర్చుని శంకరం కర్తవ్యం ఆలోచించాడు. గత రెండురోజులుగా అతను బడికి వెళ్ళలేదు. ఆనాటికూడా సెలవు చీటీ రాసి పంపాడు. బాబు తండ్రి ఏదో ఏదో ఒకనాడు నిజం కనుక్కోకపోడు. అప్పుడు 'శైలువాసం' తప్పదు. ఇరుగు పొరుగువారు మాత్రం ఊర్కుంటారా ? పునాదులు తవ్వుతారు. 'చుట్టాలి తాలూకా' ని సీత తేలిగ్గా అనేసింది. కాని, నిజం దాగదు. బెంగపెట్టుకుని బాబుప్రాణాలు వదిలేస్తాడన్న భయం ఒక్కసారిగా ఆవరించింది. తనకు ఎలాగూ పిల్లలు లేరు మరొకరి సొత్తును అపహరించి అనుభవించే దేవిటి ? .... చరచర లోపలకు వెళ్ళాడు.

'నేను బడికి వెడుతున్నా — డాక్టరు మందు పంపుతాడు — బాబుకు వేళ తప్పకుండా ఇవ్వాలి. జాగ్రత్తగా చూస్తూ ఉండు. ప్రమాదిస్తే మాత్రం డాక్టరుకు కబురంపు.'

'బాబు కిలా ఉన్నప్పుడు బడికెందుకండీ వెళ్ళటం ? సెలవు పెట్టకూడదూ ?'

'వీల్లేదు' అని బయలుదేరాడు.

బడికి కాదు. బస్సు స్టాండుకు.

* *

పన్నెండు గంటలకు శంకరం వెళ్ళేసరికి, బాబు తండ్రి అరుగుమీదే ఉన్నాడు.

'రండి ! .... రండి ! .... ఆనాడు మిమ్మల్ని చూసినప్పుడే అనుకున్నా. తప్పకుండా వస్తారని. వాళ్ళాడా కొన్ని వివరాలు తెలిశాయి. మా అబ్బాయి తప్పిపోయిన మర్నాడు పోలీసులు ఓ దొంగను పట్టుకున్నారు. వాడి దగ్గర బాబు గొలుసు దొరికింది. అబ్బాయిని ఊరి బయట వదిలేసినట్లు [illegible] ఉన్నా [illegible]

[illegible] మా అబ్బాయి ప్రస్తుతం మా యింటో ఉన్నాడు.'

శంకరం ఇంకా ఏదో చెప్పబోతుంటే, విని పించుకోక అతన్ని లాక్కుంటూ లోనికి పరుగెత్తాడు.

'ఏమే ! .... బాబు దొరికాడు. దొరికాడు' అనరిచాడు.

మంచంమీద పడుకున్న అతని భార్య లేచి కూర్చుంది. ఇంచుమించు శంకరం కళ్ళకు ఆమె సీతలాగే కనపడింది.

'ఈయన ఇంట్లో ఉన్నాడుట .... చూడండి ! వెళ్ళిననాటినుండి ముక్క పిడి ఎరుగదు. అలాంటిది, బాబు తప్పిపోయాడని తెలియగానే మంచంపట్టింది. ఒక్కగా నొక్కకొడుకు. పంచప్రాణాలూ అతనే మాకు' అన్నాడతను.

'మరో వారం రోజులకు నా తండ్రి కనిపించక పోతే నేను బతికి ఉండను. మీరు దేవుడిలాంటివారు. మాకు వెలుగు చూపించారు.' అంది బాబు తల్లి.

'నిజం ! .... మీరు నిజంగా ఆ నీలకంఠులే !' అంటూ శంకరం చేతులు రెండూ పట్టుకుని కృతజ్ఞత వెల్లడించాడు బాబు తండ్రి.

'వెంటనే బయలుదేరండి....పోదాం — అతనికి కొద్దిగా జ్వరంగా ఉందికూడా.' అని హెచ్చరించాడు శంకరం.

భార్యను జాగ్రత్తగా ఉండమని హెచ్చరించి బయలుదేరాడు.

* * *

బాబుతండ్రితో శంకరం బస్సు దిగేసరికి అయిద్దైంది.

కిళ్ళీకొట్టు దగ్గర ఇద్దరునిలబడి కబుర్లు చెప్పుకుంటున్నారు.

'ఆ అబ్బాయికి నాలుగేళ్ళుంటాయట. రెండు రోజులుగా ఒక్కటే జ్వరమట, మధ్యాన్నం పోయాడు.'

నిండిన జీవితకలశం

'అలాగా ! పాపం ! .... రెండు రోజుల జ్వరంతో పోయాడంటే ఏదో కారణం ఉండితీరాలి.'

'ఎవరికోసమో బెంగపెట్టుకున్నాడట !'

శంకరం కాళ్ళు తేలిపోయాయి. కూడా వస్తున్న బాబు తండ్రి ఆ సంభాషణ విన్నట్టు లేదు. అతని కేంచేయాలో పాలుపోలేదు. అతను విన్నమాటల్లో అబ్బాయి నిజంగా బాబైతే తను తండ్రికి ఏం సమాధానం చెప్పాలి ? చంపింది తనేనని అంతరాత్మ చెబుతుంది. కాని దానికి నోరు లేదు కనుక పైవార్ని నమ్మించలేదు. కాని జీవితాంతం తనను దొలిచివస్తుంగి

"బెజవాడకు $1\frac{1}{2}$ టిక్కెట్లు ఇవ్వండి" మనమడితో వచ్చిన తాతగారు టిక్కెట్లు ఇచ్చే గుమాస్తాకు డబ్బు ఇచ్చి అడిగారు.

గుమాస్తా తాతగారి వెంట ఉన్న కుర్రాణ్ణి ఎగాదిగా చూసి "ఆ కుర్రాడు పొడుగు లాగు తొడుక్కున్నాడు గదా! అర టిక్కెట్టు తీసుకుంటారేం. నిండు టిక్కెట్టు తీసుకోండి" సలహా చెప్పాడు.

"బావుందిసీ సలహా! ఆ లెక్కన నేను అసలు టిక్కెట్టే తీసుకోనక్కరలేదు." తాతగారు చమత్కరించారు.

వి. ఆర్. (మద్రాసు)

శంకరం ఇల్లు చేరుకునేసరికి వీధి గుమ్మం దగ్గర సీత కనిపించింది.

ఆమె చేతుల్లో బాబు — అతను తెల్లబోయాడు.

'రండి ! .... మీ కోసమే ఎదురుచూస్తున్నా' అని భర్తను ఆహ్వానించింది.

'సీతా ! .... ఈయనే ఆ అబ్బాయి తండ్రి' అనేలోగా బాబు నాన్నచేతుల్లో ఉన్నాడు. దృశ్యాన్ని ఆనందపారవశ్యంతో సీత చూస్తుంటే, శంకరం అయోమయంగా చూశాడు. ఏమిటీ మార్పు ? .... ఎడారి ఒక్క క్షణంలో పూలతోటైనట్టు—రెండునిమిషాలు గడిచాయి.

'జ్వరం వందడిగ్రీలకు పైనే ఉంటుంది.... డాక్టరుకు చూపించి మందిప్పిస్తున్నాం. మీరు లోపలకు రండి' అంది సీత.

'నన్ను క్షమించండి. మీ ఆదరణను తిరస్కరిస్తున్నా ననుకోవద్దు. బాబుకోసం మా ఆవిడ క్షణ మొకయుగంలా ఎదురుచూస్తూ ఉంటుంది. బెంగపెట్టుకోటంవలన వచ్చిన జ్వరమే ఇది... కంగారుపడేందు కేమీ లేదు. రేపటికి నవ్వుతూ కులాసాగా ఉంటాడు. అదీకాక, ఆఖరిబస్సు ఏడింటికి—కనక నేను సెలవు తీసుకుంటాను.... మీ రిద్దరగా ఉమా శంకరులు. అందులో సందేహం లేదు. అందుకే నా బాబును ఆదరించి, సంరక్షించి నాకు అప్పగిస్తున్నారు. మీ రుణం జన్మజన్మాంతరాలకు తీర్చుకోలేను..... బాబు జ్వరం తగ్గటంతోనే, ముగ్గురం కలిసి మిమ్మల్ని కలుసుకునేందుకు వస్తాం .... బాబూ ! .... పెదనాన్నకు, పెద్దమ్మకు దండంపెట్టు' అన్నాడు.

జ్వరంతో ఉన్న బాబు చిన్నగా నవ్వాడు.

'పోలీసులకు ఈ విషయం తెలియజేయండి.... లేకపోతే వాళ్ళు అనవసరంగా వెదకుతూంటారు.' అని హెచ్చరించాడు శంకరం. బండి కట్టించి సాగనంపాడు.

సీత కళ్ళు తుడుచుకుంది.

'అది సరేకాని' సీతా ! .... బాబును వదులుకోటంకంటే, నూతిలోపడి ప్రాణాలు వదిలేస్తా నన్నావుగా ! .... ఒక్కసారిగా ఇలా ఎలా మారిపోయావు ?'

సీత నిండుగా, గంభీరంగా, నవ్వింది.

'వివేకమనేది శాశ్వతంగా నిద్రపోదంటారు. నేను మొండిపట్టు పడితే, బాబు దక్కేవాడు కాడు. మనకు ఎలాగూ సంతానం లేదు. మరొకరి రత్నాన్ని బలవంతంగా లాక్కుని మట్టిలో కలపటం మహా పాపం. దాన్ని ఆ శివుడుకూడా సహించడు. ఓ గొప్పపని చేసినందుకు నాకెంతో గర్వంగా ఉంది. పిల్లల్ని కనకపోయినా తల్లి ప్రేమ ఎలాంటిదో నాకు తెలుసు. బాబుకోసం అతన్ని కన్నతల్లి ఎంతగా ఏడుస్తుందో ఊహిస్తే నాకు భయంవేసేది..... మనకు పిల్లలు లేకపోయినా ఫరవాలేదు. ఉన్నవాళ్ళయినా కలకాలం హాయిగా ఉండాలని ప్రార్థించటం మంచిది.' శంకరం ఆమెకేసి చిత్రంగా చూశాడు.

'కాని సీతా ! .... ఎందుకో, మనక్కూడా ఓ బాబు పుడతాడన్న నమ్మకం నాకు కలుగుతోంది.'


సీత ఆమాటలు వినిపించుకోలేదు.

బాబుతో దూరమవుతున్న ఆ బండికేసి మలుపు తిరిగేదాకా చూస్తూ నిలబడింది.

వీధిదీపాలు ఒక్కసారిగా వెలిగాయి.

ఆయేటి శివరాత్రితీర్థం అతని జీవితచరిత్రలో శాశ్వతస్థానం సంపాదించుకుంది.

గళ్లనుడికట్టు - 99




అడ్డం

1. వంటలోవాడే వస్తువు, ఇంపగు వస్తువులో ఉన్నది.
3. వస్తువు.
5. ప్రాసవంటి ముని!
6. కొండ తిరగబడింది.
8. శత్రువు అరికాలుముందే ఉంటాడా?
9. వెనక్కి మండూకము.
11. ఒక పెద్ద బండి తిరగబడింది.
13. శాలాసేవు!
16. వంద—అంటారు.
17. తరిఖ ఎటునుంచి చూసినా మారదు.
19. సామెత కలగాపులగం!
21. కదల.
24. సామ్యము.
26. పత్రికలలో సాధారణంగా చదివేది!
27. విన్నవం.
30. ఇతను కాంచనిచో కవి కాంచునని ప్రతీతి.
32. మిక్కిలి!
34. తండ్రికి తండ్రి.
35. అర.
37. నారికేళములో వింటేతాడు.
38. వేడు మధ్య పొడిగిస్తే జంబువు!
39. ఖరీదు!

నిలువు

1. స్త్రీ, ఇంగువతిని వెదకండి!
2. చేవలు వట్టేది.
3. వరే! ఆరోహణ ముందుగానే!
4. రాశి.
5. కీర్తి.
7. —సంక్రాంతి.
8. శక్తిలేనిస్త్రీ!
10. కనుంమధ్య కొండలమధ్య ఒక ప్రదేశమున్నది.
12. కొంగ.
13. బంగారువట్టణం తలక్రిందులయినా కళ వెళ్లక తప్పదు!
14. నాగౌవము.
15. బంధము.
16. కొయ్యసామానులు ఎక్కడ?
18. కానుక ఏ వైపు?
20. దున్నేపరికరము.
21. చేయువాడు.
22. తతిమా సమూహంముందేనా?
23. కడుపులోనిది.
24. ఆటుతో బాటు వినిపించేది!
25. వంకర చివర తీరమని తెలుసుకోండి!
26. అలవాటు.
28. పొట్టేలు చిందర వందర.
29. అద్దె.
31. వవృద్ధి కూడా కలగాపులగం—వి, గిరిగారిపేరు వెతికిచూడండి.
33. ఈరోజా తలక్రిందులు.
34. మాత్రము.
36. విదియలో స్వర్గము.
37. నీటిమీద తేలుతుంది.

98-వ గళ్లనుడికట్టుకు జవాబు



దారిన వెడుతున్న ఒక సైనికుడు, రోడ్డు పక్క పొలంలో పని చేసుకుంటున్న రైతును పిలిచి "టైమెంత అయింది?" అని అడిగాడు. రైతు తన చేతులోఉన్న పారను భూమిలో దిగేసి, నీడకొలిచి "గం|| 3-30 అయింది" అని చెప్పాడు. సైనికుడు చేతి గడియారం చూసుకుని "భలేగా చెప్పావే! ఆ పారనా కిస్తావేమిటి?" ఆశ్చర్యంలో తలమునకలై అడిగేశాడు.

బి. బ్రహ్మయ్య, (కాకినాడ)

న్యూఢిల్లీ లేఖ

6-వ పేజీ తరువాయి

మహత్తర సమస్యలను పరిష్కరించ గలుగుతారని నమ్మటంకూడా కష్టమే. అందుకే కొత్తగా ఎన్నికైనవారిలో ప్రతిభావంతులకోసం ప్రధాన మంత్రి గాలించటం జరిగింది. కాని పరిస్థితి ప్రోత్సాహకరంగా కనిపించలేదు."

"ఈనాడు మంత్రిపదవి అంటే వెనుకటి కారాగార వాసానికి బహుమతి అనో, పార్టీలో పలుకుబడి సంపాదించగల సామర్థ్యమనో, అవసరమైనవారి మైత్రి సంపాదించటమనో భావించటం జరుగుతున్నది. ఒక్కసారి ఈ బహుమతి లభ్యమైతే సమర్థతతోగాని, నిజాయతీతోగాని నిమిత్తం లేకుండానే యావజ్జీవం ఏదో ఒక పదవిలోఉండే హక్కు ఏర్పడుతున్నది."

"ఇదంతా మామూలు అయిపోయింది. అందుకనే మంత్రిపదవులనుంచి తొలగించబడినవారికి ఇతరత్రా లాభసాటి అయిన పదవులు చూపాలనే భావానికి ప్రజలుకూడా అలవాటుపడిపోయారు."

"దీనివల్ల జరిగే హాని కొద్దిమంది పనికిమాలినవారికి ప్రజల సొమ్ముతో బహుమతులు లభించటం ఒక్కటే కాదు. అసమర్థత వ్యాప్తిచెందటం, రాజకీయ జీవితంలో కట్టుబాట్లను త్రోసివుచ్చటం జరిగి ఎంతో కీడు సంభవిస్తోంది. వీటి ప్రభావం ఇప్పుడిప్పుడే ప్రభుత్వశాఖలమీద కనిపిస్తున్నది."

ఒక పార్టీ విశిష్టత అది తయారుచేసే నాయకులనుబట్టి ఉంటుంది. కాంగ్రెసుపార్టీ ఇప్పుడు గతాన్ని ఆధారంగా చేసుకుని బ్రతుకుతోంది. ఎన్నికలకు సంబంధించినంతవరకూ ఈపార్టీ మళ్లీ అధికారంలోకి ఎలా రాగలిగిందో పరిశీలించటం అవసరం. ఉదాహరణకు, గ్రామాలలో మనుష్య సంపదను సద్వినియోగ పరచుకునేందుకు 200 బ్లాకులలో ప్రయోగాత్మక పథకాలు ప్రవేశపెట్టినట్లు రాష్ట్రపతి తమప్రసంగంలో చెప్పారు. ఓట్ల సంపాదనకు ఇది చక్కని మార్గంఅయింది. సమాజాభివృద్ధి అనీ, పంచాయతీ రాజ్యంఅనీ, మరింకేదో అనీ గ్రామసీమలలో లక్షలాది ధనం గుమ్మరించారు.

సేఠ్ గోవిందదాస్ ప్రసంగంలో హిందీ ప్రస్తావనలేకపోతే అది అసమగ్రంగానే మిగిలిపోయేది. పార్లమెంటులో ఇంగ్లీషుభాష వాడకాన్ని నిషేధించాలని నూతన సభాపతికి ఆయన విజ్ఞప్తి చేశారు.

* * *

కేంద్రపాలనలోఉన్న గోవాకు పంచవర్ష ప్రణాళిక తయారుచేసేందుకని ఆర్థిక, వాణిజ్య, పరిశ్రమల, గనుల, రవాణాశాఖల ఉన్నతాధికారులు, ప్రణాళికా సంఘం ప్రతినిధులు త్వరలో అక్కడకు (గోవాకు) వెడుతున్నారు. ప్రణాళికపై తుది నిర్ణయాలు జరిగాక, దానిని తృతీయ పంచవర్ష ప్రణాళికలో భాగంగా చేరుస్తారు.

అంతా అనుకునే గోవా సిరిసంపదలు నిజానికి వాడకం వస్తువుల దిగుమతులమీద ఆధారపడి ఉండేవి. ఈ సరుకులు చాలావరకు భారతదేశానికి దొంగతనంగా రవాణా అయ్యేవి. జపాన్, జర్మనీ, ఇటలీ దేశాలకు గోవానుంచి ఇనుము, మేంగనీస్ ఖనిజాలు ఎగుమతి అవుతాయి. 1961 లో పోర్చుగీసు పరిపాలకులు గోవానుంచి 13 కోట్ల మార్కుల విలువగల ఇనుపఖనిజం జర్మనీకి ఎగుమతిచేసి, 2 కోట్ల మార్కులు విలువగల వాడకం వస్తువులు దిగుమతి చేసుకున్నారు. 1960 లో గోవానుంచి 55లక్షల టన్నుల ఇనుపఖనిజం ఎగుమతి అయింది. ఇందులో 26లక్షల టన్నులు జపాన్‌కు, 21లక్షల టన్నులు జర్మనీకి, 5 లక్షల టన్నులు ఇటలీకి చేరాయి. 1961లో ఎగుమతిఅయిన 65 లక్షలటన్నుల ఇనుపఖనిజంలో, 35 లక్షలటన్నులు జపాన్‌కి, 19 లక్షల టన్నులు జర్మనీకి, 7 లక్షల టన్నులు ఇటలీకి వెళ్లింది.

గోవా ఖనిజసంపదను క్రమబద్ధంగా త్రవ్వితీయడంతోపాటు అక్కడ ఒక ఉక్కు కర్మాగారాన్ని నెలకొల్పాలని కూడా యోచిస్తున్నారు. అయితే ఈ కర్మాగారానికి బొగ్గు దిగుమతి చేసుకోవలసి వస్తుంది.

గోవాలో పశ్చిమ కోస్తాలోకెల్లా చక్కని రేవు ఉంది. ఇది ప్రకృతిసిద్ధమైనది. దీనిని పెద్దరేవుగా అభివృద్ధిపరచటం, రోడ్డురవాణా వసతులు కల్పించటం మొదలైనవి ముఖ్యంగా పరిశీలించదగు సమస్యలు.

ఈ అభివృద్ధి కార్యక్రమాలన్నీ గోవా ప్రజల ఆర్థిక స్థితిగతులును బాగుపరిచేందుకు మాత్రమే ఉపయోగపడుతాయి. భారతదేశంపట్ల వారి అభిమానం పెంపొందింప జేసేందుకు శాయశక్తులా పాటు బడటం కూడా అవసరం.

* * *

భారతదేశానికి సంబంధించినంతవరకూ చక్కెర పరిశ్రమ ఏడుపుగొట్టుపరిశ్రమగా తయారైంది. సార్వత్రిక ఎన్నికలతో ఈ పరిశ్రమకు సన్నిహిత సంబంధం ఉన్నది. చక్కెర ఉత్పత్తికయ్యే ఖర్చులో నాలుగింట మూడువంతులు చెరుకు కొనుగోలుకే అవుతున్నది. చెరుకు ధరను ప్రభుత్వం నిర్ణయిస్తున్నది. చెరుకు ధర తగ్గితే, మిగతా విషయాల మాట ఎలాఉన్నా తిండిగింజలు పండే భూములను చెరుకుపంట క్రిందకు మళ్ళించడాన్ని నిరోధించే వీలు కలుగుతుంది. కాని కొన్ని రాజకీయకారణాలను పురస్కరించుకుని ప్రభుత్వం చెరుకు ధర తగ్గించదు. 1930—31లో చెరుకుసాగుక్రింద 2905000 ఎకరాల భూమిఉంటే, 1961—62లో దాని విస్తీర్ణం 5578000 లకు పెరిగింది. అంటే 31ఏళ్లలో 2673000 ఎకరాల భూమి అదనంగా సాగులోకి వచ్చిందన్నమాట. ప్రణాళికాసంఘం మొదటినుంచి అట్టే ఇబ్బందిఉండని పంథాయే అనుసరిస్తోంది. తిండిగింజలు పండే భూములను వ్యాపారపంటలకు మళ్లించడాన్ని నిరోధించేందుకు తగుచర్యలు తీసుకోకుండానే చక్కెరఉత్పత్తి లక్ష్యాలను నిర్ణయించింది. ప్రణాళికాసంఘం ఏ ఏటికాయేడు రాష్ట్రాల పథకాలు ఆమోదిస్తూనే ఉంటుందికనుక చెరుకుపంట క్రింద భూమిని పరిమితం చెయ్యాలనుకుంటే చేసివెయ్యవచ్చు.ప్రజల చేత చెరుకుకు విపరీతమైన ధర ఇప్పించటమే కాక, చక్కెర ఎగుమతుల కిచ్చే సబ్సిడీలకు కూడా డబ్బు రాబట్టగలిగినప్పుడు, రైతుకు లాభసాటి అయిన ధరలు తిండిగింజలకుకూడా ఇప్పించటం సాధ్యమే. ★

యువ ప్రపంచం

వరకట్న నిర్మూలనము: ఒక మార్గము

ఈ మధ్య పత్రికలో చాలా మటుకు వ్యాసాలన్నీ - ముఖ్యంగా యువ ప్రపంచం శీర్షికలో—ప్రస్తుత సమస్యల గురించి ఆ విధంగా చేయాలి, ఈ విధంగా చేయాలి, అని చెప్పడమే గాని నిర్మాణాత్మకంగా ఎవరినీ ముందుకు తీసుకోరావటం లేదు. ఆ విధంగానే, వర్ణాంతర వివాహములు మొదలైన వాటి గురించి కూడ చర్చ జరిగింది.

ముఖ్యంగా యువ ప్రపంచం శీర్షికలో నేటి యువకుల సమస్యలు చర్చిస్తున్నారు. దీనినే ఒక సంఘంగా మార్చి, చర్చ వేదికపై చర్చిస్తే విషయంతో ఏకీభవించినవారు, నిర్మాణాత్మక కృషి జరగాలనుకున్నవారు ఆ సంఘంలో సభ్యులుగా చేరవచ్చు. ఆసంఘంలో యువతీ యువకులందరూ సభ్యులు కాబట్టి మిగిలిన అన్ని విషయముల లోను ఏకీభావము కుదిరిన ఎడల వారు కట్నం లేకుండా వివాహం చేసికోడం, వర్ణాంతర వివాహము లకు ముందంజవేయుటంజరుగుతుంది. ఈ విధంగా చేయడంవల్ల, మిగిలిన వారికి మార్గదర్శకులవడమే గాక, వరకట్న పిశాచంచే పీడించబడు తున్న చాలమంది యువతులకు వ్యాయము చేకూర్చిన వారమవు తాము.

ఇటువంటి సంఘంలో సభ్యుడ నగుటకు నాకేమాత్రం అభ్యంతరము లేదు.

కె. వి. ఎస్. సోమయాజులు (కెంగుటూరు)

* * *

ఏవి సమస్యలు?

"యువప్రపంచం శీర్షికకు వచ్చే వ్యాసాలూ, ఉత్తరాలూ కూడా చాలా మట్టుకు 'కాంపోజిషన్' వ్యాసాలను పోలి ఉంటున్నాయి" అని మీరు ఫిర్యాదు చేయడంలో నాకు అర్థం కనబడటంలేదు. 'యువ ప్రపంచానికి సంబంధిచే సమస్యల'ను చర్చించమంటారేకాని ఏసమస్యలను మీరు యువప్రపంచ సమస్యలుగా భావిస్తారో చెప్పనేలేదు. శీర్షిక ప్రారంభంలో సైతము సమస్యల 'స్కోప్'ను మీరు చెప్పలేదు. నిర్దిష్టంగా మీరు వేటిని 'యువప్రపంచ సమస్యలు'గా భావిస్తున్నారో, నిర్వచించనంతవరకు-'సమస్యలను నిర్మోహమాటంగా చర్చించడంగాని, మీరనుకొన్న లక్ష్యం నెరవేరడంకాని జరగదేమో!

ఆర్. యస్. (వాల్తేరు.)



కలకత్తా వాస్తవ్యులు శ్రీ డి. జి. శర్మగారి కుమారుడు చి॥ నరసింహదాస్ ఇటీవల కలకత్తాలోని రవీంద్ర సరోవర్ స్టేడియం హాల్ లో భరతనాట్యం ప్రదర్శించాడు.

రోజుకు రెండు నవలలు

డిటెక్టివ్ నవలా రచయిత ఎడ్గార్ వాలెస్ చాలా త్వరగా నవలలు రాసేవాడని ప్రతీతి. ఆయనదగ్గర ఇద్దరు స్టెనో గ్రాఫర్లు ఉండేవారట. ఉదయం పూట ఒకరికి ఒక నవల 'డిక్టేట్' చేసి, ఆ మధ్యాహ్నం మరొకరికి రెండో నవల 'డిక్టేట్' చేసేవాడట. "టాక్సీ డ్రైవర్‌తో మాట్లాడినప్పుడల్లా కనీసం ఒక్క నవలకు పనికొచ్చే సూచనైనా నాకు లభిస్తుంది" అని ఆయన అనేవాడు.

ఒకప్పుడు వాలెస్‌ను విందుకు పిలవడానికి ఒక ఇల్లాలు

[illegible]

వచ్చిందట. 'బట్లర్' ఆమెను చూచి "శ్రీ వాలెస్ ఇప్పుడే ఒక నవల ప్రారంభించారు. అది పూర్తి అయ్యేవరకూ ఉంటారా?" అని అడిగాడట.

ఎం. లలిత (ఆదోని)

*   *   *

వీర పూజ

సుప్రసిద్ధ రష్యన్ కవి అలెగ్జాండర్ పుష్కిన్ స్మృతి చిహ్నంగా ఆయన శిలా ప్రతిమనొకటి ప్రతిష్ఠించాలని మాస్కో నగర పాలకులు ఒకప్పుడు తీర్మానించుకున్నారు. ఇందుకు చక్కని డిజైన్ కావలసివచ్చి దేశవ్యాప్తంగా పోటీ నిర్వహించారు. బహుమతి చాలా ఆకర్షణీయంగా ఉండటం చేత వేలాది జనం పోటీలో పాల్గొన్నారు. పుష్కిన్ నిల్చున్నట్లు, కూర్చున్నట్లు, గుర్రంమీద స్వారీ చేస్తున్నట్లు, ఒకటేమిటి రకరకాల భంగిమలలో డిజైన్లు వచ్చాయి. బహుమతి నిర్ణాయక సంఘం వారాల తరబడి తర్జన భర్జనలు జరిపి, ఒక డిజైన్ ఎన్నుకున్నది. పుష్కిన్ పద్యం చదువుతున్న స్టాలిన్ ప్రతిమ అది!

పి. మదనమోహన్ రావు (గూడూరు)

Edited, Printed and Published by S. Radhakrishna at the Andhra Patrika Press 6 & 7 Thambuchetty Street Madras-1. Chief Editor: S. Sambhu Prasad.



అకులో ఆకు

ఫోటో: ఎం. అప్పా[illegible](దాసు)


అంద
చందమునకు
రెమి
Remy
స్నో & పౌడర్